ఎఎంఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 5 సంచిక: 5

జూన్, 2013

ఎడిటర్
**శశిభూషణ్ కుమార్** ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
**డా॥ సి. నాగరాజు**
**హెచ్. కూర్మారావు**
**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**
**డా॥ కె. ఆసయ్య**
**శ్రీమతి ఆర్. శివపార్వతి**
**ఎ. నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**
**& కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. - అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని అపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ........ 2
"ఇందిరమ్మ కలలు" ........ 3
దీపం పథకం పై సమీక్ష ........ 4
అపార్డ్ కమీషనర్‌గా శ్రీ శశిభూషణ్ కుమార్, ఐ.ఏ.ఎస్. ........ 5
సి.డి.ఎస్. డైరెక్టర్ జనరల్‌గా శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్) ........ 6
అభివృద్ధి అంశాలకు బడ్జెట్ కేటాయింపులలో పౌరసమాజ ప్రమేయం అవసరం! ........ 6
పుడితే ఆడపిల్లగానే పుట్టాలి "బంగారుతల్లి" ........ 7
ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల మధ్య సమన్వయం అవసరం ........ 8
అడవిని దున్నుతున్న అక్కాచెల్లెళ్లు ........ 9
పర్యావరణం పరిరక్షణ మనిషి జీవితం ........ 11
పంచాయతీ రాజ్ సంస్థల పరిపుష్టికై "రాజీవ్ గాంధీ పంచాయత్ సశక్తీకరణ్ అభియాన్". 13
పథకానికి పది ప్రశ్నలు – రాజీవ్ యువకిరణాలు ........ 17
మందీ మార్బలం లేకుండా ప్రధానమంత్రి పల్లెలో తిరిగి రైతు ఇంట్లో బస చేసిన వేళ ........ 19
భవిష్యత్ తరాల వారికి సముద్రపు నీరే ఆధారమా ! ........ 22
గ్రామ సీమల అభివృద్ధి లక్ష్యంగా 'పుర' (PURA) పథకం ........ 24
క్షామ- దుర్భిక్ష పీడిత ప్రాంతాలకు అనువైన పంట "కీన్ వా" ........ 25
గ్రామ పునర్నిర్మాణానికి చేయూతనిస్తున్న మోత్కూర్ గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ..... 27
సంపూర్ణ పారిశుద్ధ్యంతో దేశ గౌరవాన్ని పెంచుదాం ........ 28
ఉపాధి హామీ పథకం ద్వారా కూరగాయల సాగు ........ 31
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల అపూర్వ విజయాలు ........ 32
సుస్థిర వ్యవసాయానికి భూసార యాజమాన్య పద్ధతులు ........ 34
మందుల పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టాలి ........ 36
పంటలలో అధికోత్పత్తికి విత్తనాలే ఆధారం ........ 37
ప్రతి గ్రామానికి ఒక చెరువు కావాలి ........ 38
20 సూత్రాల కార్యక్రమం అమలులో హాట్రిక్ సాధించిన ఆంధ్రప్రదేశ్ ........ 40
పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధానికి చట్టం ........ 41
రాష్ట్రంలో ఎస్.సి., ఎస్.టి. ఉపప్రణాళికలకు 2012-13 సంవత్సరంలో నిధుల కేటాయింపులు, వినియోగం ........ 45
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా పథకం – ముఖ్య విషయాలు (ఎపిజిఎల్ఐ) ........ 49
అతివాహకాలు – అద్భుతాలు ........ 51
జాతీయ అభివృద్ధిలో పిల్లల పారిశుద్ధ్యం ఆవశ్యకత ........ 53
ఎండలో తిరగొద్దు ........ 56
గోరుచిక్కుడుతో ఎన్నో ఉపయోగాలు ........ 57
రైతు బజార్లకు మరింత బలం చేకూర్చాలి ........ 58
పేదల జీవనోపాధి పెంపుదలకు సమగ్ర వాటర్‌షెడ్ యాజమాన్య కార్యక్రమం ........ 59
ఏరువాక పౌర్ణమి ........ 63

# ఆలోచిద్దాం... పొదుపు చేద్దాం

'కూటి కోసమే కోటి పాట్లు', 'కోటి విద్యలు కూటి కొరకే' అని సామెతలు. 'తిండి కలిగితే, కండ కలుగునోయ్' అని గురజాడ కవిత. మనుషులకైనా, జంతువులకైనా గాలి, నీరు తరువాత తిండి అత్యవసరం. ప్రాణాలు నిలుపుకోవడానికి, ఆరోగ్యంగా బతకడానికి ఆహారం కావాలి. అందులోనూ సమతులాహారం కావాలి. పోషకాహారం కావాలి. అందుకే ఆహారానికి అంత ప్రాధాన్యం మరి.

ప్రతి ఏటా జూన్ 5న జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, ఈ సారి ఐక్యరాజ్య సమితి "ఆలోచించండి - తినండి - పొదుపు చేయండి" అనే నినాదాన్ని థీమ్‌గా ఎంపిక చేసింది. 1972లో మానవ పర్యావరణంపై స్టాక్ హోమ్‌లో ప్రారంభమైన కాన్ఫరెన్స్ సందర్భంగా ప్రతి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. పర్యావరణానికి సంబంధించి పలు సమస్యలపై ప్రజల్లో, ప్రభుత్వాల్లో అవగాహన పెంచడానికి ఒక్కొక ఏడాది ఒక థీమ్‌ని ఐక్యరాజ్య సమితి ఎంపిక చేస్తుంది.

ఈ భూమిపై జీవిస్తున్న ప్రజలందరికీ అవసరమైన ఆహారం కంటే ఎక్కువగానే పండిస్తున్నారు. అయినప్పటికీ, దాదాపు 87 కోట్ల మంది చాలీ చాలని ఆహారంతో సరిపెట్టుకుంటున్నారు. మరో పక్క ఏడాదికి 1.3 బిలియన్ టన్నుల ఆహారం వృధా అవుతోంది. అదే సమయంలో ప్రపంచంలోని ప్రతి ఏడుగురిలో ఒకరు ఆకలి బాధను అనుభవిస్తున్నారు. ఐదేళ్లలోపు పిల్లల్లో రోజుకి 20,000 మంది ఆకలితో మృత్యువాత పడుతున్నారు.

మరోవైపు ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి వినియోగమయ్యే సహజ వనరులతో పర్యావరణంపై పెను ప్రభావం పడుతోంది. ఉదాహరణకు ఒక లీటరు పాలు తయారు కావడానికి 1000 లీటర్ల నీరు ఖర్చవుతుంది. ఒక కిలో మాంసం ఉత్పత్తి కావడానికి 10 నెలల పాటు ఒక ఇంటిలో వాడేంత నీరు ఖర్చవుతుంది. ఈ విధంగా చూస్తే, ఆహారాన్ని పండించడానికి, రవాణా చేయడానికి ప్రకృతిలోని వనరులు చాలా ఖాళీ అయిపోతుంటాయి. మన కళ్లకు కనపడేదానికి అనేక వందల రెట్ల ప్రభావం పర్యావరణంపై పడుతుంది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ తక్కువ పెట్టుబడితో, పర్యావరణ అనుకూల విధానాల ద్వారా అధిక ఉత్పత్తులను సాధించటానికి మనమందరం కర్తవ్యోన్ముఖులం కావాలి. ప్రపంచ వ్యాప్తంగా, ఆవాసయోగ్యమైన భూభాగంలో 25% మేరకు భూమిని ఆహార ఉత్పత్తి కోసం వినియోగించవలసి వస్తున్నది. తాజా నీటిలో 70% ఆహార ఉత్పత్తికే ఖర్చయిపోతున్నది. అంతే కాదు, 30% గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలకు కారణం ఆహారోత్పత్తి మాత్రమే. జీవ వైవిధ్య నష్టానికి, భూమి వాడకంలో మార్పులకు కూడా ఆహారోత్పత్తి కారణమవుతోంది.

ఐక్యరాజ్యసమితి ఈ థీమ్‌ని ఎంపిక చేయడానికి ప్రధాన కారణం ప్రపంచ వ్యాప్తంగా ఆహారాన్ని పెద్ద ఎత్తున వృధా చేయటమే. ఆహార ధాన్యాలలో 30 శాతం, దుంపలు, పండ్లు, కూరగాయలలో 40 నుంచి 50 శాతం, నూనె గింజలు, మాంసం, పాలు, పాల ఉత్పత్తులలో 20 శాతం, చేపలలో 30 శాతం వృధా అవుతున్నాయని అంచనా.

ఇళ్లలో అవసరానికి మించి వండటం వల్ల, చాలా ఆహారం మిగిలిపోయి పనికి రాకుండా పోతుంది. ఫంక్షన్లలో గొప్పలకు పోయి మితిమీరిన సంఖ్యలో ఆహార పదార్థాలను తయారు చేయటం వల్ల చాలా ఆహారం వృధా అయిపోతుంది. నాణ్యత బాగున్నప్పటికీ, నచ్చని రంగులో, ఆకారంలో, సైజులో లేనందుకు మార్కెట్లలో చాలా ఆహార పదార్థాలను పార వేస్తుంటారు. ఇలాంటి అలవాట్లు అన్నీ మానవాళికి ముప్పు తెచ్చేవే. రైతులకు వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి సరైన సదుపాయాలు లేక కూడా పెద్ద ఎత్తున ధాన్యం వృధా అవుతుంది.

ఆహార వృధాను అరికట్టటం వల్ల మనం ధనాన్ని, వనరులను పొదుపు చేయవచ్చు. అంత కంటే ముఖ్యంగా అత్యంత విలువైన భూసారాన్ని, నీటిని, విద్యుత్‌ను పొదుపు చేయవచ్చు. ఈ విషయంలో స్థానిక సంస్థలపై గురుతరమైన బాధ్యత ఉంది. ప్రజల్లో అవగాహన కల్పించటంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునే సరైన విధానాల గురించి రైతులకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉంది. అంతేకాదు. పంచాయతీల వద్దనున్న వనరులతో గ్రామ స్థాయిలోనే నిల్వ సౌకర్యాలను కల్పించవచ్చు. తద్వారా పర్యావరణాన్ని కూడా పదికాలాల పాటు పరిరక్షించుకోవచ్చు. ప్రతి ఒక్కరికీ ఆహారం అందుబాటులోకి తీసుకుని రావడానికి భూమిని, పర్యావరణాన్ని, వనరులను కాపాడుకోవటానికి ఈ చర్యలు దోహదపడతాయి.

( శశి భూషణ్ కుమార్ )




# "ఇందిరమ్మ కలలు"

## ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉపప్రణాళికా చట్టం - 2013

**ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సత్వర అభివృద్ధి కోసం సమాన అవకాశాలు, సమాన హెూదా, సమాన సౌకర్యాలు కల్పించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉపప్రణాళిక చట్టం - 2013 తీసుకొని వచ్చింది. "ఇందిరమ్మ కలలు" అనే కార్యక్రమం ద్వారా ఈ చట్టాన్ని మండల్ పరిషత్ అభివృద్ధి అధికారి నాయకత్వాన తహశీల్దార్, పంచాయితీ రాజ్ ఇంజనీర్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఇంజనీర్, హౌసింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, ఇతర మండల స్థాయి అధికారులతో గ్రామాలలో, ఎస్‌సి/ఎస్‌టి ఆవాస ప్రాంతాలలో గ్రామ సభలు ఏర్పాటు చేసి ఈ చట్టం గురించి తెలియని వారి ఆవాస ప్రాంతాలలో అవసరమైన మౌలిక వసతులు, డ్రెయిన్లు, సిమెంట్ రోడ్లు, వివిధ అవసరాలను గుర్తించడాన్ని ఈ ఇందిరమ్మ కలలు కార్యక్రమంలో చేపట్టటం జరుగుతోంది.**



### ఎస్‌సి/ఎస్‌టి చట్టం ఆవశ్యకత

చారిత్రాత్మకమైన ఈ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారత దేశంలోనే ప్రప్రథమంగా తీసుకురావడం జరిగింది. 5వ పంచవర్ష ప్రణాళికా (1974 - 75) కాలంలో షెడ్యూల్డ్ తెగల కోసం ఉపప్రణాళిక ను, 6వ పంచవర్ష ప్రణాళికా (1979-80) కాలంలో షెడ్యూల్డ్ కులాల కోసం ఉపప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. షెడ్యూల్డ్ తెగలు,షెడ్యూల్డ్ కులాల కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రత్యేక రక్షణల ఆధారంగా ఆయా వర్గాలకు చెందిన జీవన ప్రమాణాల్ని వేగవంతంగా మెరుగు పరచడం కోసం, అసమానతలను తొలగించడం కోసం "ఉప ప్రణాళికా వ్యూహాన్ని" చేపట్టడం జరిగింది. ఆయా ప్రణాళికల కోసం కేటాయింపులు చేయడానికి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కోసం మైనర్ హెడ్‌లను కేటాయించి ఉపప్రణాళికను సమర్థవంతంగా నిర్వహించాలని శ్రీమతి సోనియా గాంధీ అధ్యక్షతన పనిచేస్తున్న జాతీయ సలహా మండలి రాష్ట్ర ప్రభుత్వానికి సూచన ఇచ్చింది.

ఉపప్రణాళికల అమలును అధ్యయనం చేసి మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి తగిన సూచనలు చేయటం కోసం ఉపముఖ్యమంత్రి శ్రీ దామోదర రాజ నర్సింహ అధ్యక్షతన

# దీపం పథకం పై సమీక్ష





**గుంటూరు జిల్లా తాడికొండ నియోజక వర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ డి. మాణిక్యవరప్రసాద రావు దీపం పథకంపై 03.05.2013 న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిరంగిపురం మండలంలో 1200 మంది, తుళ్లూరు మండలంలో 600 మంది లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.**

అదే విధంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల-ప్రగతిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను సంప్రదించి త్వరగా లబ్ధిదారులకు కనెక్షన్లు అందేలా చూడాలని సూచించారు. త్రాగు నీటిపై సమీక్షిస్తూ పొన్నెకల్లు గ్రామంలోని ఒక ప్రైవేటు నేల బావి ద్వారా ఈ వేసవిలో ప్రజలు త్రాగునీరు వాడుకోవడానికి యజమానితో సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ క్రింద తాడికొండ నియోజక వర్గ పరిధిలో ఏఏ స్కీమ్‌లకు ప్రజల నుంచి ప్రతిపాదనలు అందాయో వాటి వివరాలు తెలియజేయాలని అధికారులను కోరారు. అదే విధంగా తాడికొండ మండలంలో ఇటీవల ప్రమాదం సంభవించిన అంగన్ వాడీ బిల్డింగ్ స్థలంలో కొత్తగా మరో భవనం నిర్మించేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు జాయింట్ కలెక్టర్ వెంకట్రావు, డ్వామా పిడి శ్రీ అనిల్ కుమార్, ఎంపిడివో వసంత లక్ష్మి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీ సీతారామయ్య, మరియు ఆర్‌డబ్ల్యూ ఎస్.ఇ. పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు. ■

ఏప్రిల్ 2012 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో పర్యటించి ఆయా వర్గాలకు చెందిన ప్రజలతో, సంఘాలతో, ప్రజా ప్రతినిధులతో, వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో సుదీర్ఘంగా చర్చించింది. ఆ చర్చల మేరకు ఉపప్రణాళికలను సమర్ధవంతంగా అమలు చేయడానికి వాటికి చట్టబద్ధత కల్పించవల్సిందిగా ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఆ సిఫార్సు మేరకు 2012 డిసెంబర్‌లో ప్రత్యేకంగా శాసన సభ, శాసన మండలి సమావేశాలు నిర్వహించి ముసాయిదా చట్టాన్ని, చర్చించి, 24 జనవరి 2013 లో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకురావడం జరిగింది.

### ముఖ్య ఉద్దేశ్యాలు

- షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలకు, తక్కిన జనాభాకి మధ్య అభివృద్ధిలో ఉన్న అంతరాల్ని రానున్న 10 సంవత్సరాల కాలంలో పూరించే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడం.
- ఎస్‌సి/ఎస్‌టిల అభివృద్ధి కోసం రాష్ట్ర జనాభాలో ఉన్న షెడ్యూల్డ్ కులాలు, తెగల జనాభా నిష్పత్తి మేరకు రాష్ట్ర ప్రణాళిక నిధుల నుంచి కేటాయింపు చేయుటం.
- ఎస్‌సి/ఎస్‌టి తెగల సాంఘిక భద్రత, సామాజిక గౌరవం లక్ష్యంగా వారి ఆర్థికాభివృద్ధి, విద్య, మానవ వనరులను బలోపేతం చేయడానికి పథకాలు అమలు చేయడం, వారిలో వారికి గల అంతర్గత వ్యత్యాసాలను కూడా తగ్గించడం.
- ఉప ప్రణాళికలను సమర్ధవంతంగా అమలు చేయుటానికి, అమలును పర్యవేక్షించడానికి యంత్రాంగాన్ని సన్నద్ధ పరచడం, పటిష్ట పరచడం.





### సంస్థాగతమైన ఏర్పాట్లు

- షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళికకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖని నోడల్ శాఖగా, షెడ్యూల్డ్ తెగల ప్రణాళికకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖను నోడల్ శాఖగా గుర్తించడం జరిగింది.
- ఈ ఎస్‌సి/ఎస్‌టి ప్రణాళికలను రూపొందించి, ప్రతిపాదించడానికి,

# అపార్డ్ కమీషనర్‌గా శ్రీ శశిభూషణ్ కుమార్, ఐ.ఏ.ఎస్.



**ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (అపార్డ్) కమీషనర్‌గా శ్రీ శశి భూషణ్ కుమార్, ఐ.ఎ.ఎస్. ఇటీవల అదనపు పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1996 ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన శ్రీ శశి భూషణ్ కుమార్ మే 2006 నుండి ఫిబ్రవరి 2009 వరకూ ఖమ్మం జిల్లా కలెక్టరుగా పని చేశారు. తదుపరి బదిలీపై వై.యస్.ఆర్. కడప జిల్లా కలెక్టరుగా జూన్ 2011 వరకూ ప్రజలకు సేవలందించారు. అనంతరం రాష్ట్రస్థాయిలో మునిసిపల్ పరిపాలన శాఖ లోనూ, యువజన సంక్షేమం, పర్యాటక, సాంస్కృతిక శాఖల్లో డైరెక్టర్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఆయన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA), సమగ్ర నీటి పరీవాహక ప్రాంత అభివృద్ధి వంటి కీలకమైన కార్యక్రమాలు అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖకు కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.**

అపార్డ్ ప్రతిష్టాత్మకంగా అమలు చేసన్తున్న పలుశిక్షణా కార్యక్రమాలతో పాటు కీ-క్యాప్ వంటి ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల్లో భాగంగా దాదాపు 38500 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు 2500 పైగా గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న తరుణంలో అపార్డ్ కమీషనర్‌గా శ్రీ శశి భూషణ్ కుమార్ నియమితులు కావటం ప్రాధాన్యత సంతరించుకుంది. ■





అమలుకు, సమీక్షించటానికి ఆయా శాఖామాత్యుల అధ్యక్షతన ఒక నోడల్ ఏజన్సీని నియమించారు.

- రాష్ట్రంలో ఎస్‌సి/ఎస్‌టి తెగల అభివృద్ధి కోసం ముఖ్య మంత్రి గారి అధ్యక్షతన ఏర్పాటైన కౌన్సిల్‌లో ఉన్నత విద్య, ఆర్థిక శాఖ, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, పంచాయితీ రాజ్, మంచినీటి సరఫరా, రహదారులు, భవనాలు, పరిశ్రమలు, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ప్రాథమిక విద్య, మున్సిపల్ పరిపాలన, గృహనిర్మాణం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రులతో పాటు, రాష్ట్ర ఎస్‌సి/ఎస్‌టి కమీషన్ ఛైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.
- జిల్లాలో అమలు పరచడం కోసం ఆయా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన జిల్లాస్థాయి పర్యవేక్షక కమిటీలను ఏర్పాటుచేయడం జరుగుతుంది.

## నిధుల కేటాయింపు

ఎస్‌సి/ఎస్‌టి తెగల ఉప ప్రణాళికలకు కేటాయించే నిధులు నూరు శాతం ప్రయోజనం కల్గించే విధంగా ఉంటాయి. ఏ ఆవాసాల్లో 40% కన్నా ఎక్కువ మంది ఎస్‌సి/ఎస్‌టి తెగలవారు ఉంటారో, ఆ ఆవాసాల అభివృద్ధికి నిధుల కేటాయింపు జరుగుతుంది. ఆర్థిక సంవత్సరానికి ఆరు మాసాల ముందు ప్రణాళికలు తయారు చేసి రాష్ట్ర మండలికి సమర్పిస్తాయి. ఆ తదుపరి ఎస్‌సి/ఎస్‌టి వర్గాలకు నిధులను కేటాయించడం జరుగుతుంది.

**- కె. కోటేశ్వరరావు,** ఎం.పి.డి.ఓ., ప॥గో॥ జిల్లా

శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఏ.ఎస్. 30, ఏప్రిల్ 2013 తేదీన ఎ.ఎం.ఆర్. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. అనంతరం శ్రీ కె. చంద్రమౌళి సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ డైరెక్టర్ జనరల్‌గా 2, మే 2013 తేదీన పదవీ బాధ్యతలు స్వీకరించారు. శ్రీ చంద్రమౌళి తన సుదీర్ఘ ప్రభుత్వ సర్వీసులో వివిధ శాఖల్లో పనిచేసి గ్రామీణ ప్రజల జీవితాల్లో





# సి.డి.ఎస్. డైరెక్టర్ జనరల్‌గా శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**వెలుగు నింపేందుకు ఇతోధికంగా కృషి చేశారు. ముఖ్యంగా అపార్డు కమీషనర్‌గా పని చేసిన కాలంలో ఆయన చేసిన సేవలకు పలు ప్రశంసలనందుకొన్నారు.**

ప్రజల్లో సమిష్టి తత్వాన్ని, స్వచ్ఛంద సేవాతత్పరతను పెంపొందించే భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణకు స్ఫూర్తినిస్తూ, వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలును ప్రోత్సహించారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో రాష్ట్రంలో సుమారు 38500 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు వివిధ గ్రామాల్లో వారి వారి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలెప్ మెంట్ (అపార్డ్) శ్రీ చంద్రమౌళి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలోనే ఉత్తమ శిక్షణా సంస్థగా గుర్తింపు పొందింది.

సెంటర్ ఫర్ డెవలప్ మెంట్ స్టడీస్ (అభివృద్ధి అధ్యయన కేంద్రం) ఒక ప్రత్యేక విజ్ఞాన సముపార్జనా కేంద్రంగా పని చేస్తోంది. అంతేకాక సాంఘిక, ఆర్థిక, సామాజిక అంశాలపై అధ్యయనం చేసి తన సలహాలతో ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తుంది. గ్రామీణాభివృద్ధిలో నిరుపేదలకు తగిన అవకాశాలు కల్పించడానికి సహాయ పడుతుంది. విదేశీ సంస్థల ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసి ప్రభుత్వ కార్యక్రమాల అధ్యయనం కోసం ఉపయోగిస్తుంది. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ■

# అభివృద్ధి అంశాలకు బడ్జెట్ కేటాయింపులలో పౌరసమాజ ప్రమేయం అవసరం!

**భారతదేశ బడ్జెట్ తయారీ, ఆమోదింపచేయటంలో సివిల్ సొసైటీలను సంప్రదించడం ద్వారా వాస్తవిక అవసరాలకు దగ్గరగా అభివృద్ధి అంశాలకు కేటాయింపులు జరుగుతాయని, అందుకు తగిన పాత్రను కల్పించ వలసిన అవసరం ఉందని రెండు రోజులపాటు 'బడ్జెట్ గ్రూప్స్ ఇన్ ఇండియా' వారు అపార్డ్‌లో నిర్వహించిన సమావేశం అభిప్రాయపడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించిన జె.ఎన్.యూ. ప్రొఫెసర్ అమితాబ్ కుండూ 'దేశంలో పెరుగుతున్న పేదరికానికి అనుగుణంగా, దాని నిర్మూలించేందుకు వాస్తవిక దృక్పథంతో కేటాయింపులు చేయాల'ని సూచించారు. మానవ అభివృద్ధి నివేదికలో భారతదేశంలో సమస్యల**



**పరిష్కారానికి కేటాయించిన బడ్జెట్ తగినంతగా లేక పోవటం వలన మధ్యలోనే పథకాల అమలు ఆగిపోతున్నదని అన్నారు. అభివృద్ధి ఇండికేటర్లను బట్టి కేటాయింపులు జరిగినా, ఖర్చు చేయడంలో వ్యత్యాసాలను తొలగించాలన్నారు. అపార్డ్ సెంటర్ ఫర్ డవలప్ మెంట్ స్టడీస్, డైరెక్టర్ జనరల్ శ్రీ కె చంద్రమౌళి మాట్లాడుతూ, 'ఖర్చు చేసే ప్రతి రూపాయి సామాన్యుని జీవితం మెరుగు పరచాలని, కాని అవి దోపిడీ దారులకు అందుతున్నాయని' విచారం వ్యక్తం చేశారు.**

రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ ఎస్.పి. టక్కర్, ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ, 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులలో పార దర్శకతను పాటిస్తూ ఉద్యోగిత, చదువు, వసతులు, సామాజిక ఇన్‌ఫ్రాస్టక్చర్‌ను సృష్టించేందుకు ఖర్చు చేస్తుందని' వివరించారు.

బడ్జెట్ కేటాయించే ముందు కేంద్రంలోను, రాష్ట్రాలలోను సివిల్ సొసైటీల వారిని సంప్రదించటం ద్వారా వాస్తవిక సమస్యల పరిష్కారానికి మార్గం సులభం అవుతుంది. ఈ కార్యక్రమంలో సివిల్ సొసైటీ పతినిధులు డా. పాల్ దివాకర్, సి.ఎస్.ఆర్.డి. అధ్యక్షులు ఎమ్.ఎస్ హిల్డాసిల్‌హా, తదితరులు పాల్గొన్నారు. ఈ రెండు రోజుల సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ■



ఆడపిల్ల పుడితే ఇంట్లో మహాలక్ష్మి పుట్టిందని మురిసిపోతాం కానీ, దురదృష్టవశాత్తు ప్రస్తుతం గ్రామాల్లో ఆ పరిస్థితి లేదు. పుట్టేబిడ్డ ఆడబిడ్డ అని

# పుడితే ఆడపిల్లగానే పుట్టాలి "బంగారుతల్లి"



**తెలిస్తే పుట్టక ముందే అబార్షన్ చేయించుకుంటున్నవారు కొందరైతే, పుట్టిన తరువాత వదిలించుకుంటున్నవారు మరికొందరు.**

అందుకే సమాజంలో ఆడపిల్లల సంఖ్య నానాటికీ తరిగిపోతున్నది. 2001 జనాభా లెక్కల ప్రకారం, మన రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది పురుషులకు 962 మంద్రి స్త్రీలు ఉన్నారు. 2011 నాటికి ఆ నిష్పత్తి 943కి పడిపోయింది. ఆడపిల్ల పుడితే, ఆ పిల్ల వారి తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండేందుకు "బంగారు తల్లి" పేరిట కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

దారిద్ర్య రేఖకు దిగువున ఉండి (బి.పి.ఎల్) తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లో 2013 మే 1 తరువాత ఆడపిల్ల పుడితే బంగారు తల్లి పథకం క్రింద ఆసుపత్రి ఖర్చుల నుండి కాలేజీ చదువులు చదివే వరకూ ప్రతి సంవత్సరం ప్రోత్సాహకాలు అందజేయడమే కాక, చదువు పూర్తి కాగానే ఆ మహిళకు అదనంగా 100000 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఆడపిల్ల పుట్టినప్పటినుండి ఉచిత విద్యను అందించి, ఆర్థిక భద్రత కల్పించే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.

**బంగారు తల్లి పథకం ద్వారా కలిగే పయోజనాలు**

మహిళ తను గర్భవతిగా నమోదు చేసుకోగానే 1000 రూపాయలను ఆ మహిళకు అందజేయడం జరుగుతుంది, ఆడపిల్ల పుట్టినట్లు ఆసుపత్రిలో నమోదైతే, వెంటనే ఆ తల్లికి రూ.2,500 అందజేస్తారు. ఆ బిడ్డకు టీకాలు, సంరక్షణ కోసం ఏడాదికి 1000 రూపాయలు అందజేయడం జరుగుతుంది. అంగన్‌వాడీ బడిలో చేరిన తర్వాత ఏడాదికి 1500 చొప్పున చెల్లిస్తారు.

ఆ పాపకు ఉచిత విద్యనందించేందుకు ఒకటోతరగతి నుండి 5వ తరగతి వరకూ ఏడాదికి 2000 రూపాయలు, 6వ తరగతి నుండి 8వ తరగతి వరకు ఏడాదికి 2,500 రూపాయలు, 9,10 తరగతులకు సంవత్సరానికి 3000 రూపాయలు, ఇంటర్మీడియెట్‌లో సంవత్సరానికి 3500 రూపాయలు, డిగ్రీలో ఏడాదికి 4000 రూపాయల చొప్పున మొత్తం 55,500 రూపాయలను ఆ ఆడపిల్లకు ఖర్చు చేయడం జరుగుతుంది.

డిగ్రీ తరువాత ఆడపిల్లకు ఆర్థిక సాయంగా 10000 రూపాయలు అందజేయడం జరుగుతుంది. ఒకవేళ ఇంటర్మీడియెట్‌తోనే చదువు ఆపివేసిన వారికి 50000 రూపాయల ఆర్థికసాయం అందుతుంది. 18 ఏళ్లకు ఆడపిల్లలకు పెళ్ళి చేసినా ఈ పథకం క్రింద లబ్ధి చేకూరుతుంది.

ఆడపిల్లల కోసం ప్రస్తుతం అమలవుతున్న జననీ సురక్షాయోజన, సుఖీభవ, రాజీవ్ విద్యాదీవెన, ప్రి-పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు మొదలైన పథకాలు యధావిధిగా బంగారుతల్లి పథకంతో పాటు అందడం విశేషం. బాలురతో పాటు బాలికల నిష్పత్తి సమానంగా పెరగడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

# ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల మధ్య సమన్వయం అవసరం




**అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ స్థాయిలో సమన్వయం చేసేందుకు ప్రభుత్వం - ప్రభుత్వేతర వ్యవస్థల మధ్య బంధం పెంచుకొనవలసిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర జి.ఓ. ఎన్.జి.ఒ. సమన్వయకమిటి ఉపాధ్యక్షులు శ్రీ టి. గోపాలరావు, ఐఏఎస్ (రిటైర్డ్) అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఎన్‌జీవోలతో సమావేశాలను నిర్వహించి జి.ఓ.- ఎన్‌జీఓ సమన్వయ సంఘాలను ఏర్పరచటం జరిగిందని ఆయన అన్నారు. గ్రామాలలో రోడ్లు, విద్య, మంచినీరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను పటిష్టంగా అమలు జరిగేటట్లు చూడడంలో రెండు విభాగాలు మంచి సహాయ సహకారాలతో పనిచేస్తూ మంచి ఫలితాలను సాధించవచ్చునని శ్రీ టి. గోపాలరావు సూచించారు.**

సెంటర్ ఫర్ డెవలెప్‌మెంట్ స్టడీస్ డైరెక్టర్ జనరల్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిలో ఆశించిన అభివృద్ధి రావడం లేదని, అందుకు గ్రామాలలో పని చేయాలనే చిత్త శుద్ధి కలిగిన అధికారులను నియమించవలసిన అవసరం ఉందని అన్నారు. గ్రామాలలో సమస్యలు పరిష్కరించినా పునరావృతం అవుతుంటాయని, అందుకు ఎన్.జి.ఓ లు అప్రమత్తంగా ఉండి గ్రామ ప్రజల అవసరాలైన త్రాగునీరు, విద్య, రోడ్లు, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, తదితర అంశాలన్నింటినీ పరిరక్షించుకొనవలసిన అవసరం ఉందని కె. చంద్రమౌళి అన్నారు. ఆయన గ్రామాలలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్రను గూర్చి వివరణాత్మకంగా ప్రసంగిస్తూ, గ్రామాలలో వివిధ వర్గాలు ఏ విధంగా పనిచేస్తాయో వివరించారు.

ఈ శిక్షణా కార్యక్రమాన్ని జి.ఓ.-ఎన్‌జిఓ సెల్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ & వాలంటరీ ఏక్షన్‌లు సంయుక్తంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి దాదాపు 65 మంది ఎన్‌జిఓ ప్రతినిధులు రాష్ట్రం మొత్తం నుండి పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో సమన్వయం చేసేందుకు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల మధ్య సమన్వయం ఎంతో అవసరం అని రాష్ట్ర జి.ఓ.ఎన్.జి.ఓ కమిటీ వైస్ ఛైర్మన్ శ్రీ టి. గోపాలరావు అన్నారు. 17.05.2013న అపార్డ్‌లో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సమన్వయం అనే అంశంపై ప్రారంభమైన రెండు రోజుల కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. ■



# అడవిని దున్నుతున్న అక్కాచెల్లెళ్లు

**ఆదిలాబాద్ జిల్లాలో రెండుకొండల వరుసలు పశ్చిమం నుండి తూర్పుకు సమాంతరంగా సాగుతాయి. సత్మల, నిర్మల కొండల మధ్య లోయలో గోదావరికి  ఉపనది కడెం నది ప్రవహిస్తోంది... దీనికి సమీపంలోని  కవ్వాల్ అభయారణ్యాల మధ్యలో చుట్టూ ఎత్తయిన ఆకుపచ్చ కొండల మధ్య ఉన్న కుగ్రామం ఖానాపూర్ మండలంలోని అడవి సారంగపూర్. చుట్టూ చిక్కని అడవి. పొద్దుగూకితే జంతువులు తప్ప మనుషుల కన్పించరు. ఇక్కడ ఆదివాసీలు అక్కడక్కడా విసిరేసినట్లున్న పూరిళ్లలో బతుకుతుంటారు.**

అడవి సారంగపూర్‌లో కాలినడకపై గుబురు పొదల మధ్య అడవిపూల పరిమళాలు పీల్చుతూ, కాళ్లను చుట్టే బొడ్డుకాకర పొదులో, పసరిక పాములనో తప్పించుకుంటూ, దారికి అడ్డంగా తిరుగుతున్న నెమళ్లను చూసుకుంటూ అడవిలో మైలుదూరం వెళ్తే రెండెకరాల పొలంలో ఉసిరి, మామిడి చెట్ల మధ్య పెరుగుతున్న మొక్కజొన్న తోటలో పెద్ద బావి. దాని పక్కనే ఎర్రని పెంకులు కప్పిన చెక్కల పూరిళ్ళు కనిపిస్తాయి. కొంచెం దూరంగా పండ్లతోటలో కలుపు మొక్కలు ఏరుతూ కన్పిస్తారు- యాభై ఏళ్లు దాటిన ఆదివాసీ అక్కాచెల్లెళ్లు కల్లెం గంగవ్వ, పోశవ్వ.

ఎందుకూ పనికిరాని బంజరు భూమిలో బంగారం పండిస్తున్న వీరికి అక్కడి భూమితో పాటు జంతువులు కూడా ఎలా మచ్చికయ్యాయో చూద్దామా?

### తోటలతో పాటు మేమూ ఎదుగుతున్నాం!

"ఇక్కడకు రెండు మైళ్ల దూరంలో ఉన్న కొండల మీదే పుట్టి పెరిగాం. 30 ఏళ్ల వరకూ అక్కడే కూలిపనులు, వ్యవసాయం చేసుకొని బతికాం. ఈ ప్రాంతంలో పంటలు పండించలేక చాలా మంది పట్టణాలకు పోయి పనులు చేసుకుంటున్నారు. కానీ కొంచెం కష్టపడితే ఈ అడవిలో కూడా సాగు చేయవచ్చు అనే నమ్మకంతో... భర్త పోయాక మాకున్న రెండెకరాల పట్టా భూమిలో ఒక ఎకరాలో మొక్కజొన్నలు పండిస్తున్నాం. మా చెల్లె పోశవ్వ నాకు తోడుగా ఇక్కడే ఉంటుంది. మేం పండించుకున్న మొక్కజొన్నల అంబలే రోజూ మా ఆకలి తీరుస్తుంది. ఈ భూమి మీదున్న మా మమకారాన్ని తెలుసుకున్న సర్కారోళ్లు (జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు) మాకు అండగా ఉండి ఎకరాకు సరిపడా ఉసిరి, మామిడి మొక్కలిచ్చి పెంచమన్నారు. ఎలా నాటాలో, వాటికి కావాల్సిన ఎరువులు సొంతంగా ఎలా చేసుకోవాలో చెప్పారు.

నాకు సాగు చేయాలంటే పిల్లలను సాకినంత ఆనందంగా ఉంటుంది. వారిచ్చిన మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. చక్కగా పెరుగుతున్నాయి. వాటితో మేము కూడా ఎదుగుతున్నాం... మామిడి చెట్లతో పాటు టమాటాలు, వంకాయలు, బెండకాయలు కూడా పండించుకుంటున్నాం. ఒకపుడు కూరగాయల కోసం చాలా దూరం పోయి కొనేవాళ్లం. ఇపుడు మేమే పండించుకొని తినడమే కాక మా పక్కోళ్లకు పంచుతున్నాం" అంటూ ఎర్రపెంకుల ఇంటి పక్కనే ఉన్న బావి అంచుమీద కూర్చొని చెప్పింది గంగవ్వ.

ఇదంతా చెపుతున్నపుడు ఆ గిరిజన మహిళ ముఖంలో రెక్కల కష్టం తరువాత పొందే తృప్తి కనిపించింది. దట్టమైన అడవి మధ్య సకల సౌకర్యాల పట్టణ ప్రపంచానికి దూరంగా ఉన్నాం అనే భావన వారిలో ఏ మాత్రం లేదు. తమ పొలంలో సాగు బాగా చేయాలి... ఎవరూ పండించనంతగా మామిడిపండ్లు పండించాలి. అవి అందరికీ అందాలి. దానికోసం ఎంతైనా కష్టపడాలనే లక్ష్యం గంగవ్వ, పోశవ్వల ను ఒంటరితనానికి, భయానికి దూరం చేసింది.

### మా గుడెసె చుట్టూ గుడ్డేలుగులు....

ఒంటరిగా ధైర్యంగా వ్యవసాయం చేస్తున్న ఈ గిరిజన అక్కాచెల్లెళ్లకు ప్రకృతే తోడూ నీడ. వీరి తోటల పెంపకంలో రసాయన ఎరువులు మచ్చుకైనా కానరావు. పశువుల పేడనే ఎరువుగా వాడుతూ నేలను కాపాడుతున్నారు. పొలం తడపడానికి పాడు పడిన బావిలో నీళ్లు పనికొస్తాయి. కానీ వీరి గొంతు తడవదు. ఒక పక్క మొక్కల సాగు చేసుకుంటూ మరో వైపు జంతువుల మధ్య రెండు మైళ్ల దూరం అడివి మార్గాన పోయి కుండల్లో మంచి నీళ్లు తెచ్చుకోవాల్సిందే... స్వేదంతో సేద్యం చేస్తున్న వీరికి ఏపుగా పచ్చగా ఎదుగుతున్న తమ ఉసిరి, మామిడి, సపోటా చెట్లను చూస్తుంటే ఈ కష్టాలేవీ గుర్తుకు రావంటుంది గంగవ్వ చెల్లెలు పోశవ్వ.

''పచ్చటి మొక్కల పెంపకంలో మేం పడిన కష్టాల్ని మర్చి పోతున్నాం. తోటలకు నీళ్లకోసం పాడుపడిన బావి ఒక్కటే ఆధారం. నాబార్డు వారు మాకు మోటార్లు, పైపులు కొనడానికి సాయం చేశారు. పైపుల ద్వారా చుక్కల సేద్యం చేసుకుంటున్నాం. వంటపని కొంచెం సులువు అవడానికి పొగరాని పొయ్యిలు ఇచ్చారు. దీనివల్ల కట్టెలు ఎక్కువ కావు. పొగ బాధ ఉండదు. వంట తొందరగా అవుతుంది. మాకేం పెద్ద ఆశలు లేవు. పండ్ల తోటలు బాగా పెరిగి నాలుగు కాయలు కాస్తే అంతే చాలు. దాని కోసం మా రెక్కలు ముక్కలు చేసుకుంటాం. మాకున్న బావిలో నీళ్లు పొలానికి తప్ప తాగడానికి పనికి రావు. ఇక్కడ బోరు వేద్దామన్నా నాలుగడుగులు తవ్వితే రాయి తగులుతుంది. అందుకే ఎవరైనా సాయం చేస్తే వచ్చే వేసవిలో ఉన్న బావిలో పూడిక తీసుకొని ఆ నీటితో గొంతులు తడుపుకుంటాం.

ఇక్కడ చీకటి పడితే అడివిపందులు, గుడ్డేలుగులు మా గుడిసె చుట్టూ తిరుగుతుంటాయి. రాత్రులు మా మంచాల కింద తాచుపాములు, కట్లపాములు కదులుతుంటాయి. తెల్లారితే వాటి దారిన అవిపోతాయి. మేం వాటికి అలవాటయి పోవడం వల్లనేమో ఇంతవరకు మాకు హాని చేయలేదు. ఈ అడవి మాకు అలవాటయిపోయింది. భూమితో పాటు అడవి జంతువులు కూడా మాకు మచ్చికయ్యాయి'' అంటుంది పోశవ్వ.

### ప్రకృతే వీరి వ్యవసాయ సంస్కృతి

ఇక్కడి అటవీ ప్రాంతంలో ఎక్కువగా పత్తి పంటలు పండిస్తున్నారు. వీటి వల్ల ఆదాయం బాగా ఉన్నప్పటికీ ఆ పంటలకు వాడే రసాయన ఎరువుల వల్ల భూసారం దెబ్బతింటుందని తెలుసుకున్న ఈ మహిళలు పత్తి పంటలు వేయకుండా పండ్లతోటల పెంపకానికి ప్రాధాన్యత ఇచ్చారు. తాత్కాలిక లాభాలకు ఆశపడకుండా భూసారాన్ని కాపాడడానికే ఈ అడవి బిడ్డలు నడుం బిగించారు. అందుకే రసాయన ఎరువులు వాడకుండా వీరి తోటలకు కావాల్సిన సేంద్రియ ఎరువును సొంతంగా తయారు చేసుకుంటున్నారు.

### అవిశ మొక్కలతో నత్రజని . . .

మామిడి మొక్కల పెంపకంలో ఈ గిరిజన మహిళలు కొత్త పద్ధతులు అనుసరిస్తున్నారు. వ్యవసాయ నిపుణులు సైతం ఆశ్చర్యపోయేలా ప్రయోగాలు చేస్తున్నారు. మండే ఎండల వల్ల మామిడి మొక్కల చిగుర్లు మాడిపోయి పసుపు రంగుకి మారి చెట్టు ఎదుగుదల క్రమంగా తగ్గిపోతుంది. దీని నివారణకు మామిడి మొక్కల పక్కనే అవిశ చెట్లను పెంచుతున్నారు. ఇవి మామిడి మొక్క కంటే పొడవుగా ఎదిగి నీడనిస్తాయి. ఇదే విషయాన్ని పోశవ్వ ఇలా వివరిస్తోంది..

''అవిశ చెట్ల వల్ల మరో గొప్ప మేలు కూడా ఉంది. ఈ చెట్ల వేర్ల ద్వారా మామిడి మొక్కకు నత్రజని అందుతుందని నాబార్డు అధికారులు చెప్పారు. మా పొలంలో ప్రతీ మామిడి మొక్క పక్కనే అవిశ చెట్టును నాటాం. మా పండ్లతోటల పెంపకంలో మరో జాగ్రత్త కూడా తీసుకున్నాం. ఉసిరి, మామిడి మొక్కల మొదళ్ల దగ్గర ఎండాకాలంలో నేల పొడిగా మారిపోయి ఎండిపోతుంది. దీనివల్ల చెట్ల పెరుగుదల తగ్గిపోతుంది. దీని నివారణకు మొక్కల చుట్టూ గడ్డిని పెంచుతున్నారు. ఈగడ్డి వల్ల నేల తడి ఆరకుండా ఉంటుంది. మామిడి కాయలు చేతికి రావడానికి ఏడేండ్లు పడుతుంది. ఈ లోగా మేం బతకడానికి అంతరపంటలుగా జొన్నలు, కూరగాయలు పండిస్తున్నాం.''

వీరి పొలంలోనే పెద్ద తొట్టిని ఏర్పాటు చేసి దాంట్లో వేప కషాయం, గోమూత్రంతో అమృతజలాన్ని తయారు చేసి మొక్కలకు చీడపట్టకుండా పిచికారీ చేస్తున్నారు.

### *వీరి స్ఫూర్తితో....*

పోశవ్వ, గంగవ్వలు పంటలు పండిస్తున్న తీరుని గమనించాక అడవి సారంగపూర్‌కి చెందిన మరో గిరిజన రైతు నాగోరావు తన పొలంలో కూడా కొత్త పద్ధతులు అవలంబిస్తున్నాడు.

''ఇది వరకు నా పొలంలో కాయగూరలు మాత్రమే పండించేవాడిని. నీరు లేక సరిగా పండేవి కావు. గంగవ్వ తన పొలంలో చుక్కల సేద్యం చేస్తున్న తీరు చూసి నా పొలానికి కూడా పైపులు వేయించుకున్నాను. దీనివల్ల కొంచెం నీటిని పొలానికంతా అందించగలుగుతున్నాను. అలాగే అవిశచెట్లు నీడలో పండ్ల మొక్కలను పెంచుతున్నాను. చెట్లు చక్కగా ఎదుగుతున్నాయి... మరింత బాగా సాగు చేయడానికి గంగవ్వ సల హాలు తీసుకుంటున్నాను..'' అంటాడు నాగోరావు.

గంగవ్వ, పోశవ్వల పంటల తీరును గమనించిన నాబార్డు సిజిఎం మోహనయ్య ఏడాది క్రితం తమ గిరిజన అభివృద్ధి నిధి నుండి ఫార్మాకల్చర్ వ్యవసాయ పద్ధతిలో విశేష అనుభవం ఉన్న నర్సన్న ద్వారా వీరి తోటల పెంపకానికి అవసరమైన సేంద్రియ ఎరువులు, నీటి సౌకర్యాలు కల్పించారు. నీరు తక్కువగా ఉన్న చోట డ్రిప్ ఇరి గేషన్‌తో సాగు చేయిస్తున్నారు. తోటల పెంపకంతో పాటు ఈ ప్రాంతంలో గిరిజనుల సామాజిక అభివృద్ధికి, ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. గిరిజన అక్కాచెల్లెళ్ల పంటలను చూసి అడివి సారంగపూర్ గ్రామంలో 45 ఎకరాల్లో 45 మంది గిరిజన రైతులు పండ్లతోటల సాగులో నిమగ్నమయ్యారు.

*- శ్యాం మోహన్*



# పర్యావరణం పరిరక్షణ మనిషి జీవితం

**మనిషి జీవితం తను నివసించే పరిసరాల మీద ఆధారపడి ఉంటుంది. మానవ జీవితం ఎక్కడ నీరు ఉంటే అక్కడనే నిలకడగా ఉంటుంది. తను నివసించే చుట్టు పక్కలనున్న పరిసరాలను సమతుల్యంతో కాపాడు కొనవలసిన అవసరం ఉంది. కాని నేడు ప్రకృతి సహజ వనరులైన నీరు కొరతగా ఉంది. కారణం నీటిని సరియైన రీతిలో నిలువ ఉంచుకొనక పోవడం వలన శుద్ధమైన నీటి వనరుల కొరత బాగా ఏర్పడింది. అంతేగాక నీరు అధికంగా లభించినపుడు వాటిని తగిన రీతిలో నిల్వ చేసుకోని కారణంగా వృధా అవుతూ సముద్రంలో కలిసి పోతుంది. అందుకే మనిషికి కావలసినపుడు తగినంత నీరు దొరకక కొరత ఏర్పడింది. జీవనం ఇతర అవసరాలకు విచ్ఛల విడిగానీరు వాడకంతో నీటి కొరత ఎదుర్కొంటున్నాము. దానితో మార్కెటు దారులు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు వాడకందారుల్లో అనుమానం ను సృష్టంచి ఉచితంగా దొరికే నీటిని అమ్మకంకు పెట్టారు. దానితో మన దేశంలో సులభంగా లభించే నీరు మార్కెట్టు చేసి అమ్ముతున్నారు.**

గ్రామాలలో ఈ నీటి కొరత తీవ్ర రూపం దాల్చింది టెలివిజన్, ఇతర ప్రచారాల వలన నీటి కాలుష్యం మంచి త్రాగు నీటిని గూర్చి ప్రచారం చేయుటతో బాటిల్ నీటిని కొనుక్కుంటున్నారు. దానితో లీటరు నీరు 15 రూపాయలు అమ్ముకొంటున్నారు. లీటరు పాలు గ్రామాలలో 12 రూపాయలిచ్చి సేకరించి దేశీయ మార్కెట్టులో మధ్య వర్తులు (లేదా) పాలకేంద్రాల వారికి ఖరీదు చేస్తున్నారు. ఈ విధంగా ఎన్నో బహుళ జాతి కంపెనీలు కొరతను సృష్టించి ఉచితంగా దొరకే నీటిని అమ్ముకొంటున్నారు. ఇదే జీవన విచిత్రం అనవచ్చును.

అదే రీతిలో మన దేశంలో కాలంను బట్టి పండ్లు, ఆహారం భుజించుట జరుగుతుంది. కాని వాతావరణ పరిస్థితులు క్షీణించుట వలన ఏ కాలంలో లభించే పండ్లు ప్రజలకు లభ్యం కావడం లేదు. గ్రామంలో పండే వస్తువులన్నీ పట్టణ మార్కెట్లకు తరలి పోతున్నాయి. దానితో గ్రామాలు స్వయం సమృద్ధి నుండి ఆధార భూతంగా మారుతున్నాయి. కారణం గ్రామాల చుట్టు ప్రక్కల నుండే సహజ రక్షణ చెట్లు, సేమలు పోయి ఎడారిగా మారుతున్నాయి. ఇది మనిషి స్వార్థం. మొత్తం గ్రామాలనే ఆధార భూ తంగా మార్చి వేస్తున్నాయి. ఇదే విధంగా విచ్ఛల విడిగా సహజ వనరులను ఉపయోగించడం వలన కొరత ఏర్పడి మొత్తం గ్రామాల వ్యవస్థ ఆధార భూతం కాకుండ మన గ్రామాలను కాపాడ వలసిన అవసరం ఉంది.

అందుకు తీసుకొనవలసిన అవసరత ప్రతి ఒక్కరు మన సహజ సంపదలైన చెట్లు, నీరు, పండ్ల తోటలను కాపాడుకొనవలసిన అవసరం ఉంది. అదే విధంగా మనం సంప్రదాయంగా వాడే బావి నీళ్ళ వాడకంను మరింత అలవాటు చేసుకోవాలి. నూతి నీరు పిల్టర్ నీటి కంటే ఉత్తమమైనదని చెప్పవచ్చు. ఎందుకంటే లోపలి మట్టి పొరలలో

వడకట్టిబడి లోతు స్థలంలో ఊరుతూ ఉంటాయి. మన దేశంలో 6 లక్షల దేవాలయాల ప్రాంతాలలో తప్పని సరిగా బావి నీరు దొరుకుతుంది. మన జీవన సంప్రదాయంగా వస్తున్నవనరు దానిని మనం కాపాడుకొనవలసిన అవసరం ఉంది. అదే విధంగా మన గ్రామాలలో బహిర్భూమిలో మల విసర్జన చేయుట అలవాటు దాని స్థానంలో పారిశుద్ధ్యపు పనిలో శ్రద్ధ వహిస్తూ సురక్షితమైన సేఫ్టి లేవీటరీలను ఉపయోగించుకోవచ్చు. మన ప్రభుత్వం అందిస్తున్న సహాయంను పొంది సురక్షిత పారిశుద్ధ్య పాయకానాలు నిర్మాణాలు చేసుకొని మన గ్రామాలలో కాలుష్య నివారణను, పరిశుద్ధ్యతను పాటించవలసిన అవసరం ఎంతో ఉంది. ఈ పర్యావరణ దినోత్సవంను మనం ప్రతి ఏడాది పాటిస్తున్న కూడ ఇంకా మనం కాలుష్యంలో కొట్టుమిట్టాడుతున్నాం. కనుక తప్పక కాలుష్యనివారణ చర్యలను చేపట్టడంలో మన ప్రజలను పరిరక్షించిన వారిమవుతాం.

మరో అంశం గ్రామాలలో వంటకానికి కట్టెలు విరివిగవాడుతున్నాం. దాని వలన మనకు సహజంగా ఉన్నా చెట్ల సంపదను కోల్పోతున్నాం. అదే విధంగా మహిళలు పొగవచ్చె పొయ్యిలను వాడడం వలన అనేక ఆరోగ్య పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కనుక మనకు సహజ వాయువు విరివిగా లభిస్తున్న దృష్ట్యా గ్యాస్ వంటకు ఉపయోగించి చెట్లను పరిరక్షించవచ్చు. అయితే సహజ వాయువు అందరికి లభ్యమయ్యే విధంగా అందుబాటు లోకి తీసుకొని రావాలి. అందుకు మన ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొనవలసిన అవసరం ఉంది.

మన స్కూలు విద్యలోనే వాతావరణ సమతుల్యంను పాటించే విధంగా చర్యలు తీసుకొవాలి. 1986 ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా దోహాలో అప్పటి మన ప్రధాని రాజీవ్ గాంధీ మన సంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అంతేగాక అభివృద్ధి చెందిన దేశాలు వాతావరణ కాలుష్యంకూ చేస్తున్న చర్యలను గట్టిగా ఎండగట్టారు. అదే విధంగా నేడు వాహనాల కాలుష్యం అన్ని



ప్రాంతాలలో పదిరెట్లు పెరిగిపోయింది. ఉదా : పట్టణ ప్రాంతాలలో వాహనాలు 6 రెట్లు పెరిగాయి. అంతే గాక యాంత్రీకరణ పెరగడం వలన కూడ వాహనాల వాడకం పెరిగింది. ద్వి చక్ర వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి సైకిలు స్థానంలో పెట్రోలు వాహనాల వాడకం 10 రెట్లు పెరిగింది. విదేశీ కంపెనీలు భారత దేశంలో లభ్యమయ్యే సహజ వనరులు వాడకం పెరిగింది. మన దేశం నుండి ఇనుమును చైనా, జపాన్‌లు అవి తక్కువ ధరకు దిగుమతి చేసుకొని అదే ముడి సరకుతో ద్విచక్ర, నాలుగుచక్ర వాహనాలను మన దేశంకు దిగుమతి చేస్తున్నాయి. అంతేగాక భారత్ దేశ కంపెనీలతో కొలేబిరేషన్ పెట్టుకొని వాహనాలను అధిక స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నాయి.

అదే విధంగా చిన్న పరిశ్రమలైన పాదరక్షల పరిశ్రమలలో కాలుష్యంను అనేక చర్యలు తీసుకుంటున్నారు. దానితో తోలు పరిశ్రమలు తయారుచేసే పాదరక్ష స్థానంలో, సింథటిక్ పాదరక్షలు తయారుచేయు "ఆదిదాస" 'క్రిస్టల్', 'మోచీ' లాంటి అనేక కంపెనీలు భారత్‌లో ప్రవేశించి మన తోలు పాదరక్షలను మార్పుచేశాయి. వీరు చేసే కాలుష్యం, వస్తువులను వాడడం వలన కూడ వాతావరణ వలన అనేక అనర్థాలు దారితీస్తుంది. అందులో మన వారు నిరుద్యోగులుగా మారడం, సింథటిక్ చెప్పులు వాడకం వలన కళ్ళపైన, శరీరంపైన వ్యతిరేక ప్రభావం చూపుతున్నాయి. వాటినన్నింటిని మన వారు అధిగమించి మన చుట్టు ప్రక్కల వాతావరణంను సమతుల్యంను కాపాడు కొనవలసుంది. 1986 సం॥ రంలో ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ శాఖను ప్రారంభించి దేశంలో సహజ వనరులైన నీరు, బొగ్గు, ఇనుము, తదితర వనరులను న్యాయ బద్ధంగా ఉపయోగించుకొని మనలను మనం పరిరక్షించుకొన వలెనని పిలుపునిచ్చారు. అప్పటి నుండి మన పర్యావరణ శాఖ ఎన్నో రకాలుగా కాలుష్యనియంత్రణకు, సహజ వనరుల పరిరక్షణకు చర్యలను గైకొంటుంది. ప్రతి ఒక్కరు మన ఇంటి చుట్టు ప్రక్కల నుండే సహజమైన వాతావరణంను కలుషితం కాకుండా చర్యలు తీసుకొని మనలను మనం కాలుష్యం నుండి పరిరక్షించుకొన వలసిన ఆవస్యకత ఎంతైన ఉంది. అందుకు అనుగుణంగా మనందరం అంకిత భావంతో కృషి చేయవలసిన అవసరం ఎంతో ఉంది.

అప్పుడే మనం ఆశించే సహజ వనరులు న్యాయబద్ధంగా ఉపయోగించుకొనగలుగుతాం. మనలను మనం అపరిశుభ్రమైన కాలుష్యవాతావరణం నుండి రక్షించుకొనగలం.

**- డా॥ కె. ఆసయ్య, ఐ.ఐ.ఎస్.**
**సెంటర్ హెడ్, మీడియా & పబ్లికేషన్స్, అపార్డు**

# పంచాయతీ రాజ్ సంస్థల పరిపుష్టికై "రాజీవ్ గాంధీ పంచాయత్ సశక్తీకరణ్ అభియాన్"

**స్థానిక స్వపరిపాలనకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఏర్పాటు చేయబడిన పంచాయతీ రాజ్ సంస్థలు ఏర్పాటై 60 సం॥లు గడిచినా, ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలోనే వున్నాయి. అయితే, 1992 సం॥లో స్థానిక సంస్థలను బలోపేతం చేయటానికి చేయబడిన 73వ రాజ్యాంగ సవరణ పంచాయతీరాజ్ సంస్థల చరిత్రలో ఒక మైలురాయి. ఈ రాజ్యాంగ సవరణ ద్వారా 29 అంశాలను స్థానిక సంస్థల గొడుగు క్రిందకు తీసుకురావటానికి ఒక ప్రయత్నం జరిగింది. అయితే పరిపాలనా వికేంద్రీకరణ ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కో తీరుగా జరిగింది. మన రాష్ట్ర విషయం తీసుకున్నట్లయితే, 10 అంశాలను స్థానిక సంస్థలకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయబడినప్పటికీ, అది పూర్తి స్థాయిలో జరగలేదు. ఈ దశలో పంచాయతీ రాజ్ సంస్థల బలోపేతానికి పెద్ద పీట వేస్తూ కేంద్ర ప్రభుత్వం "రాజీవ్ గాంధీ పంచాయత్ సశక్తీకరణ్ అభియాన్" అనే పథకాన్ని ప్రవేశపెట్టింది.**

2009 సం॥రం జూన్ 4వ తేదీన అప్పటి రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ పంచాయతీల శక్తి సామర్థ్యాలను పెంపొందించడానికి మరియు వికేంద్రీకృత ప్రణాళిక తయారీపై దృష్టి సారిస్తూ "వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి" (Backward Region Grant Fund - BRGF) ని పునర్నిర్మించవలసిన అవసరాన్నీ, అందుకు ప్రభుత్వ వ్యూహాన్ని ప్రకటించారు. అయితే పరిపాలనలోని లోపభూయిష్ట విధానాల వల్ల బి.ఆర్.జి.ఎఫ్ పునర్నిర్మాణం 11వ ప్రణాళికలో సాధ్యపడలేదనీ, అందువల్ల 12వ ప్రణాళికలో పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ క్రింద అమలులో నున్న ఈ దిగువ తెలిపిన 6 పథకాలను విలీనం చేస్తూ, "రాజీవ్‌గాంధీ పంచాయత్ సశక్తీకరణ్ అభియాన్" (Rajiv Gandhi Panchayat Sashakthikaram Abhiyan - RGPSA) ను ప్రవేశ పెట్టడం జరిగింది.

- వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధి నుండి అభివృద్ధి గ్రాంటు భాగం
- రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన పథకం (RGSY)
- ఇ-పంచాయత్
- పంచాయత్ ఎంపవర్‌మెంట్ & అకౌంటబిలిటీ ఇన్సెంటివ్ స్కీమ్ (PEAIS)
- పంచాయత్ మహిళా ఎవమ్ యువశక్తి అభియాన్ (PMEYSA)
- బి.ఆర్.జి.ఎఫ్. నందలి సామర్థ్యాల పెంపుదల గ్రాంటు భాగం మరియు రూరల్ బిజినెస్ హబ్ పథకాలు.

**పై తెల్పిన 6 స్కీములలో**

- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అదనపు సహాయం.
- పిఎమ్ఇవైఎస్‌వై, పిఇఎఐఎస్‌లు కేంద్ర ప్రభుత్వ సెక్టార్ స్కీములు
- ఆర్‌జిఎస్‌వై, ఇ-పంచాయత్ మరియు ఆర్‌బిహెచ్‌లు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న / అమలు చేస్తున్న పథకాలు.

అయితే ప్రస్తుత ఆర్‌జిపిఎస్‌ఏ ప్రతిపాదనలలో బిఆర్‌జిఎఫ్ నిధులు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వపు అదనపు సహాయంగాను, ఆర్‌జిపిఎస్‌ఏ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంగాను పరిగణించబడతాయి. ఆర్‌జిపిఎస్‌ఏ పథకం అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సమానంగా వర్తిస్తుంది. అంతేకాకుండా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసుకోవటానికి, తద్వారా పంచాయతీ రాజ్ సంస్థలను మరింత బలోపేతం చేయడానికి ఆర్‌జిపిఎస్‌ఏ అవకాశం కల్పిస్తున్నది. 2014-15 సం॥రం నుండి ఆర్‌జిపిఎస్‌ఏ పథకం క్రింద రాష్ట్ర ప్రణాళికలో గుర్తించబడిన అంశాల

ఆధారంగా 20% నిధులను రాష్ట్రాల పనితీరును బట్టి కేటాయిస్తుంది.

ఆర్‌జిపిఎస్ఏ పథకం పంచాయతీల పనితీరులోని ఈ దిగువ తెల్పిన లోపాలను నివారించడానికి, తద్వారా పంచాయతీలను మరింత బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుంది.

- గ్రామసభ మరియు పంచాయతీల శక్తి సామర్థ్యాలను పెంపొందించటం.
- ప్రజాస్వామ్య బద్ధమైన నిర్ణయాలను, జవాబుదారీతనాన్ని వృద్ధి చేయటం.
- సామర్థ్య నిర్మాణం, విజ్ఞాన సృష్టి కోసం సమగ్రమైన అంశాలను బలోపేతం చేయటం.

**ఆర్‌జిపిఎస్ఏ పథకం క్రింద జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ఈ దిగువ పనులు చేపట్ట వచ్చును**

1. పంచాయతీ రాజ్ సంస్థలలో, ప్రత్యేకంగా గ్రామపంచాయతీలలో సిబ్బంది, కార్యాలయం, ఇతర సౌకర్యాల కల్పనతో పాటు సాంకేతికతను కూడా పెంపొందించటం.
   - సిబ్బంది లేని గ్రామ పంచాయతీలలో, అదే విధంగా 5000 పైబడిన జనాభా గల ఒక క్లస్టరు గ్రామ పంచాయతీ నందు ముఖ్యమైన సిబ్బందిని (పంచాయతీ అభివృద్ధి అధికారి - రూ. 12,000/-, అకౌంటెంట్ కమ్ డాటా ఎంట్రీ ఆపరేటర్ - రూ. 8000/-, పంచాయతీ సహాయకుడు రూ. 5000/-, జూనియర్ ఇంజనీర్/టెక్నికల్ అసిస్టెంట్-రూ. 10,000/- లు నెల ఒక్కంటికి చెల్లించబడతాయి) నియమించటం.
   - గ్రామ పంచాయతీ కార్యాలయాలు లేని, సరిపడినంతగా కార్యాలయ సౌకర్యం లేనటువంటి గ్రామ పంచాయతీలకు వాటి నిర్మాణం నిమిత్తం ఆర్‌జిపిఎస్ఏ క్రింద నిధుల కేటాయింపు. ఈ నిర్మాణాలకు ఆయ్యే కూలీ ఖర్చు మొత్తాన్ని అవకాశమున్న ప్రతి చోట ఉపాధి హామీ పథకం నిధుల నుండి వినియోగించటం.
   - కంప్యూటర్ల ఏర్పాటు, సాంకేతిక సిబ్బంది నియామకం ద్వారా 12 ముఖ్యమైన ఉమ్మడి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లను మరియు వివిధ రాష్ట్రాలలో ప్రత్యేకంగా తయారు చేయబడిన 20 సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌లను అమలు చేయటం.
2. పంచాయతీ రాజ్ సంస్థలకు ఎంపిక కాబడిన ప్రజా ప్రతి నిధులకు, సదరు సంస్థలలో పనిచేస్తున్న సిబ్బందికి నేషన్ కెపాసిటీ బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్‌ననుసరించి తగిన శిక్షణను అందించటం.
3. గ్రామసభకు అవసరమైన సహాయ సహకారాలనందించటం. ప్రజాస్వామ్య బద్ధమైన నిర్ణయాలను తీసుకునే విధంగా ప్రోత్సహించటం, జవాబుదారీ తనాన్ని పెంపొందించటం, మొ॥వి.
   - పంచాయతీరాజ్ సంస్థలు నిర్వహించే వివిధ సమావేశాలను బలోపేతం చేయటం, ఉత్తమ ఆచరణలను (Best Practices) గుర్తించి, డాక్యుమెంట్ చేసి ప్రచారం చేయటం. ప్రణాళికల తయారీకి, ప్రజా ప్రతినిధుల సమాఖ్యల ఏర్పాటుకు మరియు వార్డు/మహిళా గ్రామసభలను నిర్వహించటానికి ఈ పథకం క్రింద నిధులు కేటాయించటం.

     ఏ) పెసా ప్రాంతాలలో గ్రామ సభలను సమీకరించేందుకు ఒక వ్యక్తిని, బ్లాకు స్థాయిలో పెసా/గ్రామసభ అధికారి, జిల్లా స్థాయిలో పెసా/గ్రామసభ కో-ఆర్డినేటర్ నియామకం.

     బి) గ్రామ సభ సభ్యులకు, ఎంపికైన ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి జిల్లా స్థాయిలో సహాయ సహకారాలందిస్తున్న ఎన్‌జిఓలకు శిక్షణ ఇవ్వటం.

     సి) గ్రామసభ కార్యాలయం - సమావేశ మందిరాలను ఎమ్‌జిఎన్ఆర్ఇజిఏ, బిఆర్‌జిఎఫ్, 13 ఎఫ్‌సి గ్రాంట్ నిధులతో నిర్మించటం.
4. రాజ్యాంగం నందలి ఆర్టికల్ 243 జెడ్‌డి మరియు ప్రణాళికా సంఘం నిబంధనల మేరకు తయారు చేయవలసిన వికేంద్రీకృత ప్రణాళికా విధానాన్ని వ్యవస్థీకృతం చేయటం.
5. జాతీయ, రాష్ట్ర, జిల్లా, సబ్ జిల్లా స్థాయిలలో వ్యవస్థాపరమైన నిర్మాణాలను బలోపేతం చేయటం.
   - జాతీయ స్థాయిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ (ఎన్ఐపిఆర్) ఏర్పాటు.
   - రాష్ట్ర స్థాయిలోని ఎస్ఐఆర్‌డిలలో స్టేట్ పంచాయత్ రిసోర్స్ సెంటర్ల (ఎస్‌పిఆర్‌సి) ఏర్పాటు.
   - జిల్లా మరియు బ్లాకు స్థాయిలో శిక్షణా కేంద్రాల ఏర్పాటు
6. ఉత్తమ సేవలు అందిస్తున్న పంచాయతీలకు, డివల్యూషన్ ఇండెక్స్ ఆధారంగా పంచాయతీ రాజ్ సంస్థలకు విధులు, నిధులు మరియు ఉద్యోగులకు సంక్రమింప చేసిన రాష్ట్రాలకు, తగాదాలు లేని గ్రామాలుగా తీర్చి దిద్దటానికి కృషి చేస్తున్న (Dispute Free Village Campaign) రాష్ట్రాలకు ప్రోత్సాహకాలను అందించటం.
7. రాష్ట్ర ఎన్నికల సంఘాలను బలోపేతం చేయటం.
8. పంచాయతీరాజ్ సంస్థల పటిష్టతకై చేయబడు క్రొత్త ఆవిష్కరణలకు ఆర్‌జిపిఎస్ఏ క్రింద ఆర్థిక సహకారాన్ని అందించటం.
9. స్వంత ఆదాయ వనరులను సమకూర్చుకున్న పంచాయతీలకు

ప్రోత్సాహకాలివ్వటం.

10. జాతీయ, రాష్ట్ర, జిల్లా మరియు బ్లాకు స్థాయిలలో ప్రాజెక్టు మేనేజిమెంటు యూనిట్లు, ఏర్పాటు చేయటం. ఈ యూనిట్ల నిర్వహణ కొరకు ఆర్‌జిపిఎస్‌ఏ, బిఆర్‌జిఎఫ్ పథకాల క్రింద 6% నిధులు కేటాయించడం.

### ఆర్‌జిపిఎస్‌ఏ పథకం క్రింద నిధుల విడుదల - నిబంధనలు

ఆర్‌జిపిఎస్‌ఏ పథకం క్రింద నిధులు పొందాలంటే, రాష్ట్రాలు 12వ పంచవర్ష ప్రణాళికా కాలానికి దీర్ఘదర్శి ప్రణాళిక మరియు సవివరమైన వార్షిక ప్రణాళికలను ఖచ్చితంగా తయారు చేయాలి. 5 సం॥ల దీర్ఘ దర్శి ప్రణాళికలు తయారు చేసేటపుడు రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయటానికి ఏర్పరచుకున్న విజన్‌ను, నిర్దేశించుకున్న లక్ష్యాలను సవివరంగా తెలియజేయాలి. అంతే కాకుండా రాష్ట్రంలో పంచాయతీ రాజ్ సంస్థల ప్రస్తుత పరిస్థితి అనగా సంక్రమింపచేసిన 3 ఎన్‌లు, సిబ్బంది, మౌలిక సౌకర్యాలు, ఆర్థికవనరులు, శిక్షణావసరాలు మరియు జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు అవసరమైన వ్యవస్థల గురించి వివరిస్తూ రాబోయే 5 సం॥లలో ప్రస్తుతమున్న ఇబ్బందులను ఎదుర్కోవటానికి వారు చేపట్టే పనులను కూడా సూచించాలి. వార్షిక ప్రణాళికలలో ఆ సం॥ సాధించదలచుకున్న లక్ష్యాలను, వాటిని చేరుకోటానికి అవసరమైన చర్యలను, ఖర్చయ్యే నిధులను పొందుపరచాలి. 2012-13 సం॥రంలో పథకం అమలయ్యే కాలం తక్కువగా వున్నందున 2012-13 మరియు 2013-14 సం॥రంలకు కలిపి వార్షిక ప్రణాళిక తయారు చెయ్యాలి.

### 2012-13 & 2013-14 సంవత్సరాలలో చేయవలసిన పనులు

- రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పార్ట్ - IX క్రిందకు రాని పంచాయతీలకు లేదా స్థానిక సంస్థలకు క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించాలి.
- స్థానిక సంస్థలలో కనీసం 1/3 వ వరకు సీట్లను మహిళలకు కేటాయించాలి.
- ప్రతి 5 సం॥లకు ఒక సారి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయటం. ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులపై యాక్షన్ టేకెన్ రిపోర్టును రాష్ట్ర శాసన సభలో ప్రవేశపెట్టాలి.
- అన్ని జిల్లాలలోను జిల్లా ప్రణాళికా కమిటీలను ఏర్పాటు చేసి అని సమర్థ వంతంగా పనిచేయటానికి అవసరమైన నియమ నిబంధనలను జారీ చేయాలి.

### 2014-15 సం॥రం నుండి చేయవలసిన పనులు

- జిల్లా, మధ్యస్థాయి పంచాయతీల అక్కౌంట్ల వరకూ అయినా ఆన్‌లైన్‌లో నిర్వహించాలి.
- పంచాయతీల అక్కౌంట్లను, బడ్జెట్‌ను స్వచ్ఛందంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన నియమ నిబంధనలను జారీ చేయాలి.

**పై తెల్పిన నిబంధనలను పాటించని రాష్ట్రాలకు ఆర్‌జిపిఎస్‌ఏ క్రింద నిధులు లభించవు.**

### నిధుల కేటాయింపు

ఆర్‌జిపిఎస్‌ఏ క్రింద రాష్ట్ర ప్రణాళికలను అమలు చేయటానికి నిధులు 80:20 నిష్పత్తిలో లభిస్తాయి. 80% నిధులను కేంద్రం అందిస్తే 20% నిధులు రాష్ట్రాలు సమకూర్చుకోవాలి. అయితే ఈశాన్య రాష్ట్రాలకు మాత్రం 90:10 నిష్పత్తిలో నిధులు లభిస్తాయి. సదరు రాష్ట్రాలు 10% నిధులు సమకూర్చు కుంటే చాలు. సాంకేతిక సహాయం కొరకు తయారు చేయబడిన జాతీయ ప్రణాళికకు మాత్రం 100% నిధులు కేంద్రం లభిస్తాయి. ఈ ప్రణాళిక పర్యవేక్షణ మరియు సాంకేతిక సహాయ చర్యల కొరకు 5% వరకు ఆర్‌జిపిఎస్‌ఏ నిధులను వినియోగించు కొనవచ్చును. నూతన ఆవిష్కరణల కొరకు ఒక సంవత్సరానికి 10 కోట్ల రూపాయలను సహాయంగా ఉపయోగించుకొనవచ్చును. అదే విధంగా ఉత్తమ సేవలందిస్తున్న పంచాయతీలకు మరియు గ్రామ సభలకు ప్రోత్సాహకాల క్రింద సంవత్సరానికి 50 కోట్ల రూపాయలను ఈ పథకం క్రింద వినియోగించుకోవచ్చును.

రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ వాటా వాటి గ్రామీణ జనాభా, రాజ్యాంగంలో షెడ్యూలు-5 క్రింద చూపబడిన రాష్ట్ర ప్రాంతం, ఆమోదించబడిన ప్రణాళిక, మంజూరు చేయబడిన నిధులు వినియోగం ఆధారంగా లభిస్తాయి. 2014-15 సం॥రం నుండి పనితీరు ఆధారంగా లభించే నిధులు అందుకొరకు నిర్దేశించబడిన నిబంధనలను పూర్తి చేసినపుడే లభిస్తుంది. రాష్ట్రంలోని షెడ్యూలు-5 ప్రాంత పరిధి ఆధారంగా కేంద్ర ప్రభుత్వ వాటా నుండి 10% నిధులు విడుదల చేయబడతాయి.

12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో రాష్ట్రాలు కార్యాచరణ ప్రణాళిక మరియు నిర్వహణ కొరకు మంజూరు కాబడిన నిధుల నుండి 6% నిధులను ఖర్చు చేయడానికి అవకాశం కలదు. ఈ ఖర్చు మొదటి రెండు సంవత్సరాలలో 6 నుండి 25% వరకూ పెరిగే అవకాశముంటుంది. ప్రతి రాష్ట్రం తనకు కేటాయించబడిన నిధుల నుండి 1% నిధులను ఐఇసి యాక్టివిటీస్‌కు ఖర్చు చేయవచ్చును. రాష్ట్రాలకు విడుదల చేయు నిధుల విషయంలో ఆర్‌జిపిఎస్‌ఏ కేంద్ర కార్యనిర్వాహక కమిటీదే తుది నిర్ణయం.

## ఆర్‌జిపిఎస్ఏ అమలు మరియు పర్యవేక్షణ

ఈ పథకానికి అవసరమైన సూచనలు, సలహాలు అన్నీ కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ యొక్క మంత్రి వర్యుల అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన సెంట్రల్ స్టీరింగ్ కమిటీ అందించటంతో పాటు, పథకం అమలును కూడా పర్యవేక్షిస్తుంది. సెంట్రల్ స్టీరింగ్ కమిటీలో ఈ దిగువ తెల్పిన వారు సభ్యులుగా వుంటారు.

- పంచాయతీరాజ్ శాఖా మంత్రివర్యులు .................... ఛైర్ పర్సన్
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు - గ్రామీణాభివృద్ధి, పారిశుధ్యం & త్రాగునీరు, విద్య, వైద్య, వ్యవసాయం సంక్షేమం & సామాజిక న్యాయం, షెడ్యూల్డు తెగల వ్యవహారాల శాఖలు. ...................... సభ్యులు
- డిప్యూటీ ఛైర్మన్, ప్రణాళికా సంఘం లేదా వారి ప్రతినిధి, డా॥మిహిర్‌షా, మెంబర్, ప్రణాళికా సంఘం ................ సభ్యులు
- రాష్ట్ర ఆర్థిక మంత్రి (D/o ఖర్చులు) ........................... సభ్యులు
- చక్కటి ప్రతిభ కనబరుస్తున్న రాష్ట్రాలలో పంచాయతీరాజ్ శాఖతో సంబంధం/బాధ్యత కలిగిన మంత్రులు (వీరిని డెవల్యూషన్ ఇండెక్స్ ఆధారంగా ఛైర్ పర్సన్ నిర్ణయిస్తారు) ........................................... సభ్యులు
- పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ యొక్క కార్యదర్శి .... సభ్యులు
- ఛైర్ పర్సన్‌చే నామినేట్ చేయబడిన, పంచాయతీరాజ్ రంగాలలో పనిచేస్తున్న సామర్థ్యంకలిగిన 2వ్యక్తులు ... సభ్యులు
- ఉత్తమ సేవలందిస్తున్న పంచాయతీల నుండి ఎంపిక చేయబడిన 5 గురు ప్రజా ప్రతినిధులు .......... సభ్యులు
- ఉత్తమ సేవలందిస్తున్న పంచాయతీల నుండి ఎంపిక చేయబడిన 5 గురు మహిళా ప్రజా ప్రతినిధులు ........ సభ్యులు
- అదనపు కార్యదర్శి మరియు ఫైనాన్షియల్ అడ్వైజర్ పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ .............................. సభ్యులు
- అదనపు కార్యదర్శి, పంచాయతీరాజ్............................ మెంబర్ మంత్రిత్వ శాఖ ........................................................... సెక్రటరీ
- సంయుక్త కార్యదర్శి (ఆర్‌జిపిఎస్ఏ) పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ............................ రాపోర్టియర్

ఛైర్ పర్సన్ అదనంగా ఎవరినైనా ప్రత్యేకంగా, సమావేశాలకు ఆహ్వానించ వచ్చును.

సెంట్రల్ స్టీరింగ్ కమిటీతో పాటుగా జాతీయ స్థాయిలో పథకం అమలును విచారించడానికి పూర్తి అధికారాలు కలిగిన కేంద్ర కార్యనిర్వాహక కమిటీ ఏర్పాటు చేయబడినది. ఈ కమిటీకి ఛైర్ పర్సన్ పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి. కేంద్ర కార్యనిర్వాహక కమిటీలో ఈ దిగువ తెల్పిన వారు సభ్యులుగా వుంటారు.

- కార్యదర్శి, పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ .......... ఛైర్ పర్సన్
- ప్రణాళికా సంఘం యొక్క ప్రతినిధి........................... సభ్యులు
- కార్యదర్శి, ఖర్చులు, ఆర్థిక మంత్రిత్వ శాఖ ................ సభ్యులు
- కార్యదర్శి, వ్యసాయం, గ్రామీణాభివృద్ధి, పారిశుధ్యం మరియు త్రాగునీరు, విద్య, వైద్య, సామాజిక న్యాయం, సంక్షేమం, షెడ్యూల్డు తెగల వ్యవహారాల శాఖలు. ..... సభ్యులు
- అదనపు కార్యదర్శులు, ఫైనాన్షియల్ అడ్వైజర్ మరియు పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ యొక్క సంయుక్త కార్యదర్శులు ................................ సభ్యులు
- డైరెక్టర్ జనరల్, జాతీయ గ్రామీణభివృద్ధి సంస్థ హైదరాబాద్ ............................................................... సభ్యులు
- డెవల్యూషన్ ఇండెక్స్ ఆధారంగా చక్కని ప్రతిభ కనబరుస్తున్న రాష్ట్రాల నుండి పంచాయతీరాజ్ వాఖ మంత్రి వర్యులచే ఎంపిక చేయబడిన కార్యదర్శులు .. సభ్యులు
- 3 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ............................ సభ్యులు
- ఉత్తమ సేవలందిస్తున్న పంచాయతీల నుండి 5 గురు ప్రజా ప్రతినిధులు ......................................... సభ్యులు
- ఉత్తమ సేవలందిస్తున్న పంచాయతీల నుండి 5 గురు మహిళా ప్రజా ప్రతినిధులు ........................... సభ్యులు
- సంయుక్త కార్యదర్శి (ఆర్‌జిపిఎస్ఏ).............. మెంబర్ సెక్రటరీ

8, 9, 10 వరుస సంఖ్యలో తెలుపబడిన వ్యక్తులను పంచాయతీ రాజ్ శాఖా మంత్రివర్యులు ఎంపిక చేసి, నామినేట్ చేస్తారు. కార్య నిర్వాహక కమిటీ యొక్క ఛైర్ పర్సన్ అవసరమైన వ్యక్తులను అదనంగా, ప్రత్యేకంగా సమావేశాలకు ఆహ్వానించవచ్చును.

ఆర్‌జిపిఎస్ఏ పథకం నామ మాత్రంగా కాకుండా పంచాయతీలను అన్ని కోణాల నుండీ బలోపేతం చేయటానికి నిర్దేశించబడినది కాబట్టి, ఈ పథకం సక్రమంగా అమలు జరిగేటట్లు ప్రతి రాష్ట్రం చిత్తశుద్ధితో ప్రయత్నించినట్లయితే, అతిత్వరలోనే శక్తివంతమైన పంచాయతీ రాజ్ సంస్థలను, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని మనం చూడవచ్చును. ఇందుకోసం మనందరం శక్తి వంచన లేకుండా కృషి చేద్దాం.

**జి. సత్యవాణి,**
**ఫ్యాకల్టీ, సిడిపి&ఎ, ఏఎమ్ఆర్-అపార్డ్**

పథకాలపై అవగాహన
పెంచటానికో చిరుప్రయత్నం

# పథకానికి పది ప్రశ్నలు

# రాజీవ్ యువకిరణాలు



**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం రాజీవ్ యువకిరణాలు. నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగాలలో ఉపాధి కల్పించాలన్నది ఈ పథకం లక్ష్యం.**

**1. రాజీవ్ యువకిరణాలు పథకం ఎప్పుడు ప్రారంభమైంది?**

జ. రాజీవ్ యువకిరణాలు పథకాన్ని ఆగస్టు 27, 2011 తేదీన విశాఖపట్నం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించింది.

**2. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి?**

జ. పరిశ్రమలు, ఇతర వాణిజ్య సంస్థలకు ఏ తరహా నైపుణ్యాలు అవసరం గలవారు అవసరమో గుర్తించి నిరుద్యోగ యువతకు ఆ తరహా నైపుణ్యం పెంపొందింపజేసే శిక్షణ ఇచ్చి గ్రామీణ పేద కుటుంబాల్లో కనీసం ఒకరికి ఉపాధి కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం.

**3. రాజీవ్ యువకిరణాలు పథకం ద్వారా శిక్షణ పొందటానికి అర్హతలు ఏమి ఉండాలి?**

జ. ఈ పథకం క్రింద శిక్షణ తీసుకొని ఉద్యోగం పొందటానికి ఏ విధమైన ప్రత్యేకమైన అర్హతలు అవసరం లేదు. పేద కుటుంబానికి చెంది 18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటే సరిపోతుంది. అయితే, విద్యార్హతలు, ఆసక్తికి అనుగుణంగా తగిన శిక్షణ ఇవ్వబడుతుంది.

**4. ఈ పథకం ముఖ్య లక్ష్యాలు ఏమిటి?**

జ. 2014 సంవత్సరం నాటికి రాష్ట్రంలో 15 లక్షల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం.

- ఉపాధి అవకాశం ఉన్న ప్రైవేటు రంగాలతో భాగస్వామ్యం కావడం.
- ఉన్నత, సాంకేతిక, వృత్తి విద్యల పాఠ్య ప్రణాళికను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రీ-ఓరియెంట్ చేసి క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు కల్పించడం.
- ప్రభుత్వ, ప్రవేటు సంస్థల సమన్వయంతో కార్యక్రమం అమలును ముందుకు తీసుకెళ్ళడం.
- నాణ్యతా ప్రమాణాలను, విధానాలను ఏర్పరచి యువతకు కామన్ కంప్యూటర్ డేటా బేస్ అమలు చేయడం, నైపుణ్య పెంపుదల కార్యక్రమాలను పర్యవేక్షించి శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్‌ను కల్పించడం.

**5. ఈ పథకం ద్వారా ఏ ఏ రంగాలలో శిక్షణ అందజేస్తారు?**

జ. ఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో, అంటే ఐ.టి, నిర్మాణ రంగం, మాన్యుఫాక్చరింగ్, టెక్స్‌టైల్స్, సర్వీస్ సెక్టార్స్, ఫార్మ స్యూటికల్స్, హాస్పిటాలిటీ, టూరిజం, వ్యవసాయం, సేల్స్, బ్యాంకింగ్, మార్కెటింగ్, జ్యూయలరీ, ఇంజినీరింగ్ ఇలా మొదలైన రంగాలలో ఆసక్తిని, అర్హతను బట్టి శిక్షణ అందజేయడం జరుగుతుంది.

**6. రాజీవ్ యువకిరణాల ద్వారా లబ్ధి పొందాలంటే దరఖాస్తు చేసే విధానం?**

జ. రాజీవ్ యువకిరణాలు సలహా నమోదు కేంద్రాన్ని సంప్రదించకుండా అభ్యర్థులు ఇంటర్‌నెట్ ద్వారా తమ దరఖాస్తులను పంపించే అవకాశాన్ని కూడా కల్పించింది. ఈ పథకం కోసం www.rvk.egg.gov.in అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. అభ్యర్థులు తమ దరఖాస్తులను rvk.egg.gov.in కు మెయిల్ చేయాలి. అయితే, అభ్యర్థులు తమ దరఖాస్తులో ఇతర వివరాలతో పాటు తమ పుట్టిన తేదీ, మొబైల్ నంబరు, రేషన్ కార్డు నెంబరు కూడా తప్పనిసరిగా నమోదు చేయాలి. శిక్షణ ఉచితంగా అందజేస్తారు. శిక్షణాకాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తారు.

ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాజీవ్ యువకిరణాలు నమోదు కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి వెళ్ళి అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు.

జిల్లా నమోదు కేంద్రాలుగా జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులు, డి.ఆర్.డి.ఎ. కార్యాలయాలు, మెప్మా ఆఫీసులను కూడా అభ్యర్థులు సంప్రదించి రాజీవ్ యువకిరణాలకు దరఖాస్తు పంపించుకోవచ్చు.

ఇలా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను కౌన్సిలింగ్‌కు పిలిచి వారి ఇష్టాయిష్టాలను తెలుసుకొని వారి అభీష్టం మేరకు శిక్షణకు పంపిస్తారు.

**7. ఈ పథకంలో భాగ్యస్వామ్య రంగాలు వివరాలు తెల్పండి?**

జ. ఈ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం రాజీవ్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే సంస్థను ఏర్పాటు చేసింది. దీనికి ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారు. ఈ పథకంలో ఉద్యోగ అవకాశాల కల్పనకు 5 సబ్ మిషన్‌లను ఏర్పాటు చేశారు.

**1. పట్టణ ప్రాంతాలలో ఉపాధికి సబ్ మిషన్ :**

పట్టణ ప్రాంతాలలోని నిరుద్యోగ యువతను గుర్తించి, శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాన్ని కల్పించడం దీని బాధ్యత. ఎంప్లాయ్‌మెంట్, శిక్షణా శాఖ కమీషనర్ ఈ సబ్‌మిషన్‌కు అధిపతిగా ఉంటారు.

**2. పట్టణ మురికివాడల్లో ఉపాధికి సబ్ మిషన్ :**

పట్టణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాల ద్వారా నిరుద్యోగ యువతను గుర్తించి శిక్షణ నందించి ఉపాధి కల్పించడం దీని బాధ్యత. దీనికి మెప్మా డైరెక్టర్ అధిపతిగా ఉంటారు.

**3. గ్రామీణ ఉపాధికి సబ్ మిషన్ :**

గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగ యువతను గుర్తించి, శిక్షణనందించి ఉపాధి అవకాశాలు కల్పించడం దీని బాధ్యత. దీనికి ఇ.జి.ఎమ్.ఎమ్.. సి.ఇ.ఓ. అధిపతిగా ఉంటారు.

**4. విభిన్న ప్రతిభ కలిగిన వారి కోసం సబ్ మిషన్ :**

పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలోని విభిన్న ప్రతిభావంతులైన యువతను గుర్తించి, శిక్షణనిచ్చి ఉపాధి కల్పించడం.

**5. విద్యాసంస్థల్లో ఉపాధి కల్పనకు సబ్‌మిషన్ :**

అకడమిక్ సంస్థలు, పరిశ్రమలు సేవలు మధ్య అనుసంధానాన్ని ఏర్పరచి, సాంకేతిక వృత్తి విద్యా సంస్థల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేట్లు చూడటం. దీనికి టెక్నికల్ ఎడ్యుకేషన్ కమీషనర్ అధిపతిగా ఉంటారు.

**8. రాజీవ్ యువకిరణాలు పథకంలో వికలాంగులకు ప్రత్యేకమైన అవకాశాలు ఉన్నాయా?**

జ. డైరెక్టర్, వికలాంగుల సంక్షేమం శాఖ ద్వారా పేద నిరుద్యోగ వికలాంగ యువతీ, యువకులకు విభిన్న శిక్షణలను ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది ప్రభుత్వం.

**9. రాజీవ్ యువ కిరణాలు పథకంలో స్కిల్స్‌ను పెంపొందింపజేసే శిక్షణను ప్రత్యేకంగా ఇస్తారా?**

జ. కేవలం ఎంచుకున్న రంగాలలో నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణే కాక, ఈ పథకంలో శిక్షణ తీసుకున్న ప్రతిఒక్కరికీ కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్ మరియు ఇంటర్వ్యూను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందింపజేసే స్కిల్స్ మొదలైన ప్రత్యేకమైన శిక్షణలు ప్రతిఒక్కరికీ శిక్షణ ద్వారా అందజేయడం జరుగుతుంది.

**10. ఈ పథకం గూర్చి పూర్తి వివరాలు పొందాలంటే ఎవరిని కలవాలి?**

జ. ఈ పథకం క్రింద శిక్షణ తీసుకోవడానికి ప్రతి జిల్లా కేంద్రంలో ఒక రాజీవ్ యువకిరణాలు సలహా నమోదు కేంద్రం ఉంటుంది. ఆ కేంద్రంలో నిరుద్యోగ యువతీ యువకులు తమ పేర్లు నమోదు చేయించుకొని పూర్తి వివరాలు పొందవచ్చు.

రాజీవ్ యువకిరణాలు పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను చదువుకున్న గ్రామీణ, పట్టణ యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొంది, యువత అభివృద్ధి పథంలోకి రావాలని ఆశిద్దాం.

**యమ్. ప్రదీప్‌కుమార్,**
**రీసెర్చ్ అసోసియేట్, అపార్డ్**



# మందీ మార్బలం లేకుండా ప్రధానమంత్రి పల్లెలో తిరిగి రైతు ఇంట్లో బస చేసిన వేళ

గుజరాత్‌లోని కైరా పాల ఉత్పత్తి దార్ల సంఘం 1964లో అప్పట్లో అత్యాధునికమైనది. భారత దేశంలోనే మొట్టమొదటిది అయిన పశువుల దాణా కర్మాగారాన్ని ఆనంద్ పట్టణానికి దగ్గర్లోని కంజరి అనే గ్రామంలో నెలకొల్పింది. సర్దార్ వల్లబాయి పటేల్ పాడిరైతుల సహకారోద్యమానికిచ్చిన ప్రేరణను గుర్తుంచుకొనే ఉద్దేశ్యంతో ఆయన జయంతి రోజున అంటే అక్టోబరు 31, 1964 తేదీన ఆ కర్మాగారానికి ప్రారంభోత్సవం జరుపుకోవాలని నిశ్చయించారు. అప్పటి దేశ ప్రధాన మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రిని కర్మాగారాన్ని ప్రారంభించవలసిందిగా ఆహ్వానించారు. ఆహ్వానాన్ని అంగీకరిస్తూ ప్రధాన మంత్రి అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి బల్వంత్ రాయ్ మెహతా ద్వారా ఒక ఆశ్చర్యకరమైన, అనూహ్యమైన సందేశాన్ని నిర్వాహకులకు పంపించారు. తాను ఒక రోజు ముందుగానే వస్తానని, అదే జిల్లాలోని (కైరా జిల్లాలో) ఒక గ్రామంలోని చిన్న రైతు ఇంట్లో రాత్రి బస చేస్తానని, తదనుగుణంగా తన కార్యక్రమంలో మార్పులు చేయాలని, దాని సారాంశం. అభివృద్ధి పథంలో ముమ్ముందు చోటు చేసుకొనే కొన్ని గొప్ప పరిణామాలకు ఇది నాంది పలకటంలాంటిదని బహుశ ఆ రోజు ఎవరూ ఊహించి ఉండరు.

తక్షణం ముఖ్యమంత్రి బల్వంత్ రాయ్ మెహతా కైరా పాల ఉత్పత్తి

సంఘం జనరల్ మేనేజరు వర్గీస్ కురియన్‌తో చర్చించారు. ప్రధానమంత్రి గ్రామ పర్యటనకు ఏర్పాట్లు గావిస్తానని హామీ ఇచ్చారు కురియన్. కాని ప్రధాన మంత్రి బస చేసే చిన్న గ్రామానికి ఈ సందర్భంలో మందీ మార్బలం, పోలీసు బలగాలు రాకూడదని ఆయన ముఖ్యమంత్రికి విజప్తి చేసారు. ఎందుకంటే, మందీ మార్బలం, పోలీసు బలగాల మధ్య గ్రామం సహజ పరిస్థితిని ప్రధాని చూడలేరని కురియన్ వివరించారు. తాను ప్రధాని భద్రతకు జవాబుదారీతనం తీసికొంటానని కూడా అన్నారు.

ముఖ్యమంత్రి బల్వంత్‌రాయ్ మెహతా రాష్ట్ర హోం సెక్రెటరీ ఎఫ్.హెచ్. హెరెడియాను పిలిపించి కురియన్ ప్రతిపాదన గురించి తెలిపారు. కాని ప్రధానికేదైనా అయితే అది తన మెడకు చుట్టుకొంటుంది కాని, కురియన్‌కేమీ కాదని వాదిస్తూ, ఈ ప్రతిపాదనకు సమ్మతించేది లేనే లేదని హెరెడియా చెప్పారు.

కాని వర్గీస్ కురియన్ ప్రతిపాదనలో కొంత ఔచిత్యముందని హోం సెక్రెటరీకి నచ్చచెబుతూ, చివరికి ప్రధాని పర్యటనా కార్యక్రమంలోని గ్రామ సందర్శన భాగానికి సంబంధించినంతవరకు- కేవలం హెరెడియా, కురియన్‌లు మాత్రమే సంయుక్తంగా పక్కా రహస్యంగానే, కీలక ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

హెరెడియా, కురియన్‌లు తమలో తాము చర్చించుకొని ఆనంద్ పట్టణానికి దగ్గర్లో ఉన్న అజర్‌పురా గ్రామాన్ని ప్రధానమంత్రి సందర్శన కోసం ఎంపిక చేసి దాన్ని చిట్టచివరి వరకు రహస్యంగా ఉంచారు.

ఇక కురియన్ అజర్‌పురా గ్రామంలో ప్రధాని బస కోసం రమణ్‌భాయ్ పుంజాభాయ్ పటేల్ అనే ఒక సన్నకారు రైతు ఇంటిని ఎంపిక చేశారు. స్వయంగా రమణ్‌భాయ్ ఇంటికి వెళ్ళి ఇద్దరు విదేశీయులకు తన ఇంట్లో ఒక రాత్రికి ఆతిథ్యం ఇవ్వగలరా అని అడిగారు. ఆ రైతు ఆందోళన చూసి కురియన్ ఆ వచ్చే విదేశీయులు మంచివారని, వారి నుండి ఎటువంటి సమస్యా రాదని, ఇంటిని, స్నానాల ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచుకొని, మామూలు అతిథుల కోసం తయారు చేసే సాధారాణ భోజనం సమకూర్చటం తప్ప ప్రత్యేకమైన ఏర్పాట్లేమీ అవసరం లేదని వివరించిన తరువాత రమణ్‌భాయ్ ఒప్పుకొన్నాడు.

అనుకొన్న రోజున ప్రధానమంత్రి మందీ మార్బలంతో అహమ్మదాబాద్ నుండి ఆనంద్ పట్టణానికి కారులో బయలుదేరారు. హెరెడియా, కురియన్ ముందుగానే రచించిన ప్రణాళిక ప్రకారం ప్రధాని మంత్రి ప్రయాణిస్తున్న కారును మాత్రం మధ్యలోనే అజర్‌పురాకు మళ్ళించారు. మిగిలిన కార్లన్నీ వర్గీస్ కురియన్ ఇంటికి చేరుకున్నాయి. (ఎందుకంటే ఆ రోజుల్లో ఆనంద్‌లో మంచి అతిథిగృహం లేదు కాబట్టి ఆనంద్‌కు వచ్చే ప్రముఖులందరు కురియన్ ఇంట్లోనే బస చేసేవారు).

ఈ లోగా హోం సెక్రటరీ నుండి చివరి నిముషంలో తన చేతికందిన ఆదేశాల ప్రకారం, కైరా జిల్లా కలెక్టరు ప్రధాన మంత్రి కారు అక్కడికి చేరుకోటానికి కొద్ది సేపు ముందు కురియన్‌ను అనుసరించి అజర్‌పురాలోని రమణ్ భాయ్ ఇంటికి చేరుకున్నాడు. అక్కడ వర్గీస్ జిల్లా కలెక్టరును రమణ్‌భాయ్‌కి పరిచయం చేసి, అతని ఆతిథ్యాన్నందుకునేది ఇంకాసేపట్లో వచ్చే ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి అని నిజం చెప్పేసారు. నిర్ఘాంతపోయిన రమణ్‌భాయ్‌కి భయపడాల్సిందేమీ లేదని ధైర్యం చెప్పి జిల్లా కలెక్టరును అతని ఇంట్లోనే ఉంచి, కురియన్ ఇతర ప్రముఖులను చూసుకోవటానికి మరుసటి రోజు ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాట్లు పర్యవేక్షించటానికి వెనుదిరిగి ఆనంద్‌కు వచ్చేసారు.

కాసేపటికి ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి నేరుగా అజర్ పురా గ్రామంలోని రమణ్‌భాయ్ ఇంటికి చేరుకొని అతని కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడి, వారితో పాటు సాధారణ భోజనాన్ని తిన్నారు. తరువాత గ్రామమంతా కాలినడకనే తిరిగారు. సాధ్యమైనంత ఎక్కువ మంది పాడిరైతుల ఇళ్ళకు వెళ్ళి వాళ్ళతో కూర్చొని వాళ్ళ జీవితాల గురించి, స్త్రీల స్థితిగతుల గురించి, పాల ఉత్పత్తి గురించి, స్వంతగేదెలు ఉన్న వారి సంఖ్య గురించి, సహకార సంఘం కార్యకలాపాల గురించి, వాటిపై గ్రామస్తులకున్న అవగాహన గురించి ఇలా పలు అంశాలపై వివరంగా చర్చించారు.

దళితులు, ముస్లింల ఇళ్ళకు వెళ్ళి వారితో కూర్చొని వారి స్థితిగతుల గురించి విచారించారు. పాల సేకరణలో కుల వివక్షకేమన్నా గురవుతున్నారా అని ప్రధాన మంత్రి విచారించగా, అటువంటి దేమీ లేదని ఏకులం రైతైనా తామంతా క్యూ పద్ధతిని పాటించి తమ పాలను సేకరణ కేంద్రాలకందిస్తున్నామని సమాధానమొచ్చింది. ఈ క్రమంలో తెల్లవారు జామున 2 గంటలయింది. మరుసటి రోజు ఉదయపు కార్యక్రమాల గురించి ప్రధాన మంత్రికి గుర్తు చేసి ఆయన విశ్రాంతి తీసికొనేట్టుగా నచ్చ చెప్పాల్సి వచ్చింది.

మరునటి రోజు అక్టోబర్ 31, 1964 తేదీన ఉదయాన్నే ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి కైరా పాల ఉత్పత్తి దార్ల సహకార సంఘాన్ని సందర్శించి, కంజరి గ్రామంలో పశువుల దాణా కర్మాగారాన్ని ప్రారంభించి, తరువాత కురియన్‌తో కలసి ఆనంద్‌లోని ఆయన ఇంటికి వెళ్ళారు.

అక్కడ ప్రధాన మంత్రి శాస్త్రి తను ముందు రాత్రి జరిపిన గ్రామ సందర్శన గురించి వర్గీస్ కురియన్‌తో వివరంగా చర్చించి ప్రశ్నల వర్షం కురిపించారు. ''ప్రభుత్వ డైరీలన్నీ దెబ్బతిని నష్టాల్లో నడుస్తూండగా, అమూల్ డైరీ మాత్రం ఎలా అభివృద్ధి చెందుతోంది? దాని విజయ రహస్య మేమిటి? ఇక్కడి రైతాంగాన్ని, వాతావరణాన్ని, వర్షపాతాన్ని, మట్టిని, పశుగ్రాసాన్ని, గేదెలను, దేశంలోని తక్కిన వాటితో పోలిస్తే వాటికంటే మెరుగ్గా లేవు. అలాంటప్పుడు ఫలితాల్లో ఇంత తేడా ఎందుకు? రాత్రి పర్యటనలో నా (ప్రధానికి) దృష్టికి రాని అంశమేదైనా ఉందా?'' అని ప్రధాని అడిగారు.

ప్రధాన మంత్రి భావాలతో పూర్తిగా ఏకీభవిస్తూ వర్గీస్ కురియన్ ఆయన దృష్టికి రాని ఒకటి రెండు తేడాలున్నాయని చెబుతూ ఈ క్రింది అంశాలను నొక్కి చెప్పారు.

- ప్రభుత్వ డైరీల పరిస్థితికి విరుద్ధంగా, అభివృద్ధి చెందిన దేశాల్లో లాగా కైరా డైరీ స్వంత దారులు రైతులే. వారు తమ ఎన్నికైన ప్రతినిధుల ద్వారా దీన్ని నిర్వహిస్తారు. నిర్వహణలో అధికోత్పత్తికి, రైతుల ప్రయోజనాలకు ప్రాముఖ్యత నిస్తారు. ఈ డైరీని నడపటానికి వృత్తి నైపుణ్యంకల నన్ను (కురియన్‌ను) జనరల్ మేనేజర్ గా నియమించి కావలసినంత స్వేచ్ఛ, మద్దతు ఇచ్చారు. నేను ఈ రైతుల ఉద్యోగినే.
- సహకార సంఘాల చట్టాలు ఉన్నా కూడా, కైరా సంఘం నిజమైన సహకార సంఘంగా ఉండటానికి కారణం సర్దార్ వల్లభాయి పటేల్‌చే గుర్తించబడిన తరువాత ఆయన ఆశయాల మేరకు కృషి చేస్తున్న కైరా ఛైర్మన్ త్రిభువన్ దాస్ పటేల్, ఆయన మీద రైతులకున్న అపార విశ్వాసం.

అంతా విని ప్రధాన మంత్రి కాసేపు ఆలోచించి ఆనంద్ తరహా పాలసంఘాలు దేశమంతటా నెలకొల్పాలని, దీనికై ఏర్పాటు చేయవలసిన జాతీయ సంస్థకు పూర్తి స్వేచ్ఛతో అధిపతిగా ఉండాలని అక్కడి కక్కడే కురియన్‌ను కోరారు. కురియన్ తన రెండు కోరికలు మన్నిస్తే తాను దీనికి సిద్ధమేనని సమాధానమిచ్చారు. ఒకటవ కోరిక-తాను ప్రభుత్వ ఉద్యోగిగా ఉండనని, ప్రభుత్వం నుండి ఎటువంటి జీతభత్యాలు తీసుకోలేనని. రెండవ కోరిక తాను అధిపత్యం వహించబోయే జాతీయ సంస్థ ప్రధాన కార్యాలయం ఢిల్లీలో కాకుండా ఆనంద్ లోనే ఉండాలని.

కురియన్ రెండు కోరికలకు ప్రధాన మంత్రి సమ్మతించారు. ఢిల్లీకి తిరిగి వెళ్ళిన తరువాత అప్పటి ఆహార వ్యవసాయ శాఖా మంత్రి సి. సుబ్రహ్మణ్యంతో చర్చించి ఈ దిశలో చర్యలకు ఉపక్రమించారు. అందరు గవర్నర్లకు ముఖ్యమంత్రులకు, కేంద్రమంత్రులకు ఆనంద్ తరహా సహకార డైరీల ఏర్పాటు ఆవశ్యకత గురించి ఒక అర్ధాధికార లేఖ (ఐ.శీ. శ్రీవివతీ) ను ప్రాసారు చివరకు 1965లో వర్గీస్ కురియన్ ఛైర్మన్‌గా జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి బోర్డు (ఎన్.డి.డి.బి.) నెలకొల్పబడింది. కురియన్ 33 సంవత్సరాలపాటు అంటే 1998 వరకు ఛైర్మన్‌గా కొనసాగారు. 1965లో దాదాపు 20 మిలియన్ టన్నులుగా ఉండిన భారత దేశపు పాల ఉత్పత్తి 2001-02లో 84.4 మిలియన్ టన్నులకు చేరి ప్రపంచదేశాల్లో మొదటి స్థానాన్ని పొందింది. 2011-12లో 127.90 మిలియన్ టన్నులతో మొదటి స్థానంలో కొనసాగుతోంది. వర్గీస్ కురియన్ క్షీర విప్లవ సారధిగా కొనియాడబడి పద్మ విభూషణ్ అవార్డు కూడా పొందారు. 2012 లో తన 91వ ఏట తనువు చాలించారు.

మన గొప్ప ప్రధాన మంత్రులలో లాల్‌బహదూర్ శాస్త్రి (1904-1966) ఒకరు. దిగ్గజం లాంటి జవహర్ లాల్ నెహ్రూ మరణానంతర కీలక దశలో భారత్ ఏమౌతుందోనన్న కుతూహలంతో ప్రపంచ దేశాలు గమనిస్తున్నపుడు ఆయన ప్రధాని పదవి చేపట్టారు. తను ప్రధానిగా ఉండిన 19 నెలలలో తన ఉత్తేజకరమైన నాయకత్వం క్రింద భారత సేనలు 1965 యుద్ధంలో పాకిస్తాన్ దురాక్రమణను సమర్ధవంతంగా ఎదుర్కొని గొప్పవిజయం సాధించాయి. ఇదే సమయంలో దేశం ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన ఆహార సమస్యను మరింత జటిలం చేసే విదేశీ పోకడలను గమనించిన లాల్ బహదూర్ శాస్త్రి బలాన్ని బలంతోనే ఎదుర్కొంటామని ప్రకటిస్తూనే, దేశ రక్షణతో పాటు ఆహార ధాన్యాల స్వయం సమృద్ధికూడా అంతే ముఖ్యమైనదని ప్రకటించారు. ఈ దిశా నిర్దేశంలో భాగంగా ''జైజవాన్ - జైకిసాన్'' అనే నినాదాన్ని ముందుకు తెచ్చారు. దేశ ప్రతిష్టను, ఆత్మగౌరవాన్ని దృష్టిలో నుంచుకొని కొంతకాలంపాటు విందులు, వినోదాలు, పార్టీల పేరిట ఆహార ధాన్యాల దుబారాను అరికడుతూ, వారానికి ఒక పూట భోజనం మానాలని ప్రజలకు పిలుపిచ్చారు. తాను కూడా దానిని పాటించారు. క్షీర విప్లవ దిశగా చర్యలు తీసికోవటమే కాకుండా తను ఎంపిక చేసిన ఆహార వ్యవసాయ శాఖా మంత్రి సి.సుబ్రహ్మణ్యం తో కలసి వ్యవసాయ పరిశోధనకు, వ్యయసాయాభివృద్ధికి, ఆహార ధాన్యాల స్వయం సమృద్ధికి దీర్ఘకాలిక వ్యూహాలను రచించారు. వ్యక్తిగతంగా నీతి, నిజాయితీ, నిరాడంబరత లాంటి విలువలకు ఖచ్చితంగా కట్టుబడిన నిస్వార్థ నాయకుడుగా పేరు పొందారు

**- ఏ నాగేశ్వర రావు,**

**సెంటర్ హెడ్, నీరు, పారిశుద్ధ్య కేంద్రం, ఎ.ఎమ్.ఆర్.అపార్డ్**

# భవిష్యత్ తరాల వారికి సముద్రపు నీరే ఆధారమా !



**700 కోట్లకు మించిన జనాభాలో 100 కోట్ల మందికి నీరు అందుబాటులో లేదు. నీరు సకల జీవ కోటికి ప్రాణాధారం. నీరు లేనిదే ప్రాణి మనుగడ లేదు. భూమి మీద నిర్దిష్ట పరిమితిలోనే నీరుంది. అయితే భూప్రపంచమంతా నీరున్నప్పటికీ, అన్ని ప్రాంతాలలో సమమైన నిష్పత్తిలో లేదు. వర్షాలు అన్ని ప్రాంతాలలో సమంగా కురవడం లేదు. సకాలంలో పడడం లేదు. వర్షాలు సకాలంలో పడకపోవడానికి కారణం ఏమిటంటే, శిలాజ ఇంధనాలు విచ్చల విడిగా వాడడం వల్ల ఏర్పడిన కలుషిత వాయువులు వాతావరణాన్ని మార్చి వేస్తున్నాయి.**

వర్షాలు సకాలంలో పడడానికి దోహదపడే అడవులు నశించి పోతున్నాయి. దేశ వైశాల్యంలో 33% అడవి వుంటే, ప్రకృతి సమతుల్యతతో వుంటుంది. మన దేశంలో 21% మాత్రమే అడవులున్నట్లు సెంట్రల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ప్రకటించింది. ప్రపంచ జనాభాలో దాదాపు 17% మన దేశ జనాభా ఉంది. కాని నిష్పత్తి పరంగా అడవులు 1% మాత్రమే వున్నాయి. దాదాపు ఏటా 13,101 చ.కి. అడవీ భూమిని మన దేశం కోల్పోతున్నది.

భూమిపై నీరు 70% వుంది. ఇక భూమిపై వున్న నీటిలో 97% ఉప్పు, అంటే ఉప్పునీరు, మిగిలిన 3% ధృవాల వద్ద మంచు రూపంలోనూ, నదులు, చెరువులు రూపంలోనూ ఉంది.

రోజు రోజుకు (**మంచినీరు**) రక్షిత నీరు తరిగిపోతూ ప్రజలకు అవసరమైన నీటిని అందించ లేకపోతుండడం జరుగుతోంది.

నీటివనరుల సంరక్షణ లేకపోతే మానవ మనుగడ లేదని గ్రహించి, 1993 మార్చి 22 యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ తొలి **ప్రపంచ నీటి దినాన్ని** నిర్వహించింది. దీని ముఖ్య ఉద్దేశ్యం వ్యవసాయం, ఆరోగ్యం, నీటి ప్రాముఖ్యత తదితర అంశాల గూర్చి ప్రజలకు అవగాహన కల్గించడం. ఈ సంవత్సరం "నీటి దినాన్ని" - **"ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కో ఆపరేషన్"** గా ప్రకటించడం జరిగింది.

నీటి వనరుల ప్రయోజనాలు కాపాడుకోవడానికి, సక్రమ వినియోగానికి ప్రపంచ దేశాలన్నిటి మధ్య సహకారం అవసరం. ఏ దేశాభివృద్ధికైనా నీటి వనరుల నిర్వహణ చాలా ముఖ్యం. నీటి వినియోగదారుల మధ్య సహకారం నీటి ప్రయోజనాలకు దోహదం చేస్తుంది.

22.3.2013 న కూడా ప్రపంచ నీటి దినాన్ని జరుపుకోవడమైంది. ఇందులో ప్రాణులను కాపాడేందుకు వాతావరణ పరిశీలన అన్నది అంశం. ప్రపంచంలోని వివిధ దేశాల గుండా ప్రవహిస్తున్న నదులను అంతర్జాతీయ నదులు అంటున్నాము. ఇక భారత అంతర్దేశీయ నదులు గంగ, సింధు, బ్రహ్మపుత్ర. అంతర్జాతీయ నదులను, దేశీయ నదులను అనుసంధానం చేయడం వల్ల కూడా నీటి ఎద్దడిని నివారించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

**అవి ముఖ్యంగా :**

వివిధ దేశాలు - వివిధ రాష్ట్రాల గుండా ప్రవహించే నదీ జలాలకు అంతరాష్ట్రీయ అంతర్జాతీయ సహకారం, సమన్వయం అవసరం.

- 1935 సం॥లో అమలులోకి వచ్చిన భారత ప్రభుత్వ చట్టం ప్రకారం, నదీ జలాల అంశం ప్రత్యేకంగా రాష్ట్రాల పరిధిలోకి వచ్చింది.
- 1956 సం॥లో అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదంపై పార్లమెంటు ఒక చట్టం చేసింది.
- 1960 సం॥లో భారత్, పాక్ మధ్య 1960 లో సింధూ నదీ జలాల ఒడంబడిక జరిగింది.
- జోర్డాన్ ఇజ్రాయెల్ నదీ జలాల నిర్వహణకు ఒడంబడిక కుదుర్చుకోవడానికి దాదాపు 40 సం॥రాల కాలం పట్టింది.
- 1996 సం॥లో భారత్ బంగ్లాదేశ్ మధ్య గంగా జలాల ఒడంబడిక
- సింధూనదీ జలవివాద పరిష్కారానికి 10 సం॥రాల కాలం పట్టింది. అంటే గడిచిన 50 సం॥రాలలో దాదాపు 37 నదీ జలాల పంపిణీకి సంబంధించి వివాదాలు వచ్చాయి.

**ఇక గోదావరి నదీ జలాల వినియోగం గూర్చి**

- 1975 డిసెంబర్‌లో కర్ణాటక, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఒరిస్సా, ఆంధ్ర ప్రదేశ్‌ల మధ్య.
- 1978 లో ఆగస్టులో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్ మధ్య.
- 1978 ఆగస్టులో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మధ్య
- 1978 డిసెంబర్‌లో ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ మధ్య
- 1979 జనవరిలో కర్ణాటక, మహారాష్ట్రల మధ్య
- 1979 జూలైలో ఒరిస్సా, మధ్యప్రదేశ్‌ల మధ్య పరస్పర సమన్వయ సహకారాలతో కుదిరిన ఆ ఒప్పందాలను "బచావత్ ట్రిబ్యునల్" తీర్పులో భాగంగా చేర్చారు.

**కృష్ణానది :-** కేంద్ర ప్రభుత్వం 1969లో జస్టిస్ బచావత్ నేతృత్వంలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. 1976లో తీర్పు ఇచ్చింది.

**కావేరి నది :-** 1990 జూన్‌లో ఏర్పాటైన ట్రిబ్యునల్ 2007 ఫిబ్రవరిలో నివేదిక సమర్పించింది.

నీటి వివాదాలు ఏర్పడకుండా వుండాలంటే రాష్ట్రాల మధ్య సహకారం అవసరం.

"నీటిని సృష్టించలేం, సంరక్షించుకోవాలి". ముఖ్యంగా నదీ ప్రాంతాలలోని ఇసుకను విచ్చల విడిగా తరలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇసుకను నదుల్లో 1,2 మీటర్లు మాత్రమే తీయడానికి ప్రభుత్వం ద్వారా అనుమతి పొందాలి. ఇక నీరు ఇంకడానికి అడ్డుపడే ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లు నదుల్లో వుండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

దూసుకు పోతున్న జనాభా పెరుగుదల, వాతావరణ మార్పులు ఇంకిపోతున్న భూగర్భ వనరులు భూమిపై పొరలో వర్షపు నీరు నిల్వ వుంటుంది. దానిని వాడుకుంటే వర్షం వచ్చినప్పుడు అదిభర్తీ అవుతుంది. ఇక రెండవ పొర బెడ్‌రాక్ లోపల వుంటుంది, ఇందులోకి డ్రిల్ చేసి నీటిని తోడేస్తున్నారు. ఈ లోటును వర్షపునీటితో భర్తీచేయలేము.

జనాభాతో పాటు నీటి అవసరాలు పెరుగుతున్నాయి. భూగర్భంలో నున్న నీటితో సమస్య తీర్చ లేమనే భావనతో ప్రపంచ దేశాలు ప్రస్తుతం భూమిపై నున్న నీటి వైపు దృష్టిని మరల్చాయి. మనకందరికీ తెలుసు, భూమిపైన వున్న నీటిలో అధిక భాగం సముద్ర జలాలే సముద్ర జలాలన్నీ ఉప్పు నీరే.

ఇజ్రాయిల్ నీటి అవసరాలు 20% సముద్రపునీటి ద్వారానే జరుగుతున్నాయి. అంతర్జాతీయ డీశాలినేషన్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం, 2009 సం॥ నాటికి దాదాపు 14,450 డిశాలినేషన్ ప్లాంటులున్నాయి. వీటిలో రోజుకు '6800' కోట్ల లీటర్ల మంచి నీరు తయారవుతుంది. 2020 సం॥ నాటికి రోజుకు '12000' కోట్ల లీటర్ల నీరు ఉత్పత్తి అవుతుందని అంచనా. ప్రస్తుతం ప్రపంచ మొత్తంగా 19000 వరకు డీశాలినేషన్ ప్లాంటులున్నాయి. దక్షిణాసియాలోని అతి పెద్ద డిశాలినేషన్ ప్లాంట్ భారత్‌లో వుంది. చైనా సమీపంలోని ఈ ప్లాంటు నుంచి ఏటా సుమారు 3650 కోట్ల లీటర్ల నీరు ఉత్పత్తి అవుతుందని అంచనా.

- సముద్రపు నీటిని మరగ బెట్టి లవణాలను వేడి చేసి మంచి నీటి (త్రాగడానికి పనికి వచ్చే విధంగా)గా తయారు చేస్తారు.
- రివర్స్ ఆస్మాసిస్.
- ప్రస్తుతం లాక్‌హెడ్ మార్టిన్ అవిష్కరణ పెస్పిరిన్‌కు ప్రాముఖ్యత

**రివర్స్ ఆస్మాసిస్ :**

ఒక ద్రావణంలో అణువులు ప్రవహించగల త్వచాలు (పొరలు) ఉంచినప్పుడు అణువులు అధిక గాఢతల గల ప్రదేశం నుంచి అల్పగాఢతలు గల ప్రదేశాలకు ప్రవహిస్తాయి. ద్రావణం రెండు వైపులా సమాన గాఢత వచ్చేవరకు ఇలా జరుగుతుంది. ఒక వైపు నుంచి వత్తిడి కలిగించినప్పుడు ఇదే పొర పెద్ద అణువులను, ఆయాన్లను వడ పోస్తుంది. ఈ సూత్రం ఆధారంగా ప్రస్తుతం ఉప్పు నీటి నుండి మంచి నీటిని తయారు చేస్తున్నారు. ఇది ఖర్చుతో కూడుకున్న పని.

**పెస్పరిన్ :**

కేవలం ఒక అణువు మందంలోని అతి పలుచని గ్రాఫిన్ రేకులతో తయారు చేసే త్వచలాలనే పెస్పిరిన్ ఫిల్టర్లంటారు. వీటిపై 100 నానో మీటర్లు (ఒక నానో మీటరు అంటే మీటరులో వంద కోట్ల వంతు) లేదా అంతకన్నా తక్కువ సైజులో రంధ్రాలుంటాయి. సముద్రపు నీరు, మురికి నీరు, ఇతర ద్రావణాల్లో వుండే సోడియం, క్లోరిన్ వంటి ఆయాన్లను వడబోసి నీటి అణువులను మాత్రమే ఈ రంధ్రాల గుండా పోనిస్తాయి. నీటి అణువుల ప్రవాహాన్ని అడ్డుకోకుండా, ఇతర ఆయాన్లను మాత్రమే అడ్డుకుంటాయి. అందుకే ఈ పెస్పిరిన్ ఫిల్టర్లతో నిర్లవణీకరణ, నీటి శుద్ధి ప్రక్రియలో మంచి మార్పులు వస్తాయని శాస్త్రజ్ఞుల భావన.

కనుక భవిష్యత్ తరాల వారు నీటి వనరులుగా సముద్ర జలాలను మార్చుకొనే ప్రక్రియలో 'పెస్పిరిన్' ప్రధాన భూమిక వహించ బోతుంది.

ఉప్పునీటి నుండి త్రాగునీటిని తయారు చేసుకొనే అవసరాన్ని తగ్గించుకుని, మంచినీటి వనరులను సంరక్షించుకోవాలి. ప్రకృతిలో నీటి (త్రాగునీరు) నిల్వలు ఎండి పోకుండా చెట్లను నాటాలి. నాటిన చెట్లను నరికి వేయకుండా సంరక్షించుకోవాలి. అడవులను పెంచకుండా నరకడం వల్ల సమతుల్యత లోపించి, జీవ వైవిధ్యానికి నష్టం కలుగుతుంది. కనుక నీరు, చెట్టు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత అందరి మీద వుంది.

(కొంత భాగం అనువాదం మరియు సంకలనం)

**- రాజేశ్వరమ్మ, యం.పి.డి.ఓ. విజయపురం మండలం, చిత్తూరు.**

# గ్రామ సీమల అభివృద్ధి లక్ష్యంగా 'పుర' (PURA) పథకం

**గ్రామ సీమల అభివృద్ధి దేశ ప్రగతికి మూల స్థంభమని మహాత్మాగాంధీ పలుసార్లు వక్కాణించారు. గ్రామాలలో సౌకర్యాలు, సదుపాయాలు కల్పించినపుడు పల్లెల నుంచి పట్టణాలకు వలసలు తగ్గుతాయని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అభిప్రాయ పడేవారు. ఆ మహనీయుల ఆశలకు, ఆశయాలకు అద్దం పట్టే 'పుర' పథకం కృష్ణా జిల్లాలో రూపుదిద్దుకుంటున్నది.**



విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి, తిరువూరు వెళ్ళేందుకు చీలే ప్రదేశాన్ని అడ్డ రోడ్డు అంటారు. 50 ఏళ్ళ క్రితం అది నిర్మానుష్యమైన ప్రదేశం. బాటసారులు తాగటానికి కూడా మంచి నీళ్ళు దొరికేవి కావు. అక్కడికి కొంచెం దూరంలో కృష్ణా నది ఒడ్డున ఇబ్రహీంపట్నం అనే కుగ్రామం వుండేది. కాల క్రమంలో అడ్డ రోడ్డు కూడా ఇబ్రహీం పట్నంగా పిలవబడుతుంది. సమీపంలో వి.టి.పి.యస్. (విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్) ప్రారంభమై, వందల గ్రామాల్లో వెలుగులు నింపుతున్నది.

అడ్డరోడ్డు సెంటరుకు సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో కొండపల్లి వుంది. చరిత్రలో దీనికి గొప్ప స్థానముంది. "కొండపల్లి జిల్లా" చారిత్రక స్థలం. కొండపల్లి బొమ్మలకు ప్రపంచ వ్యాప్త ప్రచారం ఉంది. అయినా గ్రామంగానే మిగిలి పోయింది. గొప్ప పర్యాటక క్షేత్రంగా అభిమానం చూరగొంటున్నా, అభివృద్ధి జరగటం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి శంకుస్థాపన చేసిన 'పుర' (ప్రావిజన్ ఆఫ్ అర్బన్ ఎమినిటీస్ ఇన్ రూరల్ ఏరియా) పథకంతో ఆ రెండు గ్రామాల రూపు రేఖలు మారిపోయి, ప్రజలకు అత్యాధునిక సదుపాయాలు సమకూరే సమయం ఆసన్నమైంది. గ్రామాలలో కూడా పట్టణ సదుపాయాలు కల్పించటం ఈ పథకం లక్ష్యమని శంకుస్థాపన అనంతరం ప్రసంగించిన వక్తలు అభిప్రాయ పడ్డారు.

### పథకం అంచనా - ఫలితాలు

ఈ 'పుర' పథకం ప్రాథమిక అంచనా విలువ రూ. 189 కోట్లు. ఈ విధమైన ప్రాజెక్టు ఈ జిల్లాలో మొదటిది (రాష్ట్రంలో రెండవది). 11వ పంచవర్ష ప్రణాళిక నిధులతో ఈ పథకాన్ని పూర్తి చేయాలనే దృక్పథంతో ఉన్నారు. తాగు నీటి సరఫరా, మురుగు నీటి పారుదల వ్యవస్థను మెరుగు పరచటం, చెత్త ఆధారంగా విద్యుత్ రూపకల్పన, సౌర విద్యుత్ వ్యవస్థను అభివృద్ధి పరచటంతో పాటు; స్థానిక వనరులను, పరిస్థితులను అనుకూలంగా మార్చుకొని ఉపాధి, ఉద్యోగంలాంటి అవకాశాలు కల్పించటం కూడా ఈ పథకంలోని భాగాలే. అంతర్గత రహదారుల ఏర్పాటు, పర్యాటక అభివృద్ధి, సమాచార వ్యవస్థను మెరుగు పరచటం, సమీకృత గ్రామీణ సముదాయం లాంటి పలు అంశాలను ఈ 'పుర' పథకంలో చేర్చారు.

### 'పుర' విజయవంతమైతే మరికొన్ని చోట్ల అమలు

ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చి, వారి జీవన గమనంలో వెలుగులు నింపటమే ప్రభుత్వాల లక్ష్యమని, అందుకోసం ఖర్చుకు వెనుకాడేది లేదని, అడ్డంకులను పట్టించుకోమని ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. 'పుర' పథకం ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రంలో మరి కొన్ని చోట్ల దీని అమలు చేస్తామని కేంద్ర మంత్రి శ్రీ జైరామ్ రమేష్ చెప్పారు. 'పుర' పథకం వల్ల ప్రతి ఇంటికి తాగునీరు, మురుగునీటి పారుదల సదుపాయలు సమకూరుతాయని, ఈ రెండు గ్రామాలు దేశంలో ఆదర్శ గ్రామాలుగా నిలుస్తాయని విజయవాడ యం.పి. శ్రీ లగడపాటి రాజగోపాల్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీ కె. పార్థసారథి, యం.యల్.ఎ.లు శ్రీ మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, శ్రీమతి డి. పద్మజోతి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ శ్రీ కంచి రామారావు, యం.యల్.సి. శ్రీ ఐలాపురం వెంకయ్య పాల్గొన్నారు.

**- దాసరి అళ్వార్ స్వామి**




# క్షామ- దుర్భిక్ష పీడిత ప్రాంతాలకు అనువైన పంట "కీన్ వా"

**వ్యవసాయం లాభసాటి యైన వృత్తి కాదన్న వాదన నానాటికీ పుంజుకొంటున్న రోజుల్లో, ఈ వాదనను బల పరుస్తూ ఆ మధ్య కొందరు రైతులు తూర్పుగోదావరి జిల్లాలో "క్రాప్ హాలిడే" ప్రకటించి నపుడు రైతుకు ధైర్యాన్నివ్వగలిగిన వ్యవసాయ పద్ధతులు కానీ, లేదా మంచి ఆదాయాన్ని ఇవ్వగలిగిన వంగడాలు గానీ ఉన్నయా అంటూ "అపార్డ్" అన్వేషిస్తూన్న పరిస్థితుల్లో, "కీన్వా" అనే పంట గురించి తెలిసింది. ఈ పంట కేవలం పై సమస్యల్నే కాదు, ఆహారభద్రత విషయంలో కూడా 'ధీటైన' జవాబివ్వగలుగుతుందన్న గట్టినమ్మకంతో దీనిపై ఓ ప్రత్యేక ప్రయోగం చేయాల్సి వచ్చింది. దీనికి తోడు క్షామపీడిత ప్రాంతాలకు తగిన దీర్ఘ కాలిక పరిష్కారమేదైనా వీలుంటుందేమో అని "ప్రాజెక్టు అనంత" పేరుతో చేస్తున్న ప్రయోగంలో భాగంగా కూడా "కీన్వా" పంట మా ముందుకొచ్చింది. ఆంగ్లంలో అక్షరాలు QUINOA - కినోవా అన్ని ఉన్నా, ఉచ్ఛారణ మాత్రం 'కీన్వా" అని అంటారు.**

క్షామ పీడిత ప్రాంతాలకు అనువైన అద్భుత పంటగా 'కీన్ వా'ను ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ కూడా గుర్తించింది. ప్రపంచ ఆహార భద్రకు తోడ్పడే పంటగా దీనిని గుర్తించి 2013 సంవత్సరాన్ని అంతర్జాతీయ కీన్వా సంవత్సరంగా యఫ్.ఎ.ఓ ప్రకటించింది.

"చీనోపొడియేసి" కుటుంబానికి చెందిన కీన్వా (QUINOA) శాస్త్రీయ నామం చీనోపోడియం కీన్వా (Chenopodium quinoa) దక్షిణ అమెరికా దేశానికి చెందిన బొలీవీయా మరియు పెరూ ప్రాంతాలలో ప్రధమంగా 1778 సంవత్సరంలో గుర్తించటం జరిగింది. కీన్వాలో మనిషికి కావలసిన అన్ని అత్యవసర అమినో ఆమ్లాలు, విటమిన్లు, సూక్ష్మ పోషకాలు తగినంత మోతాదులో గల ఏకైక చిరుధాన్యంగా గుర్తింపు లభించింది. వరి, గోధుమలకు భిన్నంగా ఈ పంటలో అత్యవసర అమినో ఆమ్లాలు గింజ కేంద్రకంలో ఉంటాయి. ఈ పంట అతి తక్కువ వర్షపాతం 100-200మి.మీ ఉన్న ప్రాంతంలో కూడా, వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకొని మంచి దిగుబడులు ఇవ్వటం వలన దీనిని క్షామ మరియు దుర్భిక్ష ప్రాంతాలకు అనువైన పంటగా గుర్తించటం జరిగింది. ఈ పంట వివిధ ప్రాంతాలలో -4$^0$ సి నుండి 38$^0$ సి ఉష్ణోగ్రత మరియు 40-88% తేమ శాతం గల ప్రాంతాలలో కూడా బాగా పెరిగి మంచి దిగుబడులు ఇస్తుంది.

ఈ పంటను పెరూలో 40,000లు టన్నులు, బొలీవియాలో 28000 టన్నుల వరకు ప్రతి ఏటా పండిస్తున్నారు. క్రమేణా ఇంగ్లాండ్, స్వీడన్, డెన్మార్క్, నెదర్లాండ్స్, ఇటలీ దేశాలకు విస్తరించింది. ఈ మధ్య ఫ్రాన్స్ దేశంలో 200 హెక్టార్లలో ఈ పంటను పండించి హెక్టారుకు 1080 కిలోల దిగుబడి సాధించారు. కెన్యాలో అత్యధికంగా హెక్టారుకు 4 టన్నుల దిగుబడి రికార్డయింది.

బొలీవియా దేశంలో కీన్వా ఎగుమతి ద్వారా 2010 సంవత్సరంలో 43 మిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించటం జరిగింది. కీన్వా గింజలు అత్యధికంగా దిగుమతి చేసుకొంటున్న దేశాలు అమెరికా(45%), ఫ్రాన్స్(16%), నెదర్లాండ్స్(13%), జర్మనీ, కెనడా, ఇజ్రాయెల్, బ్రెజిల్, లండన్ పెరూ దేశం 2007 సంవత్సరంలో 400 మెట్రిక్ టన్నులు కీన్వా గింజలు ఎగుమతి చేసి $ 5,52,000 అమెరికన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆర్జించింది. ఈక్వడార్ దేశం 304 మెట్రిక్ టన్నులు ఎగుమతి చేసి $ 5,57,000ల అమెరికా డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆర్జించింది. ప్రపంచ ఆర్గానిక్ ఉత్పత్తులలో కీన్వా గింజల ధర కిలో ఒక్కంటికి 3.1 అమెరికన్ డాలర్లు ఇది సోయాబీన్, గోధుమలతో పోలిస్తే చాలా ఎక్కువ (0.4 అమెరికన్ డాలర్లు) కీన్వా లో గల పోషక విలువలను గుర్తించిన నాసా (NASA) ఎక్కువ కాలం రోదశీయానం చేసే వ్యోమగాముల ఆహారంలో కీన్వాను చేర్చటం జరిగింది. కీన్వా గింజలతో తయారుచేసే వివిధ ఆహార ఉత్పత్తులు పిండి, పాస్తా, మురుకులు, చాక్లెట్లు, పఫ్స్ లకు ప్రపంచ విపణిలో మంచి గిరాకీ ఉంది. కీన్వా నుండి తీసిన ఆయిల్ పిండి పదార్థం, సాపోనిన్ రంగులు వివిధ ఆహార, రసాయన మరియు మందుల కంపెనీలలో విరివిగా ఉపయోగిస్తున్నారు.

### కీన్‌వా పోషక విలువలు

కీన్‌వా గింజలు అత్యంత పోషక విలువలు గల అత్యద్భుతమైన చిరుదాన్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. వివిధ ధాన్యాలు చిరుధాన్యాలతో కీన్‌వా పోషక విలువలను పరిశీలించగా

| పంట - | నీటి శాతం % | మాంస కృత్తులు % | నూనె % | పిండి పధార్థం % | పీచు పదార్థం % | బూడిద % |
|---|---|---|---|---|---|---|
| కీన్‌వా | 12.6 | 13.8 | 5.0 | 59.7 | 41 | 3.4 |
| బార్లీ | 9.0 | 14.7 | 1.1 | 67.8 | 2.0 | 5.5 |
| మొక్కజొన్న | 13.5 | 8.7 | 3.9 | 70.9 | 1.7 | 1.2 |
| జొన్న | 11.0 | 11.9 | 4.0 | 68.6 | 2.0 | 2.0 |
| ఓట్స్ | 13.5 | 11.1 | 4.6 | 57.6 | 0.3 | 2.9 |
| బియ్యం | 11.0 | 7.3 | 0.4 | 80.4 | 0.4 | 0.5 |
| గోధుమలు | 10.9 | 13.0 | 1.6 | 70.0 | 2.7 | 1.8 |

అవసరమైన అన్ని అత్యవసర అమినో ఆమ్లాలు తగినంత పాళ్ళలో ఉన్నాయి. అమినో ఆమ్లం విలువ గ్రా.లలో ప్రతి 100 గ్రా. ప్రొటీన్‌కు పట్టికలో పొందుపరచడమైనది.

| అమినోఆమ్లం | కీన్‌వా | గోధుమలు | సోయా | పాలు |
|---|---|---|---|---|
| ఐసోల్యూసీన్ | 4.0 | 3.8 | 4.7 | 5.6 |
| ల్యూసీన్ | 6.8 | 6.6 | 7.0 | 9.8 |
| లైసీన్ | 5.1 | 2.5 | 6.3 | 8.2 |
| ఫినైల్ అలనైన్ | 4.6 | 4.5 | 4.6 | 4.8 |
| టైరోసిన్ | 3.8 | 3.0 | 3.6 | 5.0 |
| సిస్టీన్ | 2.4 | 2.2 | 1.4 | 0.9 |
| మిధియొనైన్ | 2.2 | 1.7 | 1.4 | 2.6 |
| ధియొనైన్ | 3.7 | 2.9 | 3.9 | 4.6 |
| ట్రిప్టోఫాన్ | 1.2 | 1.3 | 1.2 | 1.3 |
| వాలీన్ | 4.8 | 4.7 | 4.9 | 6.9 |

కీన్‌వా గింజలలో ఐరన్, మాంగనీస్, జింకు, పొటాషియం, కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం వంటి మినరల్స్ (లవణాలు) అధిక శాతంలో ఉండటం వల్ల దీనికి మంచి పోషకాహారంగా గుర్తింపు లభించింది.



అపార్డ్‌లో సాగులో ఉన్న కీన్‌వా క్షేత్రం




మొలక శాతం పరీక్షించే ప్రయోగం

| పంట | కాల్షియం | భాస్వరం | మెగ్నీషియం | పొటాషియం | సోడియం | ఐరన్ | కాపర్ | మాంగనీస్ | జింకు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| కీన్‌వా | 0.19% | 0.47% | 0.26% | 0.87% | 115 | 205 | 67 | 128 | 50 |
| బార్లీ | 0.08 | 0.42 | 0.12 | 0.56 | 200 | 50 | 8 | 16 | 15 |
| మొక్కజొన్న | 0.07 | 0.36 | 0.14 | 0.39 | 900 | 21 | - | - | - |
| గోధుమలు | 0.05 | 0.36 | 0.16 | 0.52 | 900 | 50 | 7 | - | 1 |

### అపార్డ్‌లో ప్రయోగాత్మకంగా కీన్‌వా సాగు

అద్భుత చిరుధాన్యం కీన్‌వా పంటను మనరాష్ట్రంలో ఉన్నటువంటి క్షామ పీడిత ప్రాంతాలకు తీసుకు వెళ్ళే లక్ష్యంలో భాగంగా అపార్డులో ముందుగా సాగు చేయటానికి NBPGR (National Bureau of plant Genetic Resource) ద్వారా బొలీవియా నుండి మూడు మేలైన కీన్‌వా రకాలను అపార్డ్ తెప్పించి ప్రయోగాత్మకంగా సాగు చేయటం ప్రారంభించింది. ఈ సాగులో భాగంగా మొదటగా మొలక శాతం పరీక్షించడమైనది. ఈ మూడు వంగడాలు 65% నుండి 85% వరకు మొలకెత్తాయి.

### క్షేత్ర సాగు

క్షేత్ర సాగు ప్రారంభానికి ముందు కేవలం సేంద్రియ ఎరువులు అయిన వేప పిండి, వర్మి కంపోస్ట్ ఉపయోగించి క్షేత్రం తయారు చేయటం జరిగింది. తేదీ 25-3-2011 న 0.6 మీ 1.0 మీ వెడల్పు గల బోదెలపై నాటటం జరిగింది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పంట 160 రోజులలో కాపుకి వస్తుంది. అతి తక్కువ వర్షపాతంలో పెరిగే ఈ పంట కోరిన ఫలితాలను ఇచ్చినట్లయితే అనంతపురం, మహబూబ్ నగర్, నల్గొండ, మెదక్ వంటి కరువు ప్రాంతాల చిన్న-సన్నకారు రైతులకు ఆశాజనకమైన పంటగా స్థిరపడుతుంది.

**- కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్) మరియు యస్.వి. రత్నాచారి**





### మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే

#### మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !

# గ్రామ పునర్నిర్మాణానికి చేయూతనిస్తున్న మోత్కూర్ గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

**ఆధునిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది, నేడు గ్రామ సీమలలో కూడా మానవత్వ విలువలు, సేవా గుణం మచ్చుకు కూడా కనబడని నేటి రోజుల గురించి మనకు తెలిసిందే. ఇక పట్టణాలు, మండల కేంద్రాలలో నైతే మన పక్కనే ఉన్న వారి గురించి ఆలోచించే తీరిక, ఆలోచన కూడ లేదు. ఎందుకంటే, పెరుగుతున్న జనాభా, స్వార్థం, పని ఒత్తిడి. దీని మూలంగా పేదలు, వృద్ధులు, నిరక్ష్యరాస్యుల సమస్యల పట్టించుకునే వారు లేరు. దాని ద్వారా సమాజంలో నేడు అనేక రుగ్మతలను చూడవలసి వస్తున్నది.**

### మోత్కూర్ గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు

**1. వయోజన విద్యా కేంద్రం ఏర్పాటు**

స్థానిక సాయిబాబా కాలనీలో 23 మంది వయోజనులను అక్షరాస్యులను చేయడానికి స్వంత నిధులతో వయోజన విద్యా కేంద్రం ఏర్పాటు చేసి, ప్రతి రోజూ రాత్రి వారికి విద్య నేర్పుతున్నారు.

**2. పారిశుధ్యం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నిర్మల్ భారత్ అభియాన్ పథకం గురించి, పారిశుధ్యం గురించి అవగాహన ర్యాలీ చేపట్టి, బహిరంగంగా మలవిసర్జన చేయరాదని కాలనీ వాసులతో ప్రతిజ్ఞ చేయించారు.

**3. మహిళలకు స్వయం ఉపాధి**

25 మందికి గుడ్డ ఇచ్చి వారిచే గుడ్డ సంచులు కుట్టించి ప్రతి సంచికి రూ. 2 ఇప్పించారు.

**4. దూపాపానం నిషేదం**

'నో స్మోకింగ్ డే' సందర్భంగా 'పొగత్రాగటం ఆరోగ్యానికి హానికరం" అని వాల్ స్టిక్కర్ ముద్రించి ఆర్‌టిసి బస్సులలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో, బస్టాండ్‌లలో, జనసమ్మర్ధమైన ప్రదేశాలలో అంటించడం, స్థానిక ఎస్.ఐ. గారి ప్రారంభోత్సవంలో మండల, గ్రామాలలో ఆటో ద్వారా ప్రచారం చేయించినారు.

**5. మానవత్వ దృక్పథం**

సమాజ శ్రేయస్సు, అన్ని మతాల మధ్య ప్రశాంతత, శాంతి కోసం దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబు పేలుడులో మరణించిన వారి ఆత్మ శాంతికి మండల కేంద్రంలో కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు.

**6. చేయవలసిన ప్రణాళిక**

మోత్కూర్ గ్రామంలో వీధులలో ఎల్‌ఇడి బల్బుల ఏర్పాటు.

**7. అందరు మండల స్థాయి అధికారులతో ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు**

ఇలాంటి పరిస్థితులలో కూడా ఎక్కడో కొంత మంది సమాజ సేవ చేయాలని ఆలోచించే వారు ఉండటం చాలా అభినందనీయం, అలాంటి కోవకు చేందిన వారే మోత్కూర్ మండల కేంద్రానికి చెందిన చాడ మంజుల, అనిల్, శ్రీనివాస్ రెడ్డి మొదలైనవారు. వీరు తమ గ్రామంలో ఉన్న సామాజిక రుగ్మతలను, సమస్యలను చూచి తమ వంతు కృషి చేసి వాటిని కొంతవరకైనా పరిష్కరించుకోవాలనుకున్నారు.

కాని మండల కేంద్రం జనాబా 12,000. ఇంత పెద్ద జనాభాగల గ్రామంలో అనేక కులాలు, అనేక మతాలు వారు దానికి తోడు అధికారుల నిరాదరణ వంటి సమస్యలతో వారు చేయలనుకున్న కొన్ని సేవలకు కొంత ఆటంకం కలిగింది. అలాంటి సమయంలో వారికి టివి రిపేర్ టెక్నీషియన్ శ్రీ శ్రీనివాస్ ద్వారా (మోత్కూర్) భారత్ నిర్మాణ్ వాలంటీర్ల వ్యవస్థ గురించి తెలుసుకొన్నారు. జిల్లా ప్రజాపరిషత్తునకు మంది వచ్చి, మేము కూడా సమాజ సేవ చేయాలనుకుంటున్నామని, భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా చేరుతామని అని చెప్పి, అందుకు సంబంధించిన అన్ని విషయాలను తెలుసుకొని వెళ్ళి, 50 మందితో నమోదు పత్రాలను పూర్తి చేయించి జిల్లా ప్రజా పరిషత్తుకు తీసుకురావడం జరిగింది.

వారు భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా నమోదు అయిన తరువాత స్థానిక మండల పరిషత్తు అభివృద్ధి అధికారి, తహశిల్దారుల దగ్గరకు వెళ్ళి, మేము భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా పేర్లను నవెూదు చేసుకొన్నామని, తాము చేపట్టే కార్యక్రమాలకు వారి సహకారాలు కావాలని కోరారు. అందుకు అనుగుణంగా వారు ఏ కార్యక్రమం చేపట్టినా, ప్రారంభోత్సవానికి ప్రభుత్వ అధికారులను ఆహ్వానించి ఆ కార్యక్రమానికి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. వారు చేపట్టిన కార్యక్రమాల గ్రామ ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఆశిద్దాం.

**- బి. లింగా రెడ్డి, జిల్లా శిక్షణా మేనేజర్, నల్గొండ జిల్లా,**



# సంపూర్ణ పారిశుధ్యంతో దేశ గౌరవాన్ని పెంచుదాం

**ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన సామాజిక సమస్యలలో గ్రామీణ పారిశుధ్య సమస్య ప్రధానమైనది. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఆహార భద్రత, సురక్షిత త్రాగునీటి లభ్యత ఎంత అవసరమో, చక్కటి పారిశుధ్యం, సౌకర్యాలు కూడా అంతే అవసరం. ప్రపంచ వ్యాప్తంగా మరుగుదొడ్లు లేని జనాభాలో అరవైశాతం ప్రజలు భారతదేశంలోనే నివశిస్తున్నారు. అంతే కాకుండా, 2012 సంవత్సరంలో యునిసెఫ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచ దేశాల్లో అత్యధిక సంఖ్యలో బహిరంగ మలవిసర్జన చేసే ప్రజలు (638 మిలియన్లు) మన దేశంలోనే ఉన్నారు. బహిరంగ మలవిసర్జన పట్టణ ప్రాంతాల్లోని మురికివాడల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎక్కువగా ఉంది.**

భారతదేశం మలవిసర్జనా మురికికూపంలోకి కూరుకుపోతోందని ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇది అంతర్జాతీయ స్థాయిలో మన దేశానికి తీవ్రమైన తలవంపులు తీసుకొని వస్తోంది. ఈ పరిస్థితుల్లో మార్పు వస్తేనే అభివృద్ధిలో సంతులనం సాధించినట్లు అవుతుంది.

## సంపూర్ణ పారిశుధ్యం దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు

దేశంలో పారిశుధ్య పరిస్థితుల్లో మార్పు తీసుకొని రావటానికి మొదటి పంచవర్ష ప్రణాళికా కాలం నుండే కృషి మొదలయినప్పటికీ, అనేక కారణాల వలన ఈ రంగంలో ఆశించిన రీతిలో ప్రగతి సాధించలేకపోయాం. ఈ దిశలో మొదటిసారిగా 1954 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఆరోగ్యరంగంలో రూ. ఆరు కోట్ల బడ్జెట్ కేటాయింపుతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఐతే ఈ దిశగా సమగ్రమైన చర్యలు మాత్రం 80ల దశకంలోనే ప్రారంభమయ్యాయని చెప్పవచ్చు.

1981-90 దశాబ్దాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ నీరు మరియు పారిశుధ్య దశాబ్దంగా ప్రకటించటంతో, మన దేశంలో కూడా ఈ రంగాలలో ప్రగతి సాధించటానికి తొలిసారిగా వ్యూహరచన చేసింది. ఆ దశాబ్దం ప్రారంభంలో దేశంలో మరుగుదొడ్డి కల్గిన ప్రజల శాతం కేవలం 0.5% మాత్రమే. పారిశుధ్య సౌకర్యాలు మెరుగు పరచటం ద్వారా ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు తీసుకొని రావటానికి 1986 సంవత్సరంలో కేంద్రం గ్రామీణ పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొనే వారికి ప్రోత్సాహకాలు అందచేయటం మొదలయింది. ఈ పథకంలో అందచేసే ప్రోత్సాహకం చాలా తక్కువగా ఉండటంతో పాటు, ప్రజల అలవాట్లలో మార్పు తీసుకొని రావటానికి పెద్దగా దృష్టి సారించకపోవటంతో ఈ పథకం అంతగా విజయవంతం కాలేదనే చెప్పవచ్చు. ఏది ఏమైనప్పటికీ, 1991 నాటికి దేశంలో మరుగుదొడ్డి కల్గిన ప్రజల శాతం 1% కి చేరింది.

పారిశుధ్యం అంటే కేవలం వ్యక్తిగత పారిశుధ్యమనే భావన తొలినాళ్లలో ఉన్నప్పటికీ, రాను రాను ఈ భావన విస్తృతమవుతూ పర్యావరణ పారిశుధ్యానికి పెద్ద పీట వేయటం జరిగింది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పర్యావరణ పరిశుభ్రత, ఘన, ద్రవ, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పాఠశాల పారిశుధ్యం, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్యం వంటి అంశాలను కూడా చేరుస్తూ సంపూర్ణ పారిశుధ్య సాధన దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది.

2012 నాటికి దేశంలో 100 శాతం పారిశుధ్యాన్ని సాధించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకొని 1991లో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. సంపూర్ణ పారిశుధ్య ఉద్యమం ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకాన్ని మాత్రమే ప్రోత్సహించటం కాకుండా, రాయితీ మొత్తాన్ని పెంచుతూ, పథకం అమలులో పంచాయతీరాజ్ సంస్థలను, ప్రజలను భాగస్వాములను చేయటం, వినూత్న ప్రచారం, విద్యా కార్యక్రమాల ద్వారా ప్రజలలో వ్యక్తిగత మరుగుదొడ్లకు

గిరాకీని సృష్టించటానికి పెద్ద పీట వేయటం జరిగింది. నిర్మల గ్రామ పురస్కారం అవార్డు ద్వారా పారిశుధ్యం కోసం కృషి చేసిన పంచాయతీల ను, వ్యక్తులను భారత రాష్ట్రపతి సత్కరించి, నగదు బహుమతిని అందచేయటం వంటి అంశాలు ఈ కార్యక్రమంలో చేర్చారు. ఫలితంగా ఈ పథకం గతంలో అమలు చేసిన పథకాలకన్న మెరుగైన ప్రగతిని సాధించినదనే చెప్పవచ్చు.

త్రాగునీరు, పారిశుధ్య రంగాలను ప్రధాన స్రవంతి రంగాలుగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం కేంద్రస్థాయిలో ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను 2011లో ఏర్పాటు చేసింది. సంపూర్ణ పారిశుధ్య ప్రచారం, కార్యక్రమ ప్రభావంపై ప్రపంచబ్యాంకు సహాయంతో కేంద్రం త్రాగునీరు, పారిశుధ్య మంత్రిత్వ శాఖ ఇటీవల జరిపిన అధ్యయనంలో కేవలం హర్యానా, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, త్రిపుర, మిజోరాం, కేరళ రాష్ట్రాలలో మినహా మిగిలిన రాష్ట్రాలలో ఈ పథకం ఆశాజనక ఫలితాను ఇవ్వలేదని తెలుస్తోంది. అందుకే పన్నెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో దేశంలో పారిశుధ్య సౌకర్యాలను మెరుగు పరచటానికి ప్రస్తుతం అమలులో ఉన్న సంపూర్ణ పారిశుధ్య పథకానికి మార్పులు, చేర్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 'నిర్మల్ భారత్ అభియాన్' అనే మరొక కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది.

## మార్పు కోసం 'నిర్మల భారత్ అభియాన్'

గ్రామీణ జీవనశైలిలో అనాదిగా అలవాటుగా ఉన్న బహిరంగ మలవిసర్జనను పూర్తిగా అరికట్టి, గ్రామీణ భారతావనిలో వ్యక్తిగత పారిశుధ్యంతో పాటు పర్యావరణ పారిశుధ్యాన్ని కూడా మెరుగు పరచటానికి కేంద్ర ప్రభుత్వం 'నిర్మల్ భారత్ అభియాన్'ను రూపొందించింది. 2022 సంవత్సరం నాటికి అన్ని గ్రామ పంచాయతీల ను నిర్మల్ గ్రామాలుగా తీర్చిదిద్ది, ప్రజల జీవన ప్రమాణాలలో మెరుగుదల తీసుకొని రావాలనేది ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. అదే విధంగా అన్ని ప్రభుత్వ సంస్థలలో ముఖ్యంగా అన్ని పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తారు.

బహిరంగ మల విసర్జన సమాజ సమ్మతం కాదని ప్రజలు గుర్తించేలా మార్పు తీసుకునిరావటం, వ్యక్తిగత మరియు పర్యావరణ పారిశుధ్యాన్ని మెరుగుపర్చటం, గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా మార్పు చేయుటానికి పంచాయతీరాజ్ సంస్థలను



ప్రోత్సహించటం, ఘన, ద్రవ, వ్యర్థ పదార్థాల నిర్వహణను మెరుగు పరచటం, పారిశుధ్యం ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్య పరిచే సామాజిక సంస్థలను ప్రోత్సహించటం వంటి వ్యూహాలు ఈ పథకంలో అవలంబించనున్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం అందచేసే రాయితీని కూడా గణనీయంగా పెంచారు. మైదాన ప్రాంతాలలో రూ. 4,600లు, కొండ ప్రాంతాలలో రూ. 5,100 లు సబ్సిడీగా అందచేస్తారు. ఈ మొత్తానికి తోడు 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం'తో జోడించి అదనంగా రూ. 4,500 లను వేతన రూపంలో అందచేస్తారు. అంటే వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం తరపు నుండి మొత్తం రూ. 9,100 లు అందచేస్తారు. లబ్దిదారుడు మరొక 900 రూపాయలు జతచేస్తే రూ. 10,000లతో మరుగుదొడ్డి నిర్మించుకొనే కుటుంబాలకే కాకుండా, కొన్ని మినహాయింపులతో ఎస్.సి/ ఎస్.టి/ బలహీన వర్గాలు, భూమిలేని, సన్న, చిన్న కారు రైతులకు కూడా అనువర్తింప చేస్తారు. పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ. 35,000 లు, అంగన్‌వాడీ కేంద్రాలకు 8,000 లు అందచేస్తారు.

సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించిన పంచాయతీలకు నిర్మల గ్రామ పురస్కారంతో పాటు జనాభా ప్రాతిపదికన రూ లక్ష నుండి పది లక్షల వరకూ నగదు బహుమతులు అందచేస్తారు. అదే విధంగా 50 వేల కన్నా తక్కువ జనాభా ఉన్న మండలాలకు 15 లక్షల రూపాయలు, 50 వేల కన్నా ఎక్కువ జనాభా ఉన్న మండలాలకు 20 లక్షల రూపాయలు బహుమతి అందచేస్తారు. అదే విధంగా 10 లక్షల జనాభా కన్నా తక్కువ ఉన్న జిల్లాలకు 30 లక్షలు, 50 లక్షలు రూపాయల బహుమతి అందచేస్తారు.

'నిర్మల భారత్ అభియాన్' ఒక పటిష్టమైన సమాచారం, ప్రచారం, ఆరోగ్యం, విద్య మీద ప్రత్యేక దృష్టి పెడుతోంది. గ్రామీణ ప్రజలలో అవగాహన కోసం స్వచ్ఛతా దూతలను పారిశుధ్య ప్రచారం కోసం వినియోగించనున్నారు. అదేవిధంగా ప్రజలలో అవగాహన కల్పించటానికి టివి, రేడియో, వార్తా పత్రికల వంటి ప్రధాన స్రవంతి సమాచార సాంకేతిక మాధ్యమాలతో పాటు, గ్రామీణ ప్రాంతాలలో అనువైన జానపద కళారూపాల ద్వారా నృత్యాలు, రంగస్థల నాటకాల వంటి మాధ్యమాలను ఉపయోగించుకోనున్నారు.

పారిశుధ్య సాధనలో బంగ్లాదేశ్ అనుభవాలను పరిగణనలోకి తీసుకొని, ట్రిగ్గరింగ్, గ్రామ సందర్శన, సామాజిక చిత్ర పటాల రూప కల్పన వంటి వినూత్న ప్రజా భాగస్వామ్య పద్ధతులను ఉపయోగించి బహిరంగ మలవిసర్జన వలన కలిగే అనర్థాలను వివరించటం ద్వారా మెరుగైన ఫలితాలను రాబట్టటానికి ఈ 'నిర్మల భారత అభియాన్' దూసుకొని వస్తోంది.

## అధిగమించవలసిన సవాళ్లు, పరిష్కార మార్గాలు

పారిశుధ్య లోపం ప్రజల ఆరోగ్యానికి పెనుశాపంగా పరిణ మించటమే కాక దేశ ఆర్థిక పురోగతిపై వ్యతిరేక ఫలితాలను కూడా ఇస్తున్నట్లు యునిసెఫ్, ప్రపంచ బ్యాంకు నివేదికల ద్వారా మనకు తెలుస్తోంది. పారిశుధ్య లోపం ముఖ్యంగా పేద కుటుంబాలలో, మరీ ముఖ్యంగా మహిళలు, పిల్లలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది.

అతిసార వ్యాధి వల్ల ఏటా ప్రపంచవ్యాప్తంగా సంభవించే 15

లక్షల శిశు మరణాల్లో అగ్రభాగం భారత్‌దే. మన దేశంలో ఏటా 4 లక్షల మంది శిశువులు అతిసారం వల్ల మరణిస్తున్నారు.

మరొక విచారించదగ్గ విషయమేమంటే, ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు ప్రతిరోజూ 1000 మంది డయేరియా, హైపటైటిస్, ఇతర పారిశుధ్య సంబంధిత వ్యాధుల వల్ల మరణిస్తున్నారు (2012 యునిసెఫ్ నివేదిక). ఇలా చనిపోయే పిల్లల్లో 80 శాతం మంది 2 సంవత్సరాలలోపు వారే. అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఏటా సంభవించే 15 లక్షల పై చిలుకు పిల్లల మరణాలలో 3.86 లక్షల మరణాలు భారతదేశంలోనే సంభవిస్తున్నాయి. సహారా ఆఫ్రికా దేశాల కన్నా మన పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు ఈ గణాంకాల వలన తెలుస్తోంది.

పాఠశాలలో పారిశుధ్య వసతుల లేమి ప్రభావం పాఠశాల హాజరుపై తీవ్రంగా ఉన్నట్లు యునిసెఫ్ నివేదిక ద్వారా తెలుస్తోంది. అంతేకాకుండా దీని ప్రభావం విద్యార్థుల ప్రవర్తనా సరళిపైన, వారి అవగాహనా సామర్థ్యాలపైన తీవ్రమైన ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది.

2010 సంవత్సరపు ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం పారిశుధ్య లేమి వలన మన దేశం ఏటా రూ 24000 కోట్లు ఆర్థికంగా నష్టపోతోంది. ఇందులో కేవలం వ్యక్తిగత పరిశుభ్రత సరిగా పాటించకపోవటం వల్ల రూ. 17000 కోట్లు నష్టపోతున్నట్లు ఈ నివేదిక వలన మనకు తెలుస్తోంది. దీనికి తోడు ప్రతి ఏటా రూ. 12000 కోట్ల రూపాయలు కేవలం పారిశుధ్య సంబంధ వ్యాధుల నివారణకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఖర్చు చేయటం జరుగుతోంది.

ఇటీవల ఐక్యరాజ్య సమితి చేసిన అధ్యయనంలో భారత దేశంలోని ప్రజల దగ్గర ఉన్న మొబైల్ ఫోన్ల సంఖ్య దేశంలో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్ల సంఖ్య కన్నా ఎక్కువ అనే విషయాన్ని తెలియచేస్తోంది. అంటే దేశంలో మొబైల్ ఫోన్‌ల కోసం తహతహలాడే ప్రజలలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలనే కోరిక లేకపోవటం పాలకులకు ఒక సవాలుగా నిలుస్తోంది. గ్రామీణ కుటుంబాలలో 60% కుటుంబాలకు మరుగుదొడ్డి నిర్మించుకొనే స్తోమత ఉన్నప్పటికీ, వారు దీనికి ప్రాధాన్యత ఇవ్వటం లేదు. మొబైల్ ఫోన్లు, టీవీ, కూలర్లు, మోటారు సైకిల్ వంటి ఉపకరణాలకు ఇచ్చిన ప్రాధాన్యత మరుగుదొడ్లకు ఇవ్వటం లేదు.

గత పది సంవత్సరాలుగా సంపూర్ణ పారిశుధ్య ప్రచార కార్యక్రమం ద్వారా జరిగిన కృషి వలన 2012 సంవత్సరం నాటికి దేశ వ్యాప్తంగా ఉన్న 2,60,000 పంచాయతీలలో 2,8000 పంచాయతీలు మాత్రమే నిర్మల గ్రామ పురస్కార స్థాయికి వచ్చాయి. 166 సమితులు, 10 జిల్లాలు, సిక్కిం రాష్ట్రం సంపూర్ణ పారిశుద్ధ్య స్థాయిని చేరాయి.

దేశంలోని అన్ని గ్రామాలు నిర్మల గ్రామ స్థాయికి రావాలంటే మరో పది సంవత్సరాలు పడుతుందని కేంద్ర గ్రామీణ పారిశుధ్య శాఖ మంత్రి ఇటీవల రాజ్యసభలో ఒక ప్రకటన చేశారు. ఐతే యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నీరు, పారిశుధ్య కార్యక్రమం వారి అంచనాల ప్రకారం ప్రస్తుతం నడుస్తున్న తీరులోనే అమలు అయితే, 2054 సంవత్సరానికి గానీ మన దేశంలో 100 శాతం పారిశుధ్యం సాధ్యం కాదని తెలుస్తోంది. 2015 నాటికి సహస్రాబ్ది లక్ష్యాలను సాధించటానికి నిర్దేశించు కున్న లక్ష్యాలను ఒడిశా రాష్ట్రంలో అయితే 2060 వరకూ పట్టవచ్చు అనేది ఒక అంచనా.

పారిశుధ్య రంగానికి జి.డి.పి.లో కేవలం 0.5-0.6% మాత్రమే వెచ్చిస్తున్నారు. 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఈ రంగంలో రూ. 5459 కోట్ల రూపాయలు వెచ్చించారు. సంపూర్ణ పారిశుధ్యం సాధించాలంటే, ఈ రంగానికి 12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో రూ. 60000 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని ప్లానింగు కమీషను ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ అంచనా వేసింది.

సమస్య సాధనకు కేవలం నిధులు కేటాయిస్తే సరిపోదు. బహిరంగ మలవిసర్జన చేయరాదు అనే మానసిక పరివర్తన ప్రజలలో తీసుకొని రావటానికి విస్తృతమైన ప్రచార కార్యక్రమాన్ని కుటుంబ స్థాయిలో చేపట్టాలి. జాతీయ త్రాగునీటి సరఫరా పథకం లక్ష్యాలకు అనుగుణంగా సురక్షిత త్రాగునీటిని అందరికీ అందుబాటులోకి తీసుకునిరావటం, నీటి సేకరణ మరియు వినియోగంలో జాగ్రత్తలు వహించటం ద్వారా డయేరియా వంటి వ్యాధులను అరికట్టవచ్చనే అవగాహనను ప్రజలలో కల్పించాలి.

గ్రామంలోని యువతను సమీకరించి వీరిందరికి స్వచ్ఛతా దూతలుగా చక్కని శిక్షణ అందచేసి, గ్రామీణ కుటుంబాలతో అనుసంధానించే ప్రయోగాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలి. కేంద్రప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సత్వర అభివృద్ధి కోసం స్వచ్ఛంద సేవను ప్రోత్సహిస్తూ రూపొందించిన భారత నిర్మాణ వాలంటీర్లు కూడా ఈ దిశలో ఉపయోగపడతారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రజలు తమంతట తామే ముందుకు వచ్చేలా మార్పుతేవాలి. ఎస్.సి/ ఎస్.టి., ఇతర బలహీన వర్గాల వారిని కలుపుకుని పోతూ సమ్మిళిత అభివృద్ధి సాధించాలి. కేవలం మరుగుదొడ్డి నిర్మించుకోవటమే కాక వాటిని వినియోగంలోకి తీసుకొని రావటంపై ఈ కార్యక్రమం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వీటితో పాటు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలలో అవగాహన కల్గించి పంచాయతీల ద్వారా ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలి. సాధించిన ప్రగతి నిలకడగా నిలిచేలా ఈ పథక భాగస్వాములందరూ తప్పనిసరిగా కృషి చేయాలి.

అదే విధంగా పాఠశాల స్థాయి నుండే పిల్లలకు ఆరోగ్య విద్యను బోధించి వారి ద్వారా వారి వారి కుటుంబాల్లోని పెద్దలకు వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్డి వినియోగం, మలవిసర్జన తరువాత, భోజనానికి ముందు చేతులు శుభ్ర పరుచుకొంటే కలిగే ఉపయోగాల పై అవగాహన కల్గించటానికి పెద్ద ఎత్తున ప్రచారం జరగాల్సి ఉన్నది. పిల్లల మల మూత్రాల నిర్వహణ పట్ల పెద్దవారికి ఉన్న అపోహలను తొలగించటానికి కృషి చేయాలి.

గ్రామ సభలను చైతన్య పరిచి పారిశుధ్య సమస్య పరిష్కార దిశగా పంచాయతీలు పనిచేసేలా ఒత్తిడి పెంచాలి. పథక నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించటానికి సామాజిక తనిఖీని ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'ఎప్పుడైతే దేశంలోని ప్రతి వ్యక్తీ మరుగుదొడ్డిని వినియోగించు కొనగలుగుతారో ఆ రోజే దేశం సమున్నతమైన అభివృద్ధిని సాధించినట్లు' అని మన ప్రథమ ప్రధాని పండిత జవహర్ లాల్ అన్నమాటలు నిజమవ్వాలంటే ప్రభుత్వం, పంచాయతీ రాజ్ సంస్థలు, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలి. అప్పుడే నిర్మల్ భారత్ అభియాన్ ఉద్దేశ్యం నెరవేరుతుంది. అంతర్జాతీయ వేదికపై మనదేశం సగర్వంగా తలెత్తుకొని నిలబడగల్గుతుంది.

*- డా॥ వి. శివశంకర ప్రసాద్,*
*ఎం.పి.డి.ఓ.*

# ఉపాధి హామీ పథకం ద్వారా కూరగాయల సాగు

**మెదక్ జిల్లా సిద్ధిపేట మండలంలోని చింతమడక గ్రామంలో ఎర్నోల్ల కనకయ్యకు గత సుమారు 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం సర్వే నెం 179 లో 2.00 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ భూమి ఎగుడు దిగుడుగా ఉండటం వలన, సాగుకు యోగ్యంగా లేకపోవటం వలన అప్పటి నుండి బీడుగా పడి ఉంది.**

**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2007-08 సంవత్సరంలో ఈ భూమిలో భూమి అభివృద్ధి పనులను చేపట్టడం వలన అది చదునుగా మారటంతో, కనకయ్య వర్షాధార పంటలైన మొక్కజొన్న, కంది, తదితర పంటలను పండించుకుంటున్నాడు.**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తూ కనకయ్య తన భూమిని బాగుపరచుకున్నాడు. తరువాత 2012-13 ఆర్థిక సంవత్సరంలో నీటి వసతి కల్పించుకొని కూరగాయలు పండించాలన్న కోరికతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నూతన వ్యవసాయ బావిని తవ్వుకున్నాడు. దీనికి 1,20,000 రూపాయలను కూలీలకు వేతనాల రూపంలో, క్రేన్ చార్జీల రూపంలో ఖర్చు పెట్టాడు. ఈ బావిని 16 మీ. లోతు వరకు తవ్వటం ద్వారా దానిలో నీరు రావటంతో కూరగాయలు పండించాలన్న ఆలోచనలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.80.000 లతో పందిళ్లు వేశాడు.

ఈ పందిళ్లలో ప్రస్తుతం బీరకాయలు, కాకరకాయలు, టమాటాలు సాగు చేస్తున్నాడు. మొట్ట మొదటి సారి కూరగాయలు సాగు చేయటం





| | | |
|---|---|---|
| పేరు | - | ఎర్నోల్ల కనకయ్య |
| కులం | - | మాదిగ (ఎస్.సి.) |
| గ్రామం | - | చింతమడక |
| మండలం | - | సిద్ధిపేట |
| జిల్లా | - | మెదక్ |
| సర్వే నెం. | - | 179 |
| విస్తీర్ణం | - | 2 ఎకరాలు |
| వివరాలు సేకరించిన తేది | - | 24-3-2013 |


పట్ల కనకయ్య సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఈ భూమిలో కూరగాయలు పండిస్తానని ఏనాడూ అనుకోలేదని, బీర, కాకర వలన ఇప్పటి వరకు రూ. 30,000 లాభం వచ్చిందని, ఇంకా ఇతర కూరగాయల ద్వారా మరింత లాభం రాగలదని ఆశిస్తున్నానని కనకయ్య చెప్పాడు. ఇతనికి ఇద్దరు కొడుకులు. వీరు ప్రస్తుతం ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు.

*- డా॥ నరసింహారావు,* సిద్ధిపేట





ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన విజయనగరం జిల్లా సారిపల్లి గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.




21-5-2013 తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించిన తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం మండలం, రావులపాడు గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గ్రామసభ నిర్వహిస్తున్న అదిలాబాద్ జిల్లా దండేపల్లి గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల



రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం నానక్‌నగర్ గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి బి.ఎన్.వి లను అడిగి తెలుసుకుంటున్న జాతీయ స్థాయి పరిశీలకులు శ్రీ బి.సి. మోహన్‌దాసన్.



టి.టి.సి మరియు పాల్‌టెక్నిక్ ప్రవేశ పరీక్షలకు ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించిన తూర్పు గోదావరి జిల్లా, కముజువారిలంక గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించిన తుర్పుగోదావరి జిల్లా కముజువారి లంక గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు .



పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్గించి పారిశుద్ధ్య నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నల్గొండ జిల్లా మోత్కూరు గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



వయోజన విద్యా కేంద్రం ప్రారంభించి ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్న నల్గొండ జిల్లా మోత్కూర్ గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.

రోడ్డుకిరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు మండలం చిన నిండ్రు కొలను గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



# అపూర్వ విజయాలు



కర్నూలు జిల్లా రుద్రవరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు శ్రమదానం చేస్తుండగా పరిశీలిస్తున్న జాతీయ స్థాయి పరిశీలకులు శ్రీ బి.సి. మోహన్‌దాసన్



అపార్డు అందజేసిన స్టిల్ కెమెరాను ఒంగోలు ఎం.పి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మరియు కలెక్టర్ జి.ఎస్.ఆర్.కె.ఆర్. విజయ్ కుమార్ చేతులు మీదుగా అందుకుంటున్న ప్రకాశం జిల్లా కడవ కుదురు గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.

పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు మండలం బొమ్మిడి మరియు కాగుపాడు గ్రామాలలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల నమోదు కార్యక్రమంలో పాల్గొన్న అపార్డు సి.ఎన్.ఆర్.ఎం సెంటర్ అధికారులు శ్రీ హెచ్. కూర్మారావు, శ్రీ జి. జయపాల రెడ్డి.



# సుస్థిర వ్యవసాయానికి భూసార యాజమాన్య పద్ధతులు



**మంచి దిగుబడులు సాధించటంలో భూసార యాజమాన్యానిది కీలక పాత్ర. కాని రసాయనిక ఎరువులను అధికంగా ఉపయోగించడం వలన భూసారం క్రమంగా తగ్గిపోతుంది. రసాయనిక ఎరువులు దిగుమతి చేసుకోవడానికి విలువైన విదేశీ మారకద్రవ్యం వినియోగించవలసి వస్తోంది. రసాయనిక ఎరువులు వినియోగించటం వలన భూమి, నీరు కలుషితం కావటం జరుగుతుంది. రైతు పెట్టే ఖర్చు పెరిగి నష్టాలకు గురి కావలసి వస్తుంది. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సుస్థిర వ్యవసాయ కార్యక్రమం ద్వారా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించడానికి కృషి చేస్తున్నది. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించడానికి క్రింది పద్ధతులను అమలు చేస్తున్నది.**

## చెరువు మట్టి తోలటం

చెరువు మట్టి తోలటం వలన భూమి సారం పెరగటంతో పాటు భూమి నిర్మాణం అభివృద్ధి చెందుతుంది. భూమిలో పోషకాల లభ్యత పెరుగుతుంది. నీటి నిల్వ శక్తి పెరుగుతుంది. ఎకరాకు 20 ట్రాక్టర్ల చెరువుమట్టిని ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వినియోగించాలి.

**పశువుల ఎరువు / గేత్తం వెయ్యడం :**

పశువుల పేడ, మూత్రం, గడ్డి కలిపితే పశువుల ఎరువు ఏర్పడుతుంది. మాగిన ఎరువు వెయ్యడం వలన భూసారం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పశువుల ఎరువు వెయ్యడం వలన భూమికి పొటాషియం, నత్రజని లభిస్తాయి.

**పచ్చిరొట్ట పంటలు**

పంటకు అవసరమయ్యే పోషకాలను సేంద్రియ రూపంలో సమర్ధవంతంగా అందించాలంటే, పచ్చి రొట్ట పంటలు బాగా ఉపయోగ పడతాయి. తక్కువ వనరులలో బాగా పెరిగే పంటలను ప్రధాన పంట వేసేందుకు సుమారు రెండు నెలల ముందే విత్తుకోవాలి. పంట పూతకు వచ్చే సమయానికి భూమిలో కలియదున్నాలి. దున్నిన రెండు మూడు వారాలకు బాగా కుళ్ళటం వలన విడుదలైన పోషకాలు పొలంలో విత్తిన ప్రధాన పంటకు అందుతాయి. పచ్చి రొట్ట పంటల వలన భూ నిర్మాణం మెరుగుపడుతుంది. సేంద్రియ కార్బనం పెరుగుతుంది.

| పచ్చిరొట్ట పంట | విత్తే నెలలు | ఎకరానికి అవసరమైన విత్తనాలు (కిలోలు) | భూమికి అందే నత్రజని కిలోలలో |
|---|---|---|---|
| మినుము | జూన్-జూలై | 8-9 | 27-28 |
| బొబ్బర్లు | ఏప్రిల్-జూలై | 18-22 | 30-35 |
| జనుము | ఏప్రిల్-జూలై | 32-40 | 33-42 |
| పెసర | జూన్-జూలై | 12-16 | 27-34 |
| ఉలవలు | జూన్-జూలై | 10-12 | 48-54 |

## పచ్చి ఆకు ఎరువు

పచ్చిరొట్ట పంట వేసుకోవడం కుదరని పరిస్థితులలో చెట్ల ఆకులను, కొమ్మలను తీసుకువచ్చి పొలంలో కలుపుకోవచ్చు. గ్లైరిసిడియా, కానుగ, మోదుగ, సీతాఫలం మొదలైన చెట్లు పచ్చి

ఆకు ఎరువును ఇచ్చే చెట్లు. గట్ల మీద ఈ చెట్లను నాటుకుంటే ప్రతి పంట యొక్క ఎరువు అవసరాలను సులువుగా అందించవచ్చు.

సూక్ష్మ జీవుల సహజీవనం ద్వారా మొక్కలకు ఎరువు అందుతుంది కనుక, ఈ సూక్ష్మ జీవులను జీవన ఎరువులు అంటాం. ఇవి పంటకు ఎరువును తయారుచేసి అందిస్తాయి. రైజోబియం, అజటో బాక్టర్, సుదొమొనస్ మొదలైనవి జీవన ఎరువులుగా ఉపయోగపడతాయి. రైజోబియం పప్పు జాతి పంటలలో ఉపయోగపడుతుంది. అజటో బాక్టర్ పప్పు జాతి కానీ ఇతర పంటలలో ఉపయోగపడుతుంది.

**మల్చింగ్ :** భూమిని ఆకులతో గాని పంట మిగుళ్లతో గాని తీగ జాతి మొక్కలతో గాని కప్పి వుంచటాన్ని మల్చింగ్ అంటారు. మల్చింగ్ ముఖ్యంగా మూడు రకాలు. సజీవ అచ్చాదన (తీగ జాతి మొక్కలతో భూమిని కప్పివుంచడం), మృదు అచ్చాదన (మట్టితో కప్పి వుంచడం) కాస్త అచ్చాదన (పంట మిగుళ్లతో భూమిని కప్పి వుంచడం) అచ్చాదన వలన ఎండ వేడి నేరుగా భూమికి తగలక పోవటం వలన నేలలోని సూక్ష్మ జీవులకు నష్టం వాటిల్లదు. భూమిపై కప్పే ఆకులు మొదలైన సేంద్రియ పదార్థాలు కుళ్ళి పోషకాలు విడుదల చేస్తాయి.

**దభోల్కర్ పద్ధతి :**

భూసారం పెంచడానికి ఉపయోగించే పద్ధతులలో మేలైన పద్ధతి దభోల్కర్ పద్ధతి. ఈ పద్ధతికి కావలసిన విత్తనాలు :

| | |
|---|---|
| ధాన్యాలు (మొక్క జొన్న, జొన్న, సజ్జలు మొదలైనవి) : | 5 కేజీలు |
| పప్పు దినుసులు (మినుము, పెసలు, సెనగలి) : | 5 కేజీలు |
| నూనె గింజలు (నువ్వులు, వేరుసెనగ, ఆముదం, పొద్దు తిరుగుడు) : | 5 కేజీలు |
| సుగంధ ద్రవ్యాలు (ఆవాలు) : | 5 కేజీలు |
| పచ్చిరొట్ట పంటలు (గ్లిరిసిడియా, పిల్లి పెసర) : | 5 కేజీలు |







దుక్కిదున్ని మండువగిన తరువాత పై విత్తనాలు అన్నీ కలగలిపి ఎకరానికి 20-25 కేజీలు చల్లుకోవాలి. 30-40 రోజుల వరకు పెరగనిచ్చి భూమిలో కలియదున్నాలి.

**అజొల్ల :**

వరి నాట్లు వేసిన తరువాత 7-10 రోజుల లోపు అజొల్లను వరిపొలంలో వెయ్యాలి. అజొల్ల వలన పంటకు నత్రజని అందుతుంది.

**నదేప్ కంపోస్టింగ్ :**

నదేప్ కంపోస్ట్ పిట్‌ను ఇటుకలతోనూ, పంటల మిగుళ్లతోను, నిర్మించవచ్చు. మంచి కంపోస్ట్ తయారు కావడానికి అవసరమైన కొలతలు : **పొడవు :** 10 అడుగులు, **వెడల్పు :** 5 అడుగులు, **ఎత్తు :** 3 అడుగులు

ఒక అడుగు ఎత్తు వరకు ఎటువంటి ఖాళీలు ఉండకూడదు. ఒక అడుగు ఎత్తు వేసుకోవాలి. ఇటుకకు, ఇటుకకు మధ్యలో 6 అంగుళాల ఖాళీ వదలాలి.

**నదేప్ కంపోస్ట్ తయారీకి కావలసిన పదార్థాలు :**

| | |
|---|---|
| పంటల మిగుళ్లు లేదా ఆకులు | : 1350 - 1400 కేజీలు |
| పశువుల పేడ లేదా బయోగాస్ స్లర్రి | : 98 - 100 కేజీలు |
| జల్లెడ పట్టిన మట్టి | : 1675 కేజీలు |
| నీరు | : 1350 - 1400 లీటర్లు |

కంపోస్ట్ పిట్‌ను నింపే ముందు కంపోస్ట్ పిట్ గోడలను పేడతో అలకాలి. కంపోస్ట్ పిట్‌ను పొరలు పొరలుగా నింపాలి.

**మొదటి పొర :** 8-10 అంగుళాల వరకు పంట మిగుళ్లు, ఆకులు మొదలైనవి.

**రెండవ పొర :** 4 కేజీల పేడను 100 లీటర్లను నీటితో కలిపి మొదటి పొరపై చల్లాలి.

**మూడవ పొర :** 60 కేజీల మట్టిని పొరలుగా చల్లాలి.

పై విధంగా 6-7 పొరలుగా కంపోస్ట్ పిట్‌ను పూర్తిచేయాలి. కంపోస్ట్ పిట్ నింపిన తరువాత పేడతో, మట్టితో మూడు అంగుళాల ఎత్తు వచ్చే వరకు అలకాలి.

కంపోస్ట్ పిట్ నింపిన 15-30 రోజుల తరువాత కంపోస్ట్ పిట్ కుంగడం జరుగుతుంది. కుంగిన దానిపైన పేర్కొన్న విధంగా మళ్లీ నింపాలి. 90-120 రోజుల తరువాత సుమారు 2.5 టన్నుల ఎరువు తయారు అవుతుంది.

పేడ, పప్పు దినుసుల పిండితో చేసే ఘన, ద్రవ, జీవ అమృతాలు కూడా భూసారం పెంచడానికి ఉపయోగ పడతాయి.

**కె. జయరాం**


# మందుల పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టాలి



**ఫార్మా నగరాల చుట్టూ నివసిస్తున్న ప్రజలు ఆ కాలుష్యం వలన పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పారిశ్రామిక వేత్తలు వారి పరిశ్రమలలో సరియైన రక్షణ చర్యలు తీసుకోరు. వీరు లేబర్ ఇన్‌స్పెక్టర్లతో లాలూచీ పడి, మందుల ఫ్యాక్టరీలలో కూడా సరియైన జాగ్రత్తలు తీసుకోరు.**

దానితో ఫ్యాక్టరీలలో కార్మికులు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఇటీవల వైజాగ్ ఫార్మాసిటీలో సంభవించిన ప్రేలుళ్ళలో పలువురు చనిపోయారు. హైదరాబాద్‌లోని బాలాజీ నగర్ ఏరియాలోనున్న కర్మాగారాలలో తరచూ ప్రమాదాలకు గురియైనప్పటికీ, యాజమాన్యం కాని, ప్రభుత్వం కాని పట్టించుకోరు.

దానితో ఎక్కడ నుండో వచ్చిన కార్మికులు ప్రమాదాలకు గురై నానా ఇబ్బందులు పడతారు. ఈ నేపథ్యంలో ఉత్పత్తి దారులు తగిన జాగ్రత్తలు తీసుకొని భద్రత చర్యలు తీసుకొన్నట్లయితే, ఎన్నో ప్రమాదాల నుండి కార్మికులను, అదేవిధంగా ఈ మందుల కర్మాగారాలనుండి వచ్చే యాసిడ్‌ల నుంచి దూరంగా ఉండటం వలన మనుషుల ప్రాణనష్టాన్ని కాపాడుకొనవచ్చును.



అంతే గాక ఫ్యాక్టరీల నుండి విడుదలవుతున్న కాలుష్య గాలుల వలన ఆ ప్రాంతమంతా ప్రభావితం అవుతుంది. కనుక యాజమాన్యం, ప్రభుత్వం కలిసి పని చేయడం వలన ప్రజా వాసాలలో కాలుష్యం లేకుండా చూసుకొనవచ్చును. నేడు దేశంలో కాలుష్య నివారణకు పలు చట్టాలు అమలు జరుగుతున్నాయి. అయినా, ఇంకా కాలుష్యం మనుషులను వెంటాడుతూ ఉంది.

ఈ నేపథ్యాన్ని గమనించి పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలి. అందుకే నివాసాలలో కాలుష్యాన్ని, అదీ గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యాలను గమనించి మెలగాలి. తద్వారా అటు సంఘం, వ్యక్తులు కూడ లబ్ధిపొందే అవకాశం ఉంది. ముఖ్యంగా పెట్రో, జింక్ కాలుష్యం గురించి చెప్పలేము. దానివలన శ్వాస కోశ వ్యాధులు రావచ్చు.

అందుకే కాలుష్యానికి కారణాలైన వ్యర్థాలను కూడా త్వరగా తొలగించని ఎడల, ప్రజలు ఎనలేని బాధలు పడతారు. ముఖ్యంగా ఆసుపత్రులలో, డిస్పెన్సరీలలో వ్యర్థ పదార్థాలను తగిన ప్రాంతాలలో వేసిన ఎడలనష్టం వాటిల్ల కుండా ఉంటుంది. వ్యర్థపదార్థాలు సృష్టించే కాలుష్యం బారి నుండి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందు లను తొలగించాలి. అందుకు నగరాలలో, పట్టణాలలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుని, మందుల వ్యర్థాల నుండి ప్రజలను కాపాడగలగాలి. అప్పుడే ప్రజలు కాలుష్యం నుండి బయట పడగలరు.

**- ఆర్. సూర్యారావు, సోషల్ ఏక్టివిస్ట్, ఏలూరు**





# పంటలలో అధికోత్పత్తికి విత్తనాలే ఆధారం

**వివిధ వ్యవసాయపు పంటలలో అధిక ఉత్పత్తి సాధించాలంటే అనేక అంశాలను పాటించాల్సి ఉంటుంది. ఇందులో ఎక్కువ దిగుబడిని ఇచ్చే రకాలను ఎంపిక చేసుకోవటమనే అంశం చాలా ముఖ్యమైనది. వ్యవసాయంలో విత్తనం, దాని నాణ్యత ప్రధాన భూమిక పోషిస్తాయి.**

మన రాష్ట్రంలో వరి, వేరుశెనగ, పప్పు దినుసులు, జొన్న, మొక్క జొన్న మొదలైన వాటిని ప్రధానంగా పండిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనా క్షేత్రాల ద్వారా విడుదలైన అనేక రకాలను, అధిక దిగుబడి ఇచ్చే రకాలను మన రైతులు సాగు చేస్తున్నారు.

విత్తనాల నాణ్యత పైనే పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. గత 20, 25 సంవత్సరాలుగా కొన్ని పాత రకాల విత్తనాలను ఇప్పటికే రైతులు వాటికి ప్రాధాన్యతనిచ్చి సాగు చేస్తున్నారు.

ధృవీకరించబడిన విత్తనాలను మూడు పంటల వరకూ సాగు చేయవచ్చు. ఆ తరువాత రోగ నిరోధక శక్తి, జన్యు ఉత్పాదక శక్తి తగ్గటంతో రైతులు తగిన దిగుబడి పొందలేరు.

వ్యవసాయ పరిశోధనా క్షేత్రాలలో ఎందరో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా అధిక దిగుబడిని ఇచ్చే నూతన వంగడాలు అనేకం రైతులకు అందుబాటులోకి రావటం జరిగింది.

ప్రస్తుతం ఉన్న జనాభాకు సరిపోయే విధంగా ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేయాలంటే, అధిక దిగుబడిని ఇచ్చే నూతన వంగడాలను రైతులు తప్పని సరిగా సాగుచేయవలసి ఉంటుంది. తదనుగుణంగా విత్తన సరఫరా ప్రణాళికను వ్యవసాయ శాఖ రూపొందిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ రంగ విత్తన ఉత్పత్తి సంస్థల వ్యవసాయ శాస్త్రవేత్తలతో తరచూ సమావేశాలు నిర్వహించవలసి ఉంటుంది. సమావేశంలో చర్చించిన అంశాలను బట్టి, రాబోయే ఖరీఫ్ 2012 కాలం నుంచి రైతులకు సరఫరా చేసే వివిధరకాల పంటల విత్తనాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ ఎంపిక చేసింది.

ఈ విత్తనాలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తుంది. ఇందులో కొన్ని పాత రకాల విత్తనాలను కూడా ఉంచడం జరిగింది. అదే విధంగా నూతన వంగడాలను ప్రోత్సహించే విధంగా విత్తన ప్రణాళికను రూపొందించటం జరిగింది. మరీ పాత రకాలైన విత్తనాలకు ప్రభుత్వ సబ్సిడీ అందదు.

కొత్త వంగడాలను వాటి ఉత్పత్తి, లభ్యతల ఆధారంగా మినీకిట్స్ రూపంలో కానీ, రాయితీ రూపంలో కానీ రైతులకు సరఫరా చేయటం జరుగుతుంది. ఈ విత్తనాల ఉత్పత్తిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (APSSDC), జాతీయ విత్తన సంస్థ (NSC), భారత విత్తన క్షేత్ర సంస్థ (SFCI), వ్యవసాయ పరిశోధనా క్షేత్రాలు చేపడతాయి.

ఈ విషయాలపై రైతులలో, మండల వ్యవసాయ అధికారులలో పూర్తి అవగాహన కల్గించడానికి వ్యవసాయ శాఖ తన పరిధిలోని జిల్లా సంయుక్త సంచాలకులకు తగిన సూచనలు కూడా ఇచ్చింది. ధరలు విత్తనాల వివరాలు వ్యవసాయ శాఖ నుండి పొందవచ్చు.

**టి. నర్మద**



# ప్రతి గ్రామానికి ఒక చెరువు కావాలి

'చరాచర జగద్రక్షాయత్త టాకాంబునా
భువిసత్య పుణ్యఫలం వక్తుం అశక్య : కమలా సన:'

**భూమిలోని చెరువు నీరు చరాచర జగత్తును రక్షిస్తున్నది. దీని (చెరువు) నిర్మాణ పుణ్యాన్ని చతుర్ముఖుడైన బ్రహ్మ కూడా వర్ణించజాలడు.**

**క్రీ.శ. 1269లో భాస్కర భవదూరుడు (బుక్కరాయల కొడుకు) కడప జిల్లా పోరు మామిళ్లలో చెరువును నిర్మించినపుడు వేయించిన శాసనంలోనిది పై శ్లోకం. ఈ శాసనాన్ని రచించినవాడు శ్రీమాన్ లింగమాచార్యుడు.**

రాజస్థాన్‌లోని ఎడారిలో ఇంకిపోయిన సరస్వతీ నదిపై ప్రాచ్య పరిశోధనలో భాగంగా ఆళ్వార్ జిల్లాలో సాగునీటి వ్యవస్థ రూప కల్పనలో అహరహం రేయింబళ్లు శ్రమిస్తున్న, 'తరుణ భారత్' సంస్థకు చెందిన రాజేంద్రసింగ్ ఎడారి భూములను చెరువులతో సస్యశ్యామలం కావించి, రామన మెగసేసే అవార్డు అందుకొన్నాడు.

వాన నీటికి అక్కడ కూడ అడ్డు కట్టలు వేసి, ఆ నీటిని పొలాల సాగుకు మళ్లించిన ఘనుడాయన.

సరస్వతీ నదిని గురించిన ప్రస్తావన అతి ప్రాచీనమైన ఋగ్వేదంలో కనిపిస్తుంది. గంగానది కంటే ఎక్కువగా సరస్వతీ నది ప్రస్తావన వుంది. ఋగ్వేదంలోని 80 రుక్‌లలో సరస్వతీ నది స్తుతివుంది. వీటిలో ఇంద్రుడు కూడా పలు రుక్‌లలో కనిపిస్తాడు. ఇంద్రుడు దేవతల్లో మొదటి వాడు. అందువల్ల నీటికి ప్రధాన దేవుడై నీరు అడ్డూ లేకుండా పారేటట్లు చేశాడు. అమర పథగామి అయిన గంగను నేలకు దిగేటట్లు చేసిన భగీరథుడు ప్రజల ప్రశంసలందుకొన్నాడు.

ఆర్యులు జీవనోపాధికి వ్యవసాయం చేపట్టారు. సాగునీటి కొరత తీరింది. బీడు భూములు సస్యశ్యామలమైనాయి. కాలక్రమంలో సాగునీటి వ్యవస్థ కోసం కాలువలు, చెరువుల నిర్మాణం ప్రారంభమైంది. అదండీ చెరువుల నేపథ్యం.

కాలక్రమంలో చెరువులు, పుష్కరుణులు, కుంటలు, సరోవరాలు ఏర్పడినాయి. పొలాలకు కాలువల ద్వారా నీరు మళ్లించారు. హలాలతో పొలాలు దున్ని ధాన్యరాశులు పెంచి సమాజంలో గౌరవ స్థానం సంపాదించారు.

## జల సంరక్షణ

### సప్త సంతానాలు

ఆంధ్రప్రదేశ్‌లోని ద్రాక్షా రామభీమేశ్వరాలయంలోని క్రీ.శ. 1163 భాద్రపద శుద్ధ త్రయోదశి నాటి శాసనంలో సప్త సంతానం గురించి చెప్పబడింది. వేంగి చాళుక్య మహా మండలేశ్వర దొరప నాయకుని ప్రధాని సోమన ప్రెగడ కుమారుడు దత్తన ప్రెగడ వేయించిన తెలుగు శాసనమిది.

**సప్త సంతానాలు : 1) పుత్ర సంతానం, 2) నిధి సేకరణ 3) ధర్మ వివాహం 4) దేవాలయ నిర్మాణం 5) ఉద్యాన వన నిర్మాణం 6) పుస్తక దానం 7) చెరువు నిర్మాణం.**

వీటినే బద్వేలు తాలూకా పోరుమామిళ్ల చెరువు గట్టున వున్న శాసనం పేర్కొన్నది.

తెలుగు కవి నన్నెచోడుడు తాను రచించిన కుమార సంభవంలో కూడా అగ్రహారం, పుత్రుడు ఆలయం, ఉద్యాన వనం, తటాకం (చెరువు), మంచి పుస్తకం సప్తసంతానాలన్నాడు. తాళ్లపాక వంశీయులు కూడా సప్తసంతానాలుగా పై వాటిని పేర్కొన్నారు.

కంచి సమీపంలోని ఉత్తర మేరూరు శాసనంలో గ్రామ సభల ఏర్పాటు వివరించపబడింది. ఈ సభలో కొన్ని శాఖలు ఏర్పరచి, ఆయా శాఖల వారు నిర్వహించవలసిన పనులను సూచించారు. ఒక శాఖకు ప్రధానంగా పాత చెరువుల మరమ్మతు, చెరువు క్రింది ఆయకట్టులను పర్యవేక్షించే బాధ్యతలుండేవి.

తిరుపతి, తిరుమల ఆలయంలో వేయికి పైగా శాసనాలున్నవి. చెరువుల ఆయకట్టు ప్రాంతాలలోని ఆదాయం రైతులకే కాక, అందులో కొంత భాగం, స్వామి సేవకు చెల్లించే కట్టడి ఏర్పాటు చేశారు.

తిరుమల ఆలయ ముఖ ద్వార గోపుర శాసనం (క్రీ.శ. 639 - ఉలగప్పన్ అనే భక్తుడు, గ్రామాల్లోని చెరువుల క్రింద పంటలు పండించే రైతులు సమర్పించిన నిధులలో 800 బంగారు కాసులను స్వామి సేవకు సమర్పించారు. పంటలోని ఒక భాగాన్ని రాజుకు సమర్పించినట్లే, కొంత పైకాన్ని ఆలయానికి సమర్పించేవారు.

## చెరువుల నిర్మాణం

శ్రీకృష్ణ దేవరాయల గురువైన వ్యాసరాయలు, చెరువుల నిర్మాణం పట్ల ఎక్కువ ఆసక్తి చూపారు.

వారు యతీశ్వరులుగా సంచారం చేస్తూ తమ ఇష్ట దైవమైన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ చేస్తూ ప్రజలలో దైవ భక్తిని ప్రచారం చేసేవారు. సామాన్య ప్రజల శ్రేయస్సు కోసం తిరుపతి నుండి హంపి దారిలోని గ్రామాలలో చెరువులను నిర్మింప చేసేవారు. వారి శిష్యులైన రాజులను కూడా ప్రతి గ్రామంలో చెరువులు నిర్మించునట్లు సూచించేవారు.

నెల్లూరు జిల్లా చరిత్రలో కానవచ్చే విషయం ఆసక్తికరం. శ్రీనాథ మహాకవి రచించిన హరివంశం కావ్యాన్ని అంకితంగా అందుకొన్న అవచితిప్పయ సెట్టి కుమారుడు, మల్లు సెట్టి కొడువేమసెట్టి కొన్ని శతాబ్దాల క్రితం కట్టించిన బావి చరిత్ర కెక్కింది. ప్రముఖ తెలుగు కవి ముదివర్తి కొండమాచార్యులు 'పూర్ణాహుతి' అనే వంద పద్యాల కావ్యంలో, వేమశెట్టి నిర్మించిన బావిని గురించి రాశాడు.

వేమ శెట్టి పెద్దవాడై, వేమాంబను పెళ్లాడాడు. నెల్లూరు జిల్లాలో తీవ్రమైన క్షామం తలెత్తింది. పల్లె ప్రజలకు, పశువులకు నీటి కొరత ఏర్పడటంతో గ్రామాలు వదలి వెళ్లారు. కొందరు పశుపాలకులు వేమ శెట్టి వద్దకు వెళ్లి ఒక పెద్ద బావిని నిర్మించమని విన్నవించుకొన్నారు. వేమశెట్టి తన ఏనుగుపై నీటి ఊటను వెదుకుతూ, కొన్ని చోట్ల బావులు త్రవ్వింపసాగాడు - కాని చాల గ్రామాల్లో నీరు కానరాలేదు. ఒకచోట గట్టి ప్రయత్నాలు చేశారు. కూలీలు త్రవ్విన చోటల్లా బండరాయి తప్ప నీటి జాడ లేకపోయింది.

కొన్ని చోట్ల 30,40 అడుగులు త్రవ్వినా నీటి జాడ లేకపోవటం గురించి వేమ శెట్టికి కూలీలు తమ ప్రయత్నం గురించి తెల్పారు.

వేమశెట్టి దేవుని ధ్యానించి ఒకచోట త్రవ్వకం ప్రారంభించమన్నాడు. కూలీలు త్రవ్వకాలు ప్రారంభించారు. తెల్లవారే లోపుగా బావిలో నీరు లేకపోయినందున బండరాయికి తన తలను కొట్టుకొని, కైలాసం వెళ్లి తన ప్రజల బాధను శివునికి విన్నవించుకొన్నాడు. తన చేతి గడారుతో నెత్తిని కొట్టుకొన్నాడు.

వేమశెట్టి ఆ ప్రయత్నంలో మరణించాడు. బావిలో నుండి నీరు ఉబుకుతూ పరిసరాలన్నీ జలమయమైన్నాయి. వేమశెట్టి భార్య భర్త మరణం విని బావి వద్దకు వచ్చి తాను కూడా భర్త శరీరం ప్రక్కనే పడి పరలోకం చేరింది.

సుఖంగా ప్రజల మన్ననలందుకొన్న వేమశెట్టి, వేమాంబ దంపతులు ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారు. ఈ కథను ముదివర్తి కొండమాచార్యులు కావ్యంగా రాశారు.

అనంతపురం జిల్లాలోని కథను, కట్టమంచి రామలింగా రెడ్డి గారు - 'ముసలమ్మ మరణము' అన్న కావ్యంగా రాశారు. ఇది వాస్తవమైన కథ. అనంతపురం సమీపంలో బుక్కరాయ సముద్రం వద్ద ప్రజలు చెరువును కట్టించారు. కాని చెరువు కట్ట పూర్తి చేసిన తర్వాత మరల పడిపోయింది. గ్రామ రెడ్డి కోడలు ముసలమ్మ (ఆమె పేరే అది) చెరువు కట్టకు అడ్డంగా పడి తన ప్రాణాలను సమర్పించింది. చెరువు నేటికీ భద్రంగా వుంది. ప్రజల మేలు కోసం చెరువులు, బావులు కట్టించిన పుణ్యాత్ములు వారు.

ఒకనాడు ప్రతి గ్రామానికి ఒక చెరువు వుండేది. ప్రజలు వంతుల వారీగా వాటి భద్రత చూసుకొనేవారు.

## నీరు - బోరు


50, 60 ఏళ్ల క్రితం, బోరు బావులుండేవి కావు. అసలు బావుల నిర్మాణమే కళాత్మకంగా వుండేది. బోరు బావుల నిర్మాణంతో ప్రజల మధ్య ఈర్ష్య పెరిగింది. ప్రక్కనే వున్న భూకామందు 200,300 అడుగుల దాకా బోరు వేయించి తక్కిన పొలాలకు భూగర్భ జలాలు అందకుండా చేసేవారు. గ్రామాల్లో కక్షలకు దారితీశాయి. భారత దేశం గ్రామాల్లో నివసిస్తున్నదనే వారు మహాత్మా గాంధీజీ....

దేవాలయాలు, చెరువుల నిర్మాణాన్ని ధార్మిక సామాజిక కార్యంగా భావించేవారు. చెరువుల్లోని పూడిక తీయటం గ్రామ ప్రజల బాధ్యతగా వుండేది. పూడిక తీసేందుకు గ్రామ ప్రజలు సమైక్యంగా పూనుకొని, చెరువులోని నీటిని కాలువల ద్వారా పొలాలకు మళ్లించుకొని పంటలు పండించేవారు. ఆనాటి సమష్టి తత్వం నేడు అంతగా కన్పించదు.

రాయలసీమలో అపార జల వనరులు లేవు - పెద్ద ప్రాజెక్టులు లేవు. ఈ ప్రాంతంలోని చెరువులు కూడా మాయమై గృహ సముదాయాలుగా మారుతున్న విషయం నిష్ఠుర సత్యం.

కడప పట్టణం నేడు నగరంగా మారింది. జనాభా పెరగటంతో గృహ నిర్మాణాలు పెరిగాయి. సాగు నీరే కాదు తాగు నీరు కూడా కొరవడింది. ఈ విషయాన్ని ప్రజలు, ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరమెంతగానో వుంది.

*- డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి*



# 20 సూత్రాల కార్యక్రమం అమలులో హాట్రిక్ సాధించిన ఆంధ్రప్రదేశ్



20 సూత్రాల కార్యక్రమం అమలులో మన రాష్ట్రం వరుసగా 3వ సంవత్సరం కూడా జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించింది. ప్రభుత్వ పనితీరుకుఇది ముఖ్య సూచిక 1992-93 సంవత్సరంలో మనరాష్ట్రం మొదటి స్థానం సాధించగా 18 సంవత్సరాల తర్వాత 2010-11, 2011-12 సంవత్సరాలలో వరుసగా జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించింది. గత ఆర్థిక సంవత్సరంలో 2012-13 లో కూడా అన్ని సూచికలలో నిర్దేశించిన లక్ష్యంలో 90% మించి సాధించడం జరిగిందని 20 సూత్రాల కార్యక్రమం అమలులో హాట్రిక్ సాధించినదని ఆ కార్యక్రమ అమలు కమిటీ ఛైర్మన్ డా॥ ఎన్. తులసిరెడ్డి తెలిపారు.

| క్ర.సం. | సూచిక | లక్ష్యం | సాధన | శాతము |
|---|---|---|---|---|
| 1 | జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో లబ్ధి పొందిన లబ్ధిదారులు | 5,283 | 34,570 | 65.43 |
| 2 | స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం | 1,16,023 | 3,88,321 | 33.46 |
| 3 | ఇందిరా ఆవాస్ యోజన క్రింద గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ళ నిర్మాణం | 2,70,399 | 2,43,990 | 90.23 |
| 4 | ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు / అల్పాదాయ వర్గాలకు పట్టణ ప్రాంతాలలో ఇళ్ళ నిర్మాణం | 12,500 | 59,214 | 47.37 |
| 5 | జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకం క్రింద ఇంకనూ త్రాగునీటి వసతిలేని గ్రామాలకు నిర్దేశించిన త్రాగునీటి పథకాలు | 5,096 | 5,520 | 108.3 |
| 6 | రక్షిత త్రాగునీటి పథకాలు (క్వాలిటి అఫెక్టెడ్ హ్యాబిటేషన్స్) | 170 | 1,789 | 105.2 |
| 7 | షెడ్యూల్డ్ కులాలలో విద్య, ఉపాధి, స్వయం ఉపాధి రంగాలలో లబ్ధిదారులు | 7,97,644 | 8,56,546 | 107.3 |
| 8 | సమగ్ర స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన బ్లాకులు | 387 | 387 | 100 |
| 9 | సమగ్ర స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన అంగన్‌వాడి కేంద్రాలు | 89,567 | 89,710 | 100 |
| 10 | మున్సిపల్ ప్రాంతాలలో ఉన్న పేదవారికి ఆర్థిక సహాయం అందించే పథకం క్రింద లబ్ధిదారులు | 18,750 | 6,61,459 | 3527.1 |
| 11 | పర్యావరణ పరిరక్షణకు నిర్ధేశించబడిన వైశాల్యం (హెక్టార్లలో) | 385400 | 407252.22 | 105.67 |
| 12 | నాటిన మొక్కలు (లక్షలలో) | 2028 | 3450.09 | 170.12 |
| 13 | ప్రదాన మంత్రి గ్రామ్ సడక్ యోజన క్రింద నిర్మించిన రోడ్లు (కిలో మీటర్లలో) | 400 | 361.43 | 90.36 |
| 14 | గ్రామీణ విద్యుదీకరణ పథకం క్రింద విద్యుత్ అందించిన పంపు సెట్ల సంఖ్య | 50,000 | 1,41,957 | 283.91 |

స్వర్గీయ శ్రీమతి ఇందిరమ్మ కలలు కన్న దారిద్ర్య రహిత భారత్‌ను నిర్మించడంలో ఆంధ్రప్రదేశ్‌ను ముందు వరుసలో నిలబెట్టేందుకు అందరం సమిష్టిగా సమన్వయంతో కృషిచేద్దాం. ■

# పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధానికి చట్టం



**పని చేసే ప్రదేశాలలో మహిళలపై జరుగుతున్న వేధింపులను అంతమొందించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు.**

**లింగ ఆధారంగా స్త్రీల పట్ల జరుగుతున్న వివక్షతను నిర్మూలించటానికి మనదేశం కూడా 1981 సెప్టెంబరు 3 న అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ ఒప్పందంపై సంతకం చేసింది. 1997 సంవత్సరంలో సుప్రీంకోర్టు విశాఖా కేసు తీర్పులో లైంగిక వేధింపులు ఎలా ఉంటాయో, ఆ పరిస్థితులలో తీసుకోవలసిన కఠిన చర్యలు ఏమిటో వివరించింది. ఈ తీర్పునే రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు శాసనంగా భావించి ఆ దిశగా చర్యలు తీసుకొంటూ, పరిష్టమైన చట్టం చేయవలసినదిగా కోరింది. ఈ ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ.ఎమ్.ఎస్.నెం.27 తేది. 21-04-1999 న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఆదేశాలుగా జారీ చేసింది.15 సంవత్సరాల తర్వాత భారత ప్రభుత్వం దీనిపై ఒక చట్టం తీసుకువచ్చింది.**

### పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు (నివారణ-నిషేధ చర్యలు మరియు నష్ట పరిహారం) చట్టం-2013

పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపుల ( నివారణ - నిషేధ చర్యలు మరియు నష్టపరిహారం) బిల్లు - 2012 ని సెప్టెంబరు 2012 లో లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లుని ఫిబ్రవరి 26, 2013 న రాజ్యసభ ఆమోదించింది. 23 ఏప్రిల్ 2013 న చట్టంగా గెజిట్‌లో ప్రచురించారు.

పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు అంటే మహిళల కనీస హక్కులైన జీవించటం, లింగ సమానత్వం, స్వాతంత్ర్యానికి భంగం కల్గించటం మొదలగునవి. దీని వలన మహిళలకి అభద్రతా భావం, ప్రతికూల పని వాతావరణం, పనిలో పాల్గొనాలి అనే ఉత్సాహం తగ్గటం వలన వారి ఆర్థిక స్వావలంబన మరియు అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. దీనిపై చర్య తీసుకోవటానికి భారత శిక్షాస్మృతిలో కొన్ని నిబంధనలు మరియు విశాఖా తీర్పులో సుప్రీం కోర్టు మార్గదర్శకాలు తప్ప మన దేశంలో ఎలాంటి చట్టం లేదు. పనిలో మహిళలు పాల్గొనటం పెరిగిన నేపథ్యంలో పనిచేసే చోట మహిళలపై వేధింపులు జరగకుండా నివారించడానికి, నిషేధించడానికి, నష్టపరిహారానికి ఒక సమగ్ర చట్టం చేయటమైనది.

**చట్టం ముఖ్య లక్షణాలు:**

1. **"పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు"** అనే విషయంపై విశాఖా తీర్పును దృష్టిలో ఉంచుకొని ఇంకా సమగ్రంగా వివరణాత్మకంగా నిర్వచించటమైనది. పనిచేసే ప్రదేశాలలో భయానక పరిస్థితులను కల్పించేటట్లు చేయటం, పని చేయడానికి అనువైన వాతావరణం లేకుండా చేయడం లేదా అవమానించడం వంటి పరిస్థితుల ప్రభావంతో ఆమె ఆరోగ్యం లేక భద్రతకు ఆటంకం కల్పించే అన్ని చర్యలను ఈ చట్టంలో చేర్చి చక్కని పని వాతావరణం కల్పించేందుకు వీలుగా స్పష్టమైన హామీ ఇవ్వడం దీని ముఖ్య లక్ష్యం.

2. **"బాధిత మహిళ"** అంటే నిర్వచనం ఉద్యోగిని అయినా కాకపోయినా పనిప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైన స్త్రీ మరియు ఇంటిలో పనిచేసే స్త్రీ కూడా దీని పరిధిలోకి వస్తుంది.

3. **"పనిచేసే ప్రదేశం"** అనే దానిని విశాఖా కేసు మార్గదర్శక సూత్రాలలో లాగా సాంప్రదాయకంగా ఏర్పాటు అయిన ఆఫీసు, అక్కడ ఉద్యోగం కల్పించినవారికి, ఉద్యోగితో సంబంధ బాంధవ్యాలు మాత్రమే కాకుండా ఈ చట్టంలో ఇంకా ముందు చూపుతో సంస్థలు, డిపార్ట్‌మెంట్లు, ఆఫీసులు, వాటి బ్రాంచి విభాగాలు మొదలైన వాటికి

వర్తింప చేసారు. ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర రంగాలు, సంఘటిత/ అసంఘటిత రంగాలు, హాస్పిటళ్ళు, నర్సింగ్‌హోమ్‌లు, విద్యాసంస్థలు, ఆటల సంస్థలు, స్టేడియంలు, ఆటలు ఆడే మైదాన సముదాయాలు, ఉద్యోగరీత్యా సందర్శించే ప్రదేశాలు, ప్రయాణంచేసే సమయంలో, ఉండే స్థలం మొదలైన వాటిని పనిచేసే ప్రదేశంగా గుర్తించటం జరిగింది.

**4.** (a) **"ఉద్యోగిని"** అంటే నిర్వచనం శాశ్వత/ తాత్కాలిక /అడ్‌హాక్/ రోజువారీ వేతనం పొందేవారు, వేతనంతో కాని లేక వేతనం లేకుండా స్వచ్ఛందంగా కూడా పనిచేసే వారు. (b) "ఉద్యోగం/ పని కల్పించేవారు" (ఎంప్లాయర్) అంటే నిర్వచనం ప్రభుత్వ/ప్రభుత్వేతర సంస్థలు/ ఆఫీసు/ బ్రాంచిలు/ విభాగాల అధిపతులు, మరియు వీటి నిర్వహణ/ పర్యవేక్షణ/ అజమాయిషీ చేసేవారు, కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించేవారు, స్థానిక పనుల కోసం కార్మికులను కుదిర్చేవారు స్త్రీ/పురుషులు అయినా ఆ పని వలన లాభపడేవారు.

**5.** నష్టపరిహారం కల్పించడానికి ఈ చట్టంలో **"అంతర్గత ఫిర్యాదుల కమిటి"** మరియు "స్థానిక ఫిర్యాదుల కమిటీ" ఏర్పాటు చేశారు. 10 మంది అంతకన్నా ఎక్కువ ఉద్యోగులు ఉన్న అన్ని పని ప్రదేశాలలో తప్పని సరిగా "అంతర్గత ఫిర్యాదుల కమిటీ" ని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీని నలుగురు (4) సభ్యులతో, వారిలో ఒక అనుభవజ్ఞులైన మహిళా ఉద్యోగి ఆధ్వర్యంలో నడిపించాలి. మిగిలిన ఇద్దరు (2) సభ్యులను ఉద్యోగుల నుండి మహిళల ఇబ్బందులు తెలిసిన దృక్పథం కల్గిన/ సాంఘిక సేవా భావం/ న్యాయ శాస్త్ర అనుభవం ఉన్న వారి నుండి, ఇంకొకరిని స్వచ్ఛంద సేవా సంస్థ (యన్.జి.ఓ) నుండి అంటే, బయటనుండి తీసుకోవాలి.

**6.** ఎక్కడైనా 10 మంది కన్నా తక్కువ ఉద్యోగులు/ కార్మికులు పనిచేసేటప్పుడు వారి ఫిర్యాదుని స్థానికంగా ఏర్పాటు చేసిన **"ఫిర్యాదుల కమిటీ"** కి ఇవ్వాలి. ఈ చట్టం క్రింద ప్రకటించిన జిల్లా అధికారి జిల్లా స్థాయిలో ఈ స్థానిక కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ గృహ అవసరాల కొరకు పనిచేసే కార్మికుల ఫిర్యాదులపై కూడా చర్య తీసుకోవాలి.

**7.** **"స్థానిక ఫిర్యాదుల కమిటీ"** ని ఐదు (5) మందితో ఏర్పాటు చేయాలి. వారి నుండి ఒకరిని చైర్‌పర్సన్‌గా నామినేట్ చేయాలి. ఆమె గుర్తింపు పొందిన సంఘసేవకురాలు కాని లేదా మహిళల సమస్యలు తీర్చటంలో నిబద్ధత కలిగిన వారైనా అయి ఉండాలి. ఒక(1) సభ్యురాలు ఆ జిల్లాలో ఏదైనా తాలూకా/బ్లాక్/మండలం/ మున్సిపాలిటీలో ఉద్యోగం చేస్తున్న మహిళ అయి ఉండాలి. ఆ జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల నుండి ఇద్దరు (2) సభ్యులను నామినేట్ చేయాలి. వారిలో ఒక్కరైనా మహిళ అయి ఉండాలి. వారిలో ఒకరు మహిళల ఇబ్బందులు అర్థంచేసుకొనే దృక్పథం కలిగినవారైనా/ పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల సమస్యలపై సుపరిచితులైనా అయి ఉండాలి. మరొకరు న్యాయవాది లేదా న్యాయశాస్త్ర అనుభవం కలిగిన వారై ఉండాలి. సంబంధిత మహిళా శిశు అభివృద్ధి అధికారి లేక సాంఘిక సంక్షేమ అధికారి ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా వ్యవహరిస్తారు.

**8.** పని చేసే చోట లైంగిక వేధింపులు జరిగిన 3 నెలల లోపు ఫిర్యాదు చేయాలి. ఒకవేళ ఏదైనా భయానక పరిస్థితులలో ఆమె 3 నెలలలో చేయలేకపోయినట్లయితే, మరో 3 నెలల కాలంలో చేయడానికి అవకాశం ఉంది.

**9.** ఈ చట్టం రాజీ చేసుకోవటానికి కూడా వీలు కల్పించింది. అంతర్గత ఫిర్యాదుల కమిటీ/ స్థానిక ఫిర్యాదుల కమిటీలు బాధిత మహిళ మరియు ప్రతివాది మధ్య సయోధ్య కుదుర్చుకోవటానికి తగిన చర్యలు తీసుకోవచ్చు. ఈ సయోధ్య బాధిత మహిళ యొక్క ఐచ్ఛికం మరియు విన్నపం మేరకే చేయాలి. ఏవిధమైన ఆర్థిక లావాదేవీలతో రాజీ కుదుర్చుకున్నా ఈ చట్టం ప్రకారం రాజీ కుదరదు. తరువాత ఏదైనా పరిస్థితులలో ప్రతివాది దానికి కట్టుబడి ఉండకపోయినచో, ఫిర్యాదుదారులు మరల కమిటీ దగ్గరకు వెళ్ళి ఫిర్యాదుపై దర్యాప్తు కొనసాగించమని అడగవచ్చు.

**10.** కమిటీ ఫిర్యాదుపై దర్యాప్తు 90 రోజులలో పూర్తిచేయాలి. విచారణ పూర్తి అయిన తరువాత విచారణ నివేదికను పని కల్పించిన వారికి లేక జిల్లా అధికారికి పంపవలెను. కేసు ఏదైనప్పటికీ, విచారణ నివేదికపై 60 రోజులలోపు చర్య తీసుకోవాలి.

**11.** ఫిర్యాదు నిరూపణ జరిగిన సందర్భంలో, కమిటీ సర్వీసు నిబంధనలకి లోబడి ప్రతివాదిపై చర్య తీసుకోమని, సర్వీస్ నిబంధనలు లేకపోతే ఏ నిబంధనలను తయారుచేసుకుంటారో వాటికి లోబడి తగిన చర్య తీసుకోమని సిఫారసు చేయాలి. ప్రతివాది జీతం నుండి కొంత లేక ప్రతివాదినే కొంత చెల్లించమని కమిటీ సిఫార్స్ చేయవచ్చును. ప్రతివాది చెల్లించటంలో విఫలమైనట్లయితే, దానిని భూ రెవెన్యూ ఏరియర్స్ నుండి జిల్లా అధికారిని చెల్లించమని అడగవచ్చును.

**12.** ఏదైనా ఫిర్యాదు నిరూపణ కాని పక్షంలో కమిటీ పని కల్పించిన వారికి/ జిల్లా అధికారికి ఏ చర్య తీసుకోవలసిన అవసరం లేదు అని వ్రాయవలెను.

**13.** ఈ చట్టం ప్రకారం ఏదైనా ద్వేషపూరిత లేక తప్పుడు ఫిర్యాదు చేసినచో సర్వీస్ నిబంధనల ప్రకారం జరిమానా విధించబడును. అయితే ద్వేషపూరితమైన ఆలోచనతో చేసిన ఫిర్యాదు అని విచారణలో నిర్ధారించుకొంటే రక్షణ కల్పించడానికి ఈ నిబంధన చేయటమైనది. కేవలం నిస్సహాయతతో ఫిర్యాదు నిరూపించుకోలేకపోతే ఈ నిబంధన లోని జరిమానా వర్తించదు.

**14.** ఈ చట్టంలో బాధితమహిళకు విచారణ మధ్యలో ఉపశమనాలు కల్పించబడినవి. దానిలో సెలవు, ట్రాన్స్‌ఫర్ వంటివి ఉన్నాయి.

**15.** బాధిత మహిళ, ప్రతివాది, సాక్షుల గుర్తింపు, అడ్రస్సులని బయట పెట్టడాన్ని ఈ చట్టం నిషేధించింది. అయితే ఈ చట్టంలో లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళకు న్యాయం, రక్షణ దొరికినట్లయితే వారి గుర్తింపుని తెలియపరచవచ్చును.

**16.** ఈ చట్టం ప్రకారం ఉద్యోగం/ పని కల్పించే ప్రతి చోట లైంగిక వేధింపులు లేని వాతావరణం కల్పించాలి. ఉద్యోగం/ పని కల్పించే వారు (employer) వారి ఉద్యోగులు/ కార్మికులందరికీ ఈ చట్టంలోని విషయాల గురించి మంచి అవగాహన కల్పించడానికి సదస్సులు, మీటింగులు ఏర్పాటు చేయాలి. అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసి వారి వివరాలను మరియు లైంగిక వేధింపుల వలన తీసుకొనే కఠినమైన చర్యల గురించి నోటీస్ బోర్డులో పెట్టలి.

**17.** ఈ చట్టం ప్రకారం ఉద్యోగం/ పని కల్పించినవారు వారి విధులు నిర్వహించడాన్ని ఉల్లంఘించనచో అట్టివారికి రూ. 50,000/- జరిమానా విధించటం జరుగుతుంది. తరువాత కూడా వారు ఉల్లంఘించినచో ఆ జరిమానా రెండింతలు చేయుటమే కాక వారి రిజిస్ట్రేషన్ తీసివేయటం/ లేక వారి లైసెన్సు రద్దు చేయటం.

**18.** గృహ కార్మికుల విషయంలో వారి పని పద్ధతి వేరుగా ఉంటుంది కాబట్టి, వారికి తగిన విధంగా ఏర్పాటు ఉండాలి. గృహ కార్మికులు వారి ఫిర్యాదులను "స్థానిక ఫిర్యాదుల కమిటీ"కి ఇవ్వాలి. ఒకవేళ ఫిర్యాదుదార్ల ఇష్టప్రకారం రాజీ కావాలి అని కోరితే రాజీ చేయవచ్చు. అయినప్పటికీ, ఇతర కేసులలో ఫిర్యాదులలో ప్రాథమికంగా నేరం నిరూపితమయితే, అప్పుడు స్థానిక కమిటీ అట్టి ఫిర్యాదును పోలీసులకు కేసు రిజిస్టర్ చేయడానికి పంపి భారత శిక్షాస్మృతి (ఐ.పి.సి) ప్రకారం తగిన చర్య తీసుకోమని కోరుకోవాలి.

**19.** ఈ చట్టం అమలు, పర్యవేక్షణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకి కల్పించినది. రాష్ట్రంలో ప్రభుత్వ/ ప్రభుత్వేతర శాఖలు అన్ని వారి వారి ఆఫీసులలో దీనికి సంబంధించి సమాచారం నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వంలో కూడా దీనికి సంబంధించి అన్ని రాష్ట్రాల సమాచారం నిర్వహించాలి. ప్రతి ఎంప్లాయర్ కూడా వారి వారి అంతర్గత ఫిర్యాదుల కమిటీ నివేదికను వారి జిల్లా అధికారికి ఇవ్వవలెను. అన్ని స్థానిక ఫిర్యాదుల కమిటీలు కూడా వారి వార్షిక నివేదికను వారి జిల్లా అధికారికి ఇవ్వవలెను. జిల్లా అధికార్లు వారి వార్షిక జిల్లా నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వవలెను.

**20.** ఈ చట్టంలోని విషయాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రచార సాధనాల ద్వారా విస్తృతంగా ప్రచారమయ్యేటట్లు చూడాలి. (ఐ.ఈ.సి) శిక్షణ మెటీరియల్‌ని తయారు చేసి తగిన శిక్షణ, అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ప్రజలందరికీ అర్థమయ్యేట్లుగా కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి.

**21.** స్థానిక ఫిర్యాదుల కమిటీ సభ్యుల ఫీజు/భృతికై అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూర్చాలి.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు
## (అబ్‌స్ట్రాక్ట్)

**(ప్రజాసేవలు - ఉపాధిలో సమానత్వం - ఉపాధి రంగంలో వివక్షతను అంతం చేసేందుకు తగుచర్యలు - మార్గదర్శక సూత్రాలు మరియు నిబంధనలు - సూచించిన ఆదేశాలు)**

**మహిళాభివృద్ధి శిశు సంక్షేమం మరియు వికలాంగుల సంక్షేమ (ప్రోగ్రాం) శాఖ**

జి.ఓ.ఎమ్.ఎస్.సంఖ్య 27 తేది: 21-04-1999

1. భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి జీవించడం, లింగసమానత్వం, స్వాతంత్రానికి భంగం కలగకుండా ఉండటం వంటి ప్రాథమిక హక్కుల్ని కల్పించింది. లింగసమానత్వంలో భాగంగా వేధింపుల నుండి మహిళలకు రక్షణ, గౌరవప్రదంగా పనిచేసుకునే అవకాశం మానవ హక్కులుగానే ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడినవి. మహిళలపై జరిగే అన్ని రకాల వివక్ష నిర్మూలనకు అంతర్జాతీయ సదస్సులో ఒక ఒప్పందం జరిగినది. ఈ సదస్సులో సత్వరం అమలు పర్చవలసిన కొన్ని సిఫార్సులను చేయడం జరిగింది.
   - ప్రత్యేకించి స్త్రీలపై జరిగే హింస, లైంగిక వేధింపులు మొదలగునవి పని ప్రదేశంలో ఉపాధిలో సమానత్వానికి తీవ్రంగా నష్టం కలిగించే సంధర్భంలో
   - **"లైంగిక వేధింపు"** అంటే మాటలద్వారా, చేతలద్వారా జరిగే అప్రియమైన లైంగిక ప్రవర్తన. ఇది ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని ఉండవచ్చు. శారీరకంగా తాకడం, ఇంకా ముందుకు వెళ్ళడం, లైంగిక అనుగ్రహం గురించి డిమాండ్ లేక కోరిక, లైంగికపరమైన మాటలు, అశ్లీల సాహిత్యాన్ని, శృంగార సంబంధమైన బొమ్మలు, కార్టూన్లు, క్యాలెండర్లు, కంప్యూటర్ల మీద స్క్రీన్ సేవర్‌లు చూపించడం, అసభ్యకర రాతలు మరియు ఇ-మెయిళ్లు.

     పై ప్రవర్తన వల్ల బాధిత మహిళ అక్కడ పనిచేయడం అవమానకరంగా ఉండి, ఆరోగ్య, రక్షణ సమస్యలు కలిగిన సహేతుకమైన భయం ఉన్నప్పుడు, అది ఆమెకి ఉపాధి కల్పించే ప్రక్రియకు గాని, పదోన్నతికి గానీ లేదా పని వాతావరణానికి భంగం కల్గించటానికి వీటిలో ఏది జరిగినా అది **"లైంగిక వేధింపుల నేరం"** అవుతుంది. సమర్ధవంతమైన ఫిర్యాదులు చేసుకొనే విధానాలు, నిరోధించటం, నష్టపరిహారాలు కల్పించటం.
   - మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు వాటితో పాటు పని ప్రదేశంలో వేధింపుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొంటున్న జాగ్రత్తలను వారి వారి నివేదికలో చేర్చవలెను.
2. పై సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి మహిళలకున్న మానవ హక్కుల పరిరక్షణకు అనుకూలంగా ప్రజల తరపున మాట్లాడానికి **"మహిళా కమీషన్"**ను ఏర్పాటుచేసినది.
3. జాతీయ విధానానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఇంకా

దూరదృష్టితో ఆలోచించి లింగ సమానత్వాన్ని ప్రాథమిక హక్కుగా ఒప్పుకుని మహిళల సర్వతోముఖాభివృద్ధికి చాలా జాగరూకతతో ఈ విధాన నిర్ణయం చేసింది.

4. లైంగిక వేధింపుల గురించి సుప్రీంకోర్టు 1997 సంవత్సరంలో ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనది. ఈ తీర్పులో ప్రాథమిక హక్కుల పరిధిని సుప్రీంకోర్టు మరొక్కసారి విస్తృతం చేసింది. ఉద్యోగినుల జీవించే హక్కులో లైంగిక వేధింపులు ఎలా వుంటాయో, ఈ పరిస్థితిని ఎలా మార్చవచ్చో సుప్రీంకోర్టు వివరించింది. ఈ వేధింపులకి గురి చేస్తున్న వ్యక్తులపైన కఠిన చర్యలు ఎలా తీసుకోవాలో కూడా విశాఖ కేసులో (ఏ.ఐఆర్. 1997 సుప్రీంకోర్టు 3011) సుప్రీంకోర్టు వివరించింది.

## సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ మార్గదర్శకాలను కోర్టు తయారు చేసిన శాసనంగా అందరూ పాటించి అమలు చేయాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం వీటిని శాసనంగా అందరూ భావించాల్సి వుంటుంది.

**1. పనిచేసే ప్రదేశం, సంస్థల యజమాని లేక బాధ్యతాయుతమైన వ్యక్తి విధి**

పనిచేసే ప్రదేశం యజమాని గానీ, బాధ్యతాయుతమైన వ్యక్తి గానీ లైంగిక వేధింపులను, హింసను నిరోధించడానికి, అరికట్టడానికి అవసరమైన చర్యల్ని తీసుకోవాల్సి వుంటుంది. దానికి అవసరమైన తీర్మానాలని, ఒప్పందాన్ని లేక ప్రాసిక్యూషన్‌ని చేపట్టాల్సివుంటుంది.

**2.** ఈ మార్గదర్శకాల ప్రకారం **లైంగిక వేధింపులంటే ఏమిటో, లైంగిక వేధింపులు ఏ మహిళలకి వర్తిస్తాయో, లైంగిక వేధింపులు నేరం** జరిగిందని ఎప్పుడు అంటారనే విషయాలని ముందు భాగంలో వివరించటమైనది.

**3. లైంగిక వేధింపులని నిరోధించటానికి పనిచేసే చోట యజమాని గాని, బాధ్యతాయుతమైన వ్యక్తి గాని తీసుకోవలసిన చర్యలు**

సుప్రింకోర్టు మార్గదర్శకాల ప్రకారం లైంగిక వేధింపులు అంటే ఏమిటి? వాటి నిషేధం గురించి అందరికీ తెలిసేటట్లుగా ఈ విషయాన్ని ఆ పనిచేసే ప్రదేశాలలో ప్రకటించాలి, లైంగికవేధింపులని నిషేధిస్తూ, చెడు ప్రవర్తనగా గుర్తించి, క్రమశిక్షణ ఉల్లంఘించిన ఉద్యోగుల పట్ల చర్యలు తీసుకునేటట్లు నిబంధనలని సవరించాలి. ఈ నిబంధనలు ప్రభుత్వ ఉద్యోగులకి, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకి వర్తిస్తాయి. ప్రైవేటు సంస్థలు కూడా ఈ లైంగిక వేధింపుల నిషేధాన్ని ఒక స్టాండింగ్ ఆర్డర్‌గా చేసి క్రమశిక్షణని ఉల్లంఘించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.

## క్రిమినల్ చర్యలు

లైంగిక వేధింపులు చేసిన వ్యక్తుల నడవడిక, చర్యలు, భారతీయ శిక్షాస్మృతి ప్రకారం గానీ, ఏదైన చట్ట ప్రకారం గానీ నేరమైనప్పుడు ఆ పనిచేసే స్థలం యజమాని చట్ట ప్రకారం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

లైంగిక వేధింపులకి గురైన బాధితులు, సాక్షులు ఫిర్యాదు విచారణ సమయంలో కక్ష సాధింపులకి, వివక్షలకి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా పనిచేసే స్థల యజమానులపై ఉంటుంది.

## ఫిర్యాదుల విభాగం

బాధితురాలికి ఊరట కలిగిస్తూ అవసరమైన ఫిర్యాదు విభాగాన్ని ఆ పనిచేసే స్థల యజమాని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఎవరి నడవడిక గురించైనా బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు, ఆ నడవడిక ఏదైనా చట్ట ప్రకారం నేరమైనప్పటికీ, కాకపోయినప్పటికీ సర్వీస్ నిబంధన ఉల్లంఘన అయినప్పటికీ, కాక పోయినప్పటికీ ఆ ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి. అంతేకాదు ఆ ఫిర్యాదులని నిర్ణీత సమయంలో పరిష్కరించేట్టుగా కూడా నిబంధనల్ని చేయాలి.

## ఫిర్యాదుల కమిటీ

లైంగిక వేధింపుల ఫిర్యాదులు స్వీకరించడానికి ఓ ఫిర్యాదుల కమిటీ ఉండాలి. ఈ కమిటీకి మహిళలే నేతృత్వం వహించాలి. కమిటీల్లోని సభ్యుల్లో సగం మంది మహిళలే ఉండాలి. ఈ కమిటీకి సహకరించడానికి అవసరమైన సపోర్టింగ్ స్టాఫ్ కూడా ఏర్పాటు చేయాలి. బాధితులకి సలహాలు, మార్గదర్శకత్వం వహించడానికి ప్రత్యేకమైన కౌన్సిలర్ కూడా ఉండాలి. ఫిర్యాదులని రహస్యంగా వుంచాలి. పైస్థాయి నుంచి అనవసరమైన ఏదైనా ఒత్తిడి గానీ ప్రభావాన్ని గానీ నిరోధించడానికి ఫిర్యాదుల కమిటీ థర్డ్‌పార్టీగా స్వచ్ఛంధ సంస్థల వారిని తీసుకోవాలి. ఆ థర్డ్ పార్టీలు ప్రభుత్వేతర సంస్థలు కావొచ్చు లేక లైంగిక వేధింపుల గురించి అవగాహన వున్న ఏదైనా సంస్థ కావొచ్చు. ఈ ఫిర్యాదుల కమిటీ తమ వార్షిక నివేదికను ప్రభుత్వానికి పంపించాలి. ఫిర్యాదుల మీద కమిటీ తీసుకున్న చర్యల్ని నివేదికలో తెలియచేయాలి.

## మూడో వ్యక్తి వేధింపులు

మూడో వ్యక్తి వల్లగాని, ఇతరుల వల్లగానీ లైంగిక వేధింపులు ఉద్యోగినులకి కలిగినప్పుడు, ఆ పనిచేసే స్థల యజమానిగానీ, బాధ్యతాయుత వ్యక్తిగానీ ఉద్యోగినికి అవసరమైన సహాయానికి అన్ని యత్నాలు చేయాలి.

ఆ వేధింపులని తిరస్కరించటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు రంగ సంస్థలు కూడా ఈ మార్గదర్శక సూత్రాలను పాటించడానికి అవసరమైన చర్యల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆయా ప్రభుత్వాలని కోరింది.మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993లో ఉన్న హక్కులకి ఈ మార్గదర్శక సూత్రాలు అదనం. అంతేకానీ హక్కులని అవి తీసివేయవు.

**ఆర్. శివపార్వతి,**

**డిప్యూటి డైరెక్టర్ (అకౌంట్స్) మరియు సెంటర్ హెడ్, సి.డబ్ల్యు.సి.డి., అపార్డ్**



# రాష్ట్రంలో ఎస్.సి, ఎస్.టి. ఉపప్రణాళికలకు 2012-13 సంవత్సరంలో నిధుల కేటాయింపులు, వినియోగం

## I షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ఉప ప్రణాళికలు

కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సమగ్ర అభివృద్ధి కోసం 1974లో షెడ్యూల్డు తెగల ఉపప్రణాళికను, 1979లో షెడ్యూల్డు కులాలకు ఉప ప్రణాళికలను తీసుకువచ్చింది. రాష్ట్రాలు తమ బడ్జెట్‌లలో జనాభా దామాషా ప్రకారం ఈ వర్గాలకు నిధులను కేటాయించటం, వనరుల సమీకరణ, సమీకృత ప్రణాళికలతో పథకాలు అమలుచేయటం ఈ ఉప ప్రణాళికల లక్ష్యాలు. రాష్ట్రాల ఉప ప్రణాళికల అమలు, పర్యవేక్షణ బాధ్యతలను కేంద్ర ప్రణాళికా సంఘానికి అప్పచెప్పటం వలన, రాష్ట్రాలు పాటించవలసిన నియమ, నిబంధనలను భారత ప్రణాళికా సంఘం జారీ చేయటం జరుగుతున్నది.

**1. ఉప ప్రణాళికల ముఖ్య ఉద్దేశాల, లక్ష్యాలు**

- ☆ పేదరికం, నిరుద్యోగాలను గణనీయంగా తగ్గించడానికి కృషి చేయటం.
- ☆ లబ్ధిదారుల ఆదాయ వనరులను, ఆస్తులను పెంచి ఆర్థికాభివృద్ధి సాధించటం.
- ☆ షెడ్యూల్డు కులాల బస్తీలు మరియు షెడ్యూల్డు తెగల తండాల అభివృద్ధిలో భాగంగా త్రాగునీరు, లింకురోడ్లు నిర్మాణం, ఇళ్ళస్థలాలు కేటాయించి, ఇళ్ళ నిర్మాణాలతోపాటు మౌలిక వసతులు కల్పించటం
- ☆ పాఠశాలలు, వైద్య కేంద్రాలు, వృత్తి విద్యా కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు, స్త్రీ సంరక్షణ కేంద్రాల ఏర్పాటు మొదలైన వసతులు కల్పించి విద్య, సామాజికంగా అభివృద్ధిని సాధించటం.
- ☆ వారికి వ్యక్తిగత రక్షణ, ఆర్థిక రక్షణలను కల్పిస్తూ అన్ని రకాల అత్యాచారాలను నిరోధించటం.

**2. ఉప ప్రణాళికలు తయారు చేసేటప్పుడు పాటించవలసిన నియమ నిబంధనలు**

- ☆ కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం ప్రణాళికా నిధుల నుండి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల జనాభా దామాషాకు తగ్గకుండా ఉప ప్రణాళికలకు నిధులు కేటాయించాలి.
- ☆ ఉప ప్రణాళికల నిధులను మురిగిపోకుండా, ఇతర పథకాల అమలుకు మళ్ళించకుండా చూడటం.
- ☆ సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ఉప ప్రణాళికల తయారీ అమలుకు నోడల్ శాఖలుగా ఉండటం.

☆ ఉప ప్రణాళికల కింద కేటాయించిన నిధులను నోడల్ శాఖల వద్ద ఉంచి, ఆ నిధులను షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి సంబంధించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సంబంధిత శాఖలకు నిధులు కేటాయించవలసి ఉంటుంది.

☆ షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి పనిచేస్తున్న శాఖలు ఉప ప్రణాళికల నిధులను ప్రత్యేక పద్దు, ఉప పద్దులలో ఉంచవలసి ఉంటుంది. భారత ప్రభుత్వపు కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వారి ఉత్తర్వుల మేరకు షెడ్యూల్డు తెగల ఉప ప్రణాళికల నిధులను 796 పద్దు కింద, షెడ్యూల్డు తెగల ఉపప్రణాళికల నిధులను 789 పద్దు కింద ఉంచవలసి ఉంటుంది.

☆ కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సహాయ నిధుల మొత్తాన్ని కుటుంబాల ఆధారంగా, లబ్ధిదారులకు ఆదాయవనరులను సమకూర్చే పథకాలకు, మౌలిక వసతుల సదుపాయాలు సమకూర్చటానికి, దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న వారి అభివృద్ధి లక్ష్యంగా నిధులను కేటాయించవలసి ఉంటుంది.

### 3. ఉప ప్రణాళికల తయారీకి సవరించిన నియమ, నిబంధనలు

కేంద్ర ప్రణాళికా సంఘం, పదకొండవ పంచవర్ష ప్రణాళిక 2007-2012 అధ్యాయం ఒకటి ప్రకారం, ఉప ప్రణాళికలు తయారుచేసేటప్పుడు ఈ క్రింద పేర్కొన్న సవరించిన నియమ నిబంధనలను పాటించవలసి ఉంటుంది :

☆ రాష్ట్ర ప్రభుత్వాలు- కేంద్ర పాలిత ప్రాంతాలు నిధులను కేటాయించేటప్పుడు మొత్తం ప్రణాళికల నిధుల నుండి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల జనాభా దామాషాకు తగ్గకుండా ఉప ప్రణాళికలకు నిధులను కేటాయించాలి.

☆ ఉప ప్రణాళికల కింద కేటాయించిన నిధులను నోడల్ శాఖలయిన సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి లేక కార్యదర్శులు, ఉపప్రణాళికల అమలుకు సంబంధించి ప్రణాళికా కార్యదర్శులుగా వ్యవహరిస్తూ, ఉపప్రణాళికల నిధులను వారి ఆధీనంలో ఉంచుకొని, ఆ నిధులను షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి పథకాలు అమలు చేస్తున్న సంబంధిత శాఖలకు కేటాయించవలసి ఉంటుంది.

☆ షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి పనిచేస్తున్న ప్రతి శాఖ ఉప ప్రణాళికల నిధులను ప్రత్యేక పద్దు, ఉప పద్దులలో ఉంచవలసి ఉంటుంది.

☆ ఉప ప్రణాళికల కింద చేపట్టే పథకాలకు నూరు శాతం నిధులను సకాలంలో సంబంధిత శాఖలకు విడుదల చేయవలసి ఉంటుంది.

☆ ఉప ప్రణాళికల కింద చేపట్టే పథకాలు షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వ్యక్తులకు గాని, కుటుంబాలకు గాని ప్రత్యక్షంగా లబ్ధి కలిగించే విధంగా ఉండాలి.

☆ ఉప ప్రణాళిక కింద చేపట్టే ప్రతి పథకం ఇతరులకు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల మధ్య దూరాన్ని, అగాధాన్ని తగ్గించేవిగా ఉండాలి.

☆ ఉప ప్రణాళికల క్రింద పథకాలను అమలు చేస్తున్న ఇతర శాఖలతో సమన్వయం సాధించడానికి, సమర్థవంతంగా పథకాలను అమలు చేయటానికి, ఆయా సంబంధిత శాఖలు నిధుల మంజూరుకు, నిధుల విడుదలకు నోడల్ శాఖలకు పంపి ఆమోదం పొందవలసి ఉంటుంది.

☆ నిధులను ప్రత్యేకంగా విభజించటానికి వీలులేని సాగునీరు, విద్యుత్తు, రోడ్లు మొదలైన పథకాలకు సంబంధించి ఉపప్రణాళికల నిధుల నుండి దాదాపు అయిదు శాతం నిధులను గాని, నికరంగా షెడ్యూల్డు కులాలు, తెగల వారు లబ్ధి పొందుతున్న సాగు ప్రాంతం ఆధారంగా కాని, వారు పొందుతున్న ప్రయోజనాల శాతం మేరకు నిధులను కేటాయింపు చేయవలసి ఉంటుంది. కాని, జనాభా దామాషా ప్రకారం కాదు. కేంద్రపాలిత ప్రాంతాలోను, రాష్ట్రాలలోను యస్.సి., యస్.టి., లబ్ధిదారుల శాతం వారి జనాభా శాతం కంటే తక్కువగా ఉంటున్నాయి.

☆ ఉపప్రణాళికల క్రింద వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇతర పథకాలకు ఖర్చు చేయకుండాను, మురిగిపోకుండాను చూడాలి. ఉపప్రణాళికల క్రింద కేటాయించిన నిధులను మార్పులు చేర్పులు చేయడానికి అనుమతి లేదు.

☆ ముందు సంవత్సరంలో మిగిలి ఉన్న, లేక మురిగిపోయిన నిధులను కేంద్ర మంత్రిత్వ శాఖలు లేక వివిధ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తదుపరి సంవత్సరపు సాధారణ వార్షిక బడ్జెట్‌లో అదనపు నిధులుగా ఉపప్రణాళికలో కేటాయించవలసి ఉంటుంది.

☆ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు తయారు చేసే అన్ని పథకాలలోను యస్.సి., యస్.టి., ఉపప్రణాళికలకు వారి జనాభా దామాషా ప్రకారం నిధులను కేటాయించవలసి ఉంటుంది.

☆ కేంద్ర మంత్రిత్వ శాఖలు అన్నీ తప్పనిసరిగా జాతీయ స్థాయిలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల జనాభా దామాషా ప్రకారం ఉప ప్రణాళికలకు నిధులను కేటాయించవలసి ఉంటుంది. ఉప ప్రణాళికలకు నిధులను కేటాయించని మంత్రిత్వ శాఖల వార్షిక బడ్జెట్ తిరస్కరించబడుతుంది.

☆ ఉపప్రణాళికల నిధులను ఇతర పథకాలకు మళ్లించటం నిషేధం. ప్రత్యేక పద్దు, ఉపపద్దుల కింద అనగా యస్.సి.యస్.పి. కి '789' మరియు టి.యస్.పి. కి '796' పద్దుల కింద నిధులను కేటాయించవలసి ఉంటుంది.

☆ ఉప ప్రణాళికల పథకాలను తయారు చేయుడానికి, సమర్ధవంతంగా అమలు పరచడానికి, నిబద్ధత కలిగి సమర్ధవంతంగా పనిచేసే వ్యవస్థను ఏర్పాటు చేయవలసి ఉంటుంది.

☆ షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు ప్రత్యక్షంగా ప్రతిఫలాలు అందే విధంగా ఉపప్రణాళికలను అమలు చేయవలసి ఉంటుంది.

☆ ఉపప్రణాళికలకు సంబంధించి కేంద్ర మంత్రిత్వ శాఖలు గతంలో ఇచ్చిన అన్ని నిబంధనలను ఖచ్చితంగా పాటించవలసి ఉంటుంది.

### 4. ఉప ప్రణాళికల ద్వారా చేపట్టవలసిన పథకాలు

భారత ప్రణాళికా సంఘం పదకొండవ పంచవర్ష ప్రణాళిక ప్రకారం వాల్యూమ్-1 ప్రకారం ఉప ప్రణాళికల ద్వారా ఈ క్రింది పథకాలను చేపట్టవలసి ఉంటుంది:

- ☆ ఉప ప్రణాళికల కింద చేపట్టే పథకాలు షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తులు గాని, కుటుంబాలు గాని ప్రత్యక్షంగా లబ్ధి పొందే విధంగా ఉండాలి.
- ☆ పరిసర ప్రాంతాల అభివృద్ధి పథకాల కింద షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలు ఎక్కువగా నివసించే గ్రామాలు లేక చివరి గ్రామాలను లేక తండాలను ఎంపిక చేయవలసి ఉంటుంది.
- ☆ షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు ఉప ప్రణాళికల నిధుల ను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాలకు వినియోగించరాదు.
- ☆ బ్రతకటానికి, జీవనాధారాలుగా ఉపయోగపడే వ్యవసాయం, పశుపోషణ, పాల ఉత్పత్తి మొదలైన పథకాలకు నిధులను కేటాయించ వచ్చును.
- ☆ కొత్త పథకాలకు ఆర్థిక సంస్థల నుండి వచ్చే నిధులను ఉప ప్రణాళికల నిధులకు అదనంగా అందుబాటులో ఉంచాలి.

## II షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక - 2012-13

### 1. నిధుల కేటాయింపులు

2012-13 ఆర్థిక సంవత్సరంలో షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళికల కింద 96 శాఖలకు రూ.905,386.32 లక్షల రూపాయల ను కేటాయించటం జరిగింది. ఈ మొత్తంలో రూ.713,973.49 లక్షల నిధులను ఖర్చుపెట్టడానికి అనుమతిస్తూ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్‌ను ఇవ్వటం జరిగింది. ఈ నిధులు బడ్జెట్ అంచనాల మొత్తంలో 78.86 శాతం మేరకు నిధుల వినియోగానికి అనుమతి ఇవ్వటం జరిగింది. బడ్జెట్ అంచనాల మొత్తంలో రూ.504,545.45 లక్షల రూపాయల నిధులను వివిధ పథకాల అమలుకు ఖర్చుచేయటం జరిగింది. ఈ ఖర్చు మొత్తం బడ్జెట్ అంచనాలలో 55.73 శాతంగా ఉన్నది.

### 2. సాంఘిక సంక్షేమ శాఖకు నిధుల కేటాయింపులు

మొత్తం ఉప ప్రణాళికా నిధుల నుండి రూ.171,913.65 లక్షల నిధులను అనగా 18.99 శాతం షెడ్యూల్డు కులాల సంక్షేమాన్ని చూసే సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించటం జరిగింది.

## III గిరిజన ఉపప్రణాళిక 2012-13

### 1. నిధుల కేటాయింపులు

2012-13 ఆర్థిక సంవత్సరంలో గిరిజన ఉప ప్రణాళికల కింద 98 శాఖలకు రూ.406,030.70 లక్షల రూపాయలను కేటాయించటం జరిగింది. ఈ మొత్తంలో రూ. 333,432.23 లక్షల నిధులను ఖర్చు పెట్టడానికి అనుమతిస్తూ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్‌ను ఇవ్వటం జరిగింది. ఈ నిధులు బడ్జెట్ అంచనాల మొత్తంలో 82.12 శాతం నిధుల వినియోగానికి అనుమతి ఇవ్వటం జరిగింది. బడ్జెట్ అంచనాల మొత్తంలో రూ.241,053.77 లక్షల రూపాయల నిధులను వివిధ పథకాల అమలుకు ఖర్చుచేయటం జరిగింది. ఈ ఖర్చు మొత్తం బడ్జెట్ అంచనాలలో 59.37 శాతంగా ఉన్నది.

### 2. గిరిజన సంక్షేమ శాఖకు నిధుల కేటాయింపులు

ఉప ప్రణాళిక మొత్తం నిధులలో రూ.101,348.21 లక్షల నిధుల ను అనగా 24.96 శాతం గిరిజన సంక్షేమాన్ని చూసే గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించటం జరిగింది.

### 3. నిధులను ఖర్చు చేయుటకు బడ్జెట్ మంజూరు ఉత్తర్వులు ఇవ్వని కారణంగా మురిగిపోయిన నిధులు

షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక కింద కేటాయించిన ఈ క్రింది పేర్కొన్న 11 శాఖలకు కేటాయించిన రూ. 9178.87 లక్షల రూపాయల ను ఖర్చు చేయటానికి బడ్జెట్ రిలీజు ఉత్తర్వులు ఇవ్వలేదు.

| | శాఖ | రూ.లు లక్షలలో |
|---|---|---|
| 1. | సచివాలయ ఇంధన శాఖ | 1586.40 |
| 2. | వయోజన విద్యా శాఖ | 132.00 |
| 3. | అవినీతి నిరోధక శాఖ | 19.80 |
| 4. | ఆయకట్టు అభివృద్ధి, నీటిపారుదల శాఖ | 13.20 |
| 5. | ముఖ్య ఇంజనీరు, గోదావరి లిఫ్టు ఇరిగేషన్ పథకం వరంగల్ | 5426.64 |
| 6. | సచివాలయ కార్మిక మరియు ఉపాధి శాఖ | 264.00 |
| 7. | సచివాలయ ప్రభత్వరంగ సంస్థల శాఖ | 1.32 |
| 8. | సచివాలయ పంచాయితీ రాజ్ శాఖ | 0.79 |
| 9. | ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ | 15.64 |
| 10. | వర్షాభావ ప్రాంత అభివృద్ధి శాఖ | 6.60 |
| 11. | యస్.సి.సి. | 2.90 |
| | **మొత్తం** | **7473.29** |

గిరిజన ఉపప్రణాళిక కింద 2012-13 సంవత్సరపు మొత్తం రూ. 406030.72 లక్షల నిధులలో రూ. 7473.29 లక్షల నిధులను ఖర్చు చేయుటకు బడ్జెట్ మంజూరు ఉత్తర్వులు జారీచేయకుండటంతో ఈ మొత్తం అనగా 1.84 శాతం నిధులు మురిగిపోవటం జరిగింది.

### 5. నీటిపారుదల శాఖలకు బడ్జెట్ కేటాయింపులు

| | శాఖ | నిధుల కేటాయింపు | నిధుల మంజూరు | నిధుల ఖర్చు |
|---|---|---|---|---|
| 1. | సచివాలయ సాగునీటి ఆయకట్టు ప్రాంత అభివృద్ధి | 13.20 | 0.00 | 0.00 |
| 2. | ఆయకట్టు అభివృద్ధి సంస్థ కమీషనర్ | 3476.46 | 1705.21 | 458.69 |
| 3. | ప్రధాన ఇంజనీరు (పరిపాలన) | 772.20 | 579.15 | 0.00 |
| 4. | నీటిపారుదల వరద నివారణ, మురుగు కాల్వల నిర్వహణ ప్రధాన ఇంజనీరు | 3462.36 | 1823.25 | 0.00 |
| 5. | మధ్య తరహా నీటిపారుదల ప్రధాన ఇంజనీరు | 2310.00 | 484.09 | 148.93 |
| 6. | చిన్న నీటిపారుదల శాఖ ముఖ్య ఇంజనీరు | 16447.00 | 8343.86 | 7317.59 |
| 7. | నాగార్జున సాగర్ ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరు | 561.00 | 420.00 | 38.97 |

| | | | | |
|---|---|---|---|---|
| 8. | నీలమ్ సంజీవరెడ్డి సాగర్ శ్రీశైలం ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరు | 3528.60 | 2646.45 | 613.59 |
| 9. | యన్.టి.ఆర్.తెలుగు గంగ ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరు | 3523.46 | 2642.55 | 417.27 |
| 10. | శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు మొదటి దశ పరిపానా ముఖ్య ఇంజనీరు | 1338.24 | 1003.68 | 15.94 |
| 11. | వరంగల్ గోదావరి లిఫ్టు ఇరిగేషన్ పథకం ముఖ్య ఇంజనీరు | 5426.64 | 0.00 | 0.00 |
| 12. | కడప నీటిపారుదల పథకం ముఖ్య ఇంజనీరు | 4950.00 | 3687.75 | 0.00 |
| 13 | గోదావరి ప్రాంత ప్రణాళిక మరియు అభివృద్ధి ప్రణాళిక మరియు అభివృద్ధి కమీషనరు | 2229.30 | 1627.59 | 0.00 |
| 14. | ఉత్తర కోస్తాల ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరు | 1643.40 | 917.55 | 0.00 |
| 15. | ఒంగోలు ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరు | 4416.90 | 3238.02 | 156.49 |
| 16. | అనంతపురం ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరు | 6142.46 | 4606.83 | 0.00 |
| 17. | ఇందిరా సాగర్ పోలవరం ముఖ్య ఇంజనీరు | 7875.50 | 2389.09 | 1020.57 |
| 18. | మహబూబ్‌నగర్ ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరు | 5023.00 | 3148.50 | 0.00 |
| 19. | పి.పి.యం.యు., ఎ.పి.బు.ఎస్.ఐ.పి. ప్రాజెక్టు డైరెక్టరు | 3895.25 | 3895.25 | 3314.11 |
| 20. | కరీంనగర్ శ్రీరామ్ సాగర్ ముఖ్య ఇంజనీరు | 4686.00 | 2524.50 | 0.00 |
| 21. | కర్నూలు నీటిపారుదల ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరు | 1702.80 | 880.90 | 0.00 |
| 22. | డా॥బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ళ సుజల స్రవంతి ముఖ్య ఇంజనీరు | 6930.00 | 5098.50 | 0.00 |
| 23. | దుమ్ముగూడెం నాగార్జున సాగర్ మరియు రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ లిఫ్టు ఇరిగేషన్ ముఖ్య ఇంజనీరు | 2323.20 | 1677.18 | 0.00 |
| 24. | ధవళేశ్వరపురం గోదావరి డెల్టా పథకం ముఖ్య ఇంజనీరు | 1986.60 | 1489.95 | 0.00 |
| 25. | విజయవాడ కృష్ణా డెల్టా పథకం ముఖ్య ఇంజనీరు | 3082.20 | 2311.65 | 0.00 |
| | **మొత్తము** | **97,749.77** | **57,146.50** | **6,184.56** |

మొత్తం 96 శాఖలలో నీటిపారుదల శాఖల విభాగాలకు మొత్తం బడ్జెట్ అంచనాలలో 25.86 శాతం నిధులను కేటాయించి, మొత్తం నిధుల విడుదలలో 19.97 శాతం నిధులను విడుదల చేసి మొత్తం నిధుల వినియోగంలో 7.46 శాతం నిధులను ఖర్చు చేయటం జరిగింది.

### 6. మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్ కేటాయింపులు

ఈ క్రింది పేర్కొన్న ఆరు శాఖలకు సమాజం అంతటికీ ఉపయోగపడే రోడ్లనిర్మాణానికి ఉపప్రణాళిక నిధులను కేటాయించటం జరిగింది.

| | శాఖ | నిధుల కేటాయింపు | నిధుల మంజూరు | నిధుల ఖర్చు |
|---|---|---|---|---|
| 1. | రాష్ట్ర రోడ్ల ప్రధాన ఇంజనీరు | 5,098.50 | 2,899.99 | 1,840.08 |
| 2. | భవనాల ప్రధాన ఇంజనీరు | 12.60 | 29.69 | 22.13 |
| 3. | రోడ్లు భవనాల ముఖ్య ఇంజనీరు (ఇ.ఎ.పి.) | 6,440.00 | 1,980.00 | 0.00 |
| 4. | రోడ్లు భవనాల ముఖ్య ఇంజనీరు (పి.పి.పి.) | 2,310.00 | 1,155.00 | 0.00 |
| 5. | ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాంగణం ఎల్.బి.స్టేడియం | 1,320.00 | 33.00 | 33.00 |
| | **మొత్తం** | **15,185.10** | **6,102.68** | **1,901.21** |

నాలుగు ఇంజనీరింగు శాఖలకు, ఎల్.బి.స్టేడియంకు రూ.15,185.10 లక్షల నిధులను కేటాయించి రూ. 6,102.68 లక్షల నిధులను విడుదల చేసి 1,901.21 లక్షల నిధులను ఖర్చు చేయటం జరిగింది.

### 7. గిరిజన సంక్షేమానికి సంబంధం లేని శాఖలకు నిధుల కేటాయింపులు

ఈ క్రింది పేర్కొన్న వివిధ శాఖలకు గిరిజన సంక్షేమానికి సంబంధం లేనప్పటికి నిధులను కేటాయించటం జరిగింది.

| | శాఖ | నిధుల కేటాయింపు | నిధుల మంజూరు | నిధుల ఖర్చు |
|---|---|---|---|---|
| 1. | పౌర సంబంధాల శాఖ | 841.83 | 841.83 | 587.46 |
| 2. | అవినీతి నిరోధక శాఖ | 19.80 | 0.00 | 0.00 |
| 3. | డా॥మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ | 29.44 | 14.72 | 0.00 |
| 4. | ఎన్నికల ప్రధాన అధికారి (ఎన్నికలు) | 66.00 | 38.62 | 10.95 |
| 5. | ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మరియు కమ్యూనికేషన్స్ | 949.28 | 1268.60 | 1214.15 |
| 6. | రిలీఫ్ కమీషనరు | 138.60 | 3.30 | 0.00 |
| 7. | పర్యాటక శాఖ | 69.63 | 34.80 | 0.00 |
| 8. | ఎన్.సి.సి. | 2.90 | 0.00 | 0.00 |
| | **మొత్తం** | **2,121.48** | **2,206.87** | **1,818.60** |

పైన పట్టికలో పేర్కొన్న ప్రకారం షెడ్యూల్డు తెగల సంక్షేమానికి ఉపయోగపడని 8 శాఖలకు రూ. 2121.48 లక్షల రూపాయలు కేటాయించి, రూ. 2206.87 లక్షల నిధుల వినియోగానికి అనుమతి ఇచ్చి, రూ.1818.60 లక్షల నిధులను ఖర్చు చేయటం జరిగింది.

షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక, గిరిజన ఉప ప్రణాళిక నియమ నిబంధనలు తెలియని కారణంగాను, ఉన్న నియమ నిబంధనలు పాటించని కారణంగా మొత్తం షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక నిధులలో, గిరిజన ఉపప్రణాళికలలో ఎక్కువ భాగం, ఎక్కువ శాతం నిధులు షెడ్యూల్డు కులాల వ్యక్తులకుగాని, షెడ్యూల్డు కులాల కుటుంబాలకుగాని లేక షెడ్యూల్డు కులాలు నివసించే ప్రాంతాల అభివృద్ధికిగాని, షెడ్యూల్డు తెగల వ్యక్తులకుగాని, షెడ్యూల్డు తెగల కుటుంబాలకు గాని, షెడ్యూల్డు తెగలు నివసించే ప్రాంతాలకు గాని లేక తాండాలకు గాని ఉపయోగపడేవిగా లేవు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వు జి.ఓ.యం.యస్.నెం.17 ప్రణాళికా శాఖ తేది 07.11.2005 ప్రకారం ప్రణాళికా నిధులలో 16.2 శాతం షెడ్యూల్డు కులాల ఉపప్రణాళికకు, 6.6 శాతం నిధులు గిరిజన ఉపప్రణాళికలకు కేటాయించవలసి ఉన్నందున ఆ మేరకు ఉపప్రణాళికల నిధులలో ఎక్కువభాగము నిధులు సాగునీటి పథకాలకు, రోడ్లు భవనాల నిర్మాణాలకు కేటాయించటం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళికల చట్టం 2013 లక్ష్యాలను, ఉద్దేశ్యాలను ఆశయాలను ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు వివరించి, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వ్యక్తులకు, కుటుంబాలకు, వారు నివసించే ప్రాంతాల అభివృద్ధికి దోహదపడే పథకాలకు నిధులను కేటాయించటం ద్వారా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడి, అది అంతిమంగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజలకు, సమాజంలోని మిగతా ప్రజల మధ్య ఉన్న అగాధం, అంతరాయాలు తగ్గడానికి దోహదపడుతుందని ఆశిద్దాం.

– ***మట్టా మదన మోహన రావు,*** *సెంటర్ హెడ్*
*సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ అండ్ వాలంటరీ యాక్షన్,*
*ఎ.ఎమ్.ఆర్., అపార్డ్*

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా పథకం - ముఖ్య విషయాలు (ఎపిజిఎల్ఐ)

APGLI
AP GOVT LIFE INSURANCE

APGLI
Account Slips

**ప్రతి వ్యక్తి తన భవిష్యత్ జీవిత అవసరాల కోసం, సుఖ జీవనం కోసం, కుటుంబ ఖర్చుల కోసం, వివాహాది శుభకార్యాల కోసం, వైద్య ఖర్చుల నిమిత్తం, తన సంపాదనలో కొంత భాగాన్ని పొదుపు చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ రోజులలో మరింత ఆవశ్యకం. నెల ఆదాయం ఉన్న ఉద్యోగస్థులకు ఈ విధంగా పొదుపు చేసుకోవడం మరింత సులభం. ఇలా పొదుపు చేసుకోవటంలో జీవిత బీమా పథకాల ద్వారా పొదుపు చేసుకోవడం అన్ని విధాలా శ్రేయోదాయకం. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు తన ఉద్యోగస్తుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ బీమా పథకాన్ని "డైరెక్టరేట్ ఆఫ్ ఇన్సూరెన్స్, హైదరాబాదు" వారి ఆజమాయిషీలో ప్రభుత్వ ఉద్యోగస్థులందరికీ అమలు చేస్తూ, అన్ని ప్రభుత్వ శాఖలు, పంచాయితీరాజ్ మరియు తదితర స్థానిక సంస్థలలో, తన పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగస్థులకు విస్తరింపచేసింది. ప్రస్తుతం మన దేశంలో గల అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర బీమా సంస్థల ప్రీమియంల కన్న దీనిలో ప్రీమియం తక్కువ. డివిడెండు ఎక్కువ.**

ప్రస్తుతం ప్రతి జిల్లా ప్రధాన కేంద్రాలలో జిల్లా కార్యాలయాలు ఏర్పాటయి, 1-4-1998 నుండి పనిచేస్తున్నాయి. ఈ కార్యాలయాల ద్వారా పాలసీదారుల సేవలు అనగా పాలసీల జారీ, ప్రీమియంలు, అకౌంట్లు నిర్వహించడం, రుణాలు మంజూరు చేయడం, క్లైయిముల చెల్లింపులు వంటి పనులు చేస్తున్నాయి.

### బీమా పథకపు ముఖ్యమైన లక్షణాలు

- ప్రభుత్వ ఉద్యోగుల నెల జీతాల నుండి నేరుగా బీమా ప్రీమియంను మినహాయించి, వేతనం ఇవ్వటం.
- లాభాలతో కూడిన బీమా పాలసీలు జారీ చేయడం.
- పురుషులకు, స్త్రీలకు ఒకే విధమైన ప్రీమియం సూత్రాలు వర్తింపు చేయడం.
- కోర్టు వివాదాలు, జప్తుల నుండి బీమా పాలసీల మినహాయింపు
- ఇతర ప్రభుత్వ రుణాలు కానీ బాకీలు గాని పాలసీ మొత్తాల ద్వారా రాబట్టుకొనే అవకాశం లేకపోవడం (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బీమా శాఖకు బకాయి పడిన మొత్తాలు మినహా)
- ఈ శాఖ జారీ చేసే బీమా పాలసీలకు వైద్య పరీక్షల అవసరం లేకపోవడం.
- ఈ బీమా పాలసీలు బదలాయించే అవకాశం లేదు.
- ఈ బీమా పాలసీల క్రింద చెల్లించే ప్రీమియాలకు ఆదాయపు పన్ను నుండి మినహాయింపు ఉండటం.
- పాలసీదారు సర్వీసులో ఉండగా, ఏ కారణం చేతనైనా కొంతకాలం ప్రీమియం చెల్లింపు చేయబడనప్పటికినీ, బీమా పాలసీలు సరెండరు / రద్దు అయ్యే అవకాశం లేదు. బకాయిలను, వడ్డీతో సహా పాలసీ మొత్తం నుండి మినహాయించి, చెల్లించడం జరుగుతుంది.
- బీమా పాలసీ సరెండరు విలువలో 90% వరకు సులభ, స్వల్పకాలిక వాయిదాలలో చెల్లింపులు జరిగేలా రుణాలు మంజూరు చేయబడతాయి.
- ఏదైనా కారణంవలన పాలసీదారు సర్వీసులో ఉండగానే, శాశ్వతంగా అశక్తుడై విధులకు హాజరుకాలేని పక్షంలో, నెలసరి ప్రీమియం రూ. 30/-ల వరకు ఉన్నవారు భవిష్యత్ ప్రీమియంలు చెల్లించనవసరం లేదు.
- నామినేషన్ సౌకర్యం కలదు.

### ఈ బీమా పథకంలో చేరగోరే వారి అర్హతలు

- ఉద్యోగి కనీస వయస్సు 20 సం॥లు నిండాలి.
- ఉద్యోగి వయస్సు 53 సం॥దాటి ఉండరాదు. (G.O.M.S. NO. 16 FINANCE (Admn - II) Dept. Dt. 17-02-2011)
- కనీసం 1 సం॥ కాలం అంతరాయం లేకుండా ప్రభుత్వ సర్వీసులో ఉండటం.

### బీమా పాలసీ రకం

ఈ పథకం క్రింద ఉద్యోగి పదవీ విరమణ తేదీకి మెచ్యూరిటీ (పరిమితి) అయ్యే ఒకే ఒక రకమైన "ఎండోమెంటు" బీమా పాలసీలు జారీచేయబడతాయి.

### ప్రీమియం రేట్లు

జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 231 ఫైనాన్స్ (Admn - II) డిపార్టుమెంటు తేది: 28-6-2010 ప్రకారం ఈ దిగువ విధంగా ప్రీమియం రేట్లు ప్రభుత్వ ఉద్యోగి ప్రస్తుతవేతనం నుండి ఆయా స్లాబులకు ఎదురుగా చూపబడిన విధంగా ప్రీమియం రేట్లు ప్రతి నెల అతని జీతం నుండి నిర్భందంగా వసూలు చేయాల్సి ఉంటుంది. (2010 పి.ఆర్.సి. స్కేల్స్ ప్రకారం)

| Existing slabs | | Rates Revised slab rates | |
|---|---|---|---|
| Pay slabs Rs. | Monthly Primium Rs. | Pay slabs Rs. | Monthly Primium Rs. |
| 1. Pay upto 4825 | 150-00 | Pay from 6700-8440 | 250-00 |
| 2. 4826 - 6195 | 200-00 | 8441 - 10900 | 350-00 |
| 3. 6196 - 7770 | 250-00 | 10901 - 14860 | 450-00 |
| 4. 7771 -9775 | 350-00 | 14861 - 18030 | 600-00 |
| 5. 9776 - 12640 | 450-00 | 18031 - 25600 | 750-00 |
| 6. 12641 - and above | 600-00 | 25601 - and above | 1000-00 |

ప్రభుత్వ ఉద్యోగి నిర్బంద బీమా ప్రీమియం కన్న ఎక్కువ ప్రీమియంను స్వచ్ఛందంగా చెల్లింపు చేయదలుచుకున్న పక్షంలో అతని ప్రస్తుత వేతనంపై 20% వరకు ప్రీమియం చెల్లించవచ్చును.

## బీమా చేసే విధానం

డ్రాయింగ్ & డిస్బర్సింగ్ ఆఫీసరు, నిర్బంధ బీమా ప్రీమియం నిబంధనలను అనుసరించి ఉద్యోగి జీతం నుండి తగ్గింపు చేయవచ్చును. ఉద్యోగి సంబంధిత డ్రాయింగ్ & డిస్బర్సింగ్ ఆఫీసర్‌ను దరఖాస్తు ద్వారా తన ప్రీమియంను ఫలానా నెల జీతం నుండి తగ్గింపు చేయవలసినదిగా కోరవచ్చును. ఆ విధంగా ఆ ఉద్యోగి నుండి తగ్గించిన ప్రీమియం, నిర్ణీత నమూనాలో పూరించిన ప్రతిపాదన పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. అట్టి ప్రతిపాదన పత్రంపై వివరాలు నమోదు చేసి, ధృవీకరించి ప్రతిపాదనలను జిల్లా కార్యాలయానికి పంపాలి. పాలసీ పత్రాలు అందే వరకు అతని నుండి తగ్గించిన ప్రీమియంలను "పాలసీ సంఖ్య కాలమ్‌లో" "క్రొత్త కేసు" అని వ్రాయవలెను. గతంలో పాలసీ తీసుకొన్న సందర్భంలో పాత పాలసీ నెంబర్‌ను సంబంధిత కాలమ్‌లో వేయవలెను.

## తీసుకోవలసిన జాగ్రత్తలు

- మొదటి సారి బీమా చేసేటపుడు ఫారం నెం. 1లో ప్రతిపాదన దాఖలు చేయాలి.
- ప్రీమియం హెచ్చించే సందర్భంలో ప్రతిపాదన పారం నెం. 1ఎలో దాఖలు చేయాలి.
- ఫారంలోని అన్ని కాలమ్‌లలో అవును/ కాదు అని తప్పనిసరిగా పూర్తి చేయాలి.
- ప్రతిపాదకురాలు స్త్రీ అయితే "స్త్రీ" కాలమ్‌ను తప్పక పూర్తి చేయాలి. (ప్రతిపాదన పూర్తి చేసే నాటికి తాజా సమాచారం తెలియజేయవలెను.)
- కాలమ్ 7కు సంబంధించి "కుటుంబ చరిత్ర" అనగా తల్లి, తండ్రి, సోదరులు, సోదరీమణులు, భార్య, పిల్లల ప్రస్తుత వయస్సులు, ఆరోగ్య పరిస్థితులు, వీరిలో ఎవరైనా ఇదివరలో మరణిస్తే, ఏ వ్యాధితో, ఎంతకాలం బాధపడి, ఏ వయస్సులో మరణించినది స్పష్టంగా తెలియజేయాలి.
- ప్రతిపాదకులు పుట్టిన తేది, మొదటి సారిగా ఉద్యోగంలో చేరిన తేది, ప్రస్తుత వేతనం, ప్రీమియం, గతంలో ప్రతిపాదన వుంటే దాని నెంబరు, ప్రీమియం మొదలైన వివరాలు అన్నీ స్పష్టంగా వ్రాస్తే పరిశీలనకు ఉపయోగపడతాయి. అలా లేని పక్షంలో ప్రతిపాదన వాపసు వచ్చే అవకాశం ఉంది.
- ప్రతిపాదకుడు డ్రాయింగ్ & డిస్బర్సింగ్ ఆఫీసర్ అయితే అతని సంతకాన్ని పై అధికారి / గెజిటెడ్ ఆఫీసర్ ధృవీకరించాలి.
- గర్భిణీ స్త్రీలు ప్రతిపాదకులు అయితే, ప్రసవం తర్వాత 6 నెలల పిమ్మట ప్రతిపాదన దాఖలు చేయాలి.
- జీతంలో ప్రీమియం రికవరి అయినంత మాత్రాన, కార్యాలయానికి ప్రతిపాదన దాఖలు చేయని పక్షంలో జీవిత బీమాకు పూచీవుండదు. ప్రతిపాదన దాఖలు చేసి, పాలసీ తప్పని సరిగా పొందవలెను.

## నామినేషన్

నామినేషన్ చేసి ఉంటే మరణ క్లెయిములను శీఘ్రంగా పరిష్కరించవచ్చును.

## బీమా ఎప్పటి నుండి మొదలవుతుంది?

మొదటి నెల ప్రీమియం జమ చేయబడిన, తదుపరి నెల మొదటి తేదీ నుండి, ప్రతిపాదనలు అందిన తదుపరి, వయస్సును బట్టి బీమా మొత్తం నిర్ణయించి బీమా పాలసీ జారీ చేస్తారు.

## రుణం ఎలా పొందవచ్చును?

ఫారమ్ నెం. 41లో దరఖాస్తు చేసి బీమా పాలసీ సరెండర్ వాల్యూలో 90 శాతం రుణాలు పొందవచ్చును.

గతంలో రుణం పొందివుంటే, అట్లు తీసుకొన్న రుణంలో సగం ఇప్పటికే చెల్లించియుంటే మరల రుణం తీసుకొనవచ్చును.

## పాలసీ సొమ్ము ఎప్పుడు క్లెయిమ్ చేసుకొనవచ్చును ?

- పాలసీ తేది మెచ్యూరిటీ సమయానికి 3 నెలల ముందు దరఖాస్తు చేసుకొన్నట్లయితే మెచ్యూరిటీ అయిన వెంటనే చెల్లిస్తారు.
- పాలసీ దారు మరణించినట్లయితే అతని వారసులకు చెల్లిస్తారు.
- సర్వీసు నుంచి వదలి వెళ్లిన సందర్భంలో, స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసిన సందర్భంలో ఆ తేదీ నుండి 3 నెలలలోగా పొడిగింపునకు లేదా సరెండర్‌కు దరఖాస్తు చేసుకోవాలి.

## బోనస్

ప్రతీ రూ. 1000 బీమా మొత్తానికి రూ. 100 బోనస్ + టెర్మినల్ బోనస్ రూ. 5 (జీ.ఒ.ఎమ్.ఎస్. నెం. 328 ఫైనాన్స్ (అడ్మిన్ 11) డిపార్టుమెంటు తేది. 29-10-2010)

**యస్.వి.బి.యస్. శాస్త్రి**
**జిల్లా శిక్షణా మేనేజర్, తూర్పుగోదావరి**

ఏ పదార్థం గుండానయినా విద్యుత్ ప్రవహిస్తూ ఉంటే ఆ పదార్థం ప్రవాహాన్ని వ్యతిరేకిస్తుంది. అంటే ఆ పదార్థానికి విద్యుత్ నిరోధం ఉందంటాము. రాగి, వెండి, అల్యూమినియం వంటి లోహాల వెంబడి విద్యుత్ ప్రవహిస్తుంది. అవి విద్యుత్ ప్రవాహానికి ఎక్కువ నిరోధం చూపించవు. అందుకే వీటి తీగలను విద్యుత్ ప్రసారానికి వాడుతున్నాము.



# అతివాహకాలు - అద్భుతాలు

విద్యుత్ ప్రవాహానికి పదార్థం నిరోధం కల్గిస్తూ ఉంటే ఆ పదార్థంలో విద్యుత్ ప్రవహించినపుడు కొంతనష్టం కల్గుతుంది. ఏ పదార్థమయినా విద్యుత్ ప్రవాహానికి నిరోధం ప్రదర్శించకపోతే విద్యుత్ నష్టపోకుండా విద్యుత్ ప్రసారం ఆ పదార్థం గుండా సాధ్యమవుతుంది.

విద్యుత్ వాహకం ఉష్ణోగ్రత తగ్గితే దాని నిరోధం తగ్గుతుంది. వాహకం నిరోధం శూన్యంగా ఉండే విధంగా చేసేందుకు ఉష్ణోగ్రతలు తగ్గించి ఎన్నో ప్రయోగాలు చేశారు.

ఈ ప్రయోగాల నేపథ్యంలో శాశ్వత వాయువులనుకునే హైడ్రోజన్, ఆక్సిజన్, హీలియం వంటి వాయువులను ద్రవీకరించగలిగారు. మైనస్ 275 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను సున్నా డిగ్రీల కెల్విన్ అన్నారు. 4.2 కెల్విన్‌ల వద్ద హీలియం ద్రవం, 4.6 కెల్విన్ వద్ద పాదరసం విద్యుత్ ప్రవాహానికి నిరోధకత చూపించడం మానేశాయి.

ఇవేగాక కొన్ని లోహాలు, మిశ్రలోహాలు హీలియం ద్రవంలో ముంచి తీసినపుడు అవి సున్నా నిరోధాన్ని విద్యుత్ ప్రవాహానికి ప్రదర్శించాయి. ఈ అద్భుతాన్ని 1911లో కామర్‌లింగ్ ఒన్నస్ అనే శాస్త్రవేత్త గుర్తించాడు.

పదార్థం విద్యుత్ ప్రవాహానికి ఏవిధమైన నిరోధకత్వం ప్రదర్శించకపోతే దానిని అతివాహకం అంటారు. అతివాహకం గుండా విద్యుత్ ప్రవహిస్తే విద్యుత్ బలంలో ఎటువంటి తగ్గుదల ఉండదు.

అనేక లోహ మిశ్రాల నిరోధకత ఉష్ణోగ్రత తగ్గే కొలది తగ్గుతుంది. ఒకానొక సందిగ్ధ ఉష్ణోగ్రత వద్ద పదార్థం సాధారణ విద్యుత్ నిరోధపు స్థితి నుండి అతివాహక స్థితికి మారుతుంది.

## మాగ్నెటిక్ లేవిటేషన్

సందిగ్ధ ఉష్ణోగ్రత వద్ద అతివాహకం డయా అయస్కాంతత్వాన్ని ప్రదర్శిస్తుంది. అంటే ఇది అయస్కాంతానికి అతుక్కుపోదు. నిజానికి ఇనుప ముక్కను అయస్కాంతం ఆకర్షిస్తుంది. కాని అతివాహకం అయస్కాంతానికి ఆకర్షింపబడక వికర్షింపబడుతుంది.

అతివాహకాన్ని బల్లపై ఉంచి దానిమీద అయస్కాంతం ఉంచితే అయస్కాంతం కొంత ఎత్తులో తేలుతుంది. దీనినే మాగ్నెటిక్ లేవిటేషన్ అంటే అయస్కాంత తేలుడు అంటారు.

అతివాహకాల సందిగ్ధ ఉష్ణోగ్రత ఎంత ఎక్కువగా ఉంటే వాటి అనువర్తనాలు అంత ఎక్కువగా ఉంటాయి. 1986లో జూరిచ్‌కి చెందిన శాస్త్రవేత్తలు జార్జిబెడ్‌నార్జ్, కార్ల్ అలెక్స్ ముల్లర్‌లు బేరియయ్, లాంథనమ్, కాపర్, ఆక్సిజన్ సమ్మేళనాలపై ప్రయోగాలు జరిపి వీటి సందిగ్ధ ఉష్ణోగ్రత 30 కెల్విన్ వున్నట్లు గుర్తించారు.

ఈ ప్రయోగ ఫలితాలు శాస్త్రవేత్తలకు కొత్తకొత్త పరిశోధనలు చేసే స్ఫూర్తిని కల్గించాయి. ఫలితంగా 1987లో జపాన్, అమెరికా, చైనాలలో 95 కెల్విన్ ఉష్ణోగ్రత సందిగ్ధ ఉష్ణోగ్రత గల అతివాహకాలను గుర్తించగలిగారు.

## అతివాహకాల సేవలు

హీలియం వాయువుధర ఎక్కువ. దీనిని ద్రవరూపంలోని తీసుకురావడానికి ఎక్కువ ఖర్చు అవుతుంది. అందువల్ల అతివాహకాలు 1911లో ఆవిష్కరింవబడినప్పటకీ, అవి ఏవిధమైన సేవలు అందించగలవనే అంశంపై అప్పట్లో శాస్త్రవేత్తలు దృష్టి సారించలేదు.

వంద డిగ్రీల కెల్విన్ సందిగ్ధ ఉష్ణోగ్రత గల అతివాహకాలను చల్లబరచేందుకు ద్రవ నైట్రోజన్ ఉపయోగించవచ్చు. ద్రవ నైట్రోజన్ ఖరీదు సాపేక్షంగా తక్కువ. ప్రస్తుతం అతివాహకాలను తీగరూపంలోను, చుట్టల రూపంలోను, ఆయతన రూపంలోను పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పింగాణి అతివాహకాల నుపయోగించి విద్యుత్ ఉత్పాదన, పంపిణీలలో వినూత్న పరిణామాలను సృష్టించవచ్చు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పాదనకు తీగతో చుట్టిన రోటర్‌ను విద్యుత్ అయస్కాంత క్షేత్రంలో భ్రమణం చెందించి విద్యుత్ ఉత్పాదన చేస్తున్నారు.

అధిక సందిగ్ధ ఉష్ణోగ్రత, అధిక అయస్కాంత క్షేత్ర తీవ్రత గల పింగాణీ అతివాహక అయస్కాంతాలను ఉపయోగించి విద్యుత్ ఉత్పాదనను రెట్టింపుకు పెంచవచ్చు.

ఇప్పుడు జరుగుతున్న విద్యుత్ పంపిణీలో 30 శాతం విద్యుత్ నష్టం అవుతోంది. రాగి లేదా అల్యూమినియం తీగలను విద్యుత్ ప్రసారానికి వాడుతున్నారు. వీటికి వున్న విద్యుత్ నిరోధం వల్ల విద్యుత్ శక్తి ఉష్ణరూపంలో దుర్వ్యయం అవుతోంది.

## బొమ్మరిల్లు కడదాం - రారండి

చిట్టి చిట్టి బొమ్మరిల్లు కడదాం రారండి
"ఏట్లా"?

పుట్టమన్ను తవ్వి, రెండు గుంతలు కట్టి
"ఇంకా"!

పునాది వేసి, ఇటుకిటుక పేర్చి
"అబ్బో"!

బేసిన్ అమర్చి, గుంతకు కలిపి
తర్వాత

మీద చిన్న నీడ, ముందు వాలు పరదా
అప్పుడు!

అదే బొమ్మరిల్లు
ఏమిటీ?

అర్థం కాలేదా మరుగు దొడ్డి
అయిపోయిందా?

మరుగుదొడ్డి సార్థకత వాడినప్పుడే
ఎలా?

వాడేముందు నీరు, వాడిన తర్వాత నీరు
తదుపరి?

సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి
హమ్మయ్య?

అర్థం అయింది కదూ.
ఓ బ్రహ్మాండంగా.

- పి. మాధురి

పింగాణి అతివాహక తీగలను విద్యుత్ ప్రసారానికి ఉపయోగిస్తే విద్యుత్ నష్టం కాకుండా ఎంత దూరమైనా రవాణా చేయవచ్చు. దీనివల్ల ఎంతో డబ్బు ఆదా అవుతుంది.

పింగాణి అతివాహక భూస్థాపిత కేబుల్స్‌ను అభివృద్ధిపరిస్తే విద్యుత్‌ను నిల్వ చేసుకుని ఎక్కువ అవసరం వున్నప్పుడు చక్కగా వినియోగించుకోవచ్చు.

ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ పరిశ్రమలో అతివాహకాలకు ఎంతో వినియోగం ఉంటుంది. విద్యుత్‌తో నడిచే కార్లకు చిన్న అతివాహక మోటార్లను బిగించవచ్చు. వీటిని ఉపయోగించడం వల్ల కార్ల ధర బాగా తగ్గిపోతుంది. సామాన్య ప్రజలు కూడా కారు కొనగల్గుతారు.

### అయస్కాంత రైళ్లు

అతివాహక అనువర్తనాలలో అత్యంత ముఖ్యమైనది మాగ్నెటిక్ లెవిటేషన్ ప్రక్రియ. ఈ ప్రక్రియ ఆధారంగా అత్యంత వేగంగా ప్రయాణం చేయగల అయస్కాంత రైళ్ల నిర్మాణం ఒక కొత్తమలుపు.

రైలు పట్టాలలో ఆవర్తన ప్రవాహాన్ని ప్రసారం చేసి అతివాహక అయస్కాంతం తగిలించిన రైలును నడిపినపుడు పట్టాలకు రైలు చక్రాలకు మధ్య ఉండే వికర్షణ వల్ల రైలు పట్టాలకు కొంత ఎత్తులో నిలుస్తుంది. ఇటువంటి రైలు అత్యంత వేగంతో వెడుతుంది.

పట్టాలకు దాదాపు 10 సెంటీ మీటర్ల ఎత్తులో అయస్కాంత శక్తి గల కుషన్ వంటి గైడ్‌వేవ్‌లో రైలు పరిగెడుతుంది. ఇలా ప్రయాణం చేయడం వల్ల పట్టాలకు, చక్రాలకు మధ్యన ఉండే ఘర్షణ ఉండదు. అందుకే ఎక్కువ వేగంతో రైలు వెళ్లగల్గుతుంది.


ఎక్కువ అభివాహా సాంద్రత, అధిక వైశాల్యానికి పరిమితమయ్యే అతివాహక అయస్కాంతాలను తక్కువ ఖర్చుతో తయారు చేయగల్గితే ఈ అయస్కాంత రైళ్లు పట్టాలకు ఎత్తులో ఎగురుతూ పరుగులు తీయడం మనందరం చూడగల్గుతాము. భూమి మీద ప్రయాణంలో ఇదొక సుఖమయ ప్రయాణం అవుతుంది.

ఈ లెవిటేషన్ ప్రక్రియ ఆధారంగా అతివాహక బేరింగ్స్ తయారు చేయవచ్చు. అతివాహకం పైన వున్న అయస్కాంతం ఇరుసుగా ఉంటే దానిని ఏమాత్రం ఘర్షణకులోను కాకుండా భ్రమణానికి గురిచేయవచ్చు. ఇటువంటి అల్ప ఘర్షణ బేరింగ్స్ నౌకాయానానికి తోడ్పడే గైరోస్కోపులలో వాడవచ్చు.

అధిక ఉష్ణోగ్రత అతివాహకాల తయారీలో, వాటి అనువర్తనాలలో ప్రస్తుతం అనేక దేశాలు పరిశోధనలు చేస్తున్నాయి. ముఖ్యంగా జపాన్ దేశంలో ఎంతో పరిశోధన జరుగుతోంది. మన ఇండియాలో కూడా వీటిపై పరిశోధనలు బాగానే వేగం పుంజుకుంటున్నాయి.

**- సి.వి. సర్వేశ్వర శర్మ**

పిల్లల మెరుగైన జీవనానికి, అభివృద్ధికి, పెరుగుదలకు పారిశుధ్యం, ఆరోగ్యం ప్రముఖపాత్ర వహిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే, దాదాపు 260 కోట్ల మందికి పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులో లేవు. అందులో 98 కోట్ల మంది 18 సం॥రాల వయసు లోపలి చిన్నారులే.



# జాతీయ అభివృద్ధిలో పిల్లల పారిశుధ్యం ఆవశ్యకత

అరికట్ట గలిగిన రోగాలు / జబ్బుల బారినపడి లక్షల మంది చిన్నారులు ప్రతి సం॥రం చనిపోతున్నారు. పారిశుధ్యం అందుబాటులో లేకపోవడం వలన కలిగే దుష్పరిణామాల ఫలితాలను విశ్లేషించుకుందాం.

| క్ర. సం. | పాఠశాలలో పారిశుధ్యం అందుబాటులో లేకపోవడం వలన ఫలితాలు | పాఠశాలలో పారిశుధ్యం అందుబాటులో ఉండడం వలన ఫలితాలు |
|---|---|---|
| 1. | పిల్లలు జబ్బులబారిన పడడం | రోగ నిరోధక శక్తి పెరగడం |
| 2. | డయేరియా వలన మరణాలు | పిల్లల మరణాల రేటు తగ్గడం |
| 3. | అపరిశుభ్ర పరిసరాలు | పరిశుభ్రమైన పరిసరాలు |
| 4. | కలుషిత త్రాగునీరు, కలుషిత ఆహారం | నాణ్యమైనత్రాగునీరు, ఆహారం అందుబాటులోనికి రావడం |
| 5. | పోషకాహార లేమి | మంచి పౌష్టిక ఆహారం తీసుకోవడం |
| 6. | బడికి హాజరు శాతం తగ్గడం, నేర్చుకునే విద్యలో వెనుకబాటుతనం | రోజూ బడికి హాజరు కావడం వల్ల మంచి విద్యను అభ్యసించగలగడం |
| 7. | బాలికలకు గోప్యత లేక ఆత్మ గౌరవం దెబ్బతినడం, మధ్యలోనే బడి మాని వేయడం | గోప్యత, గౌరవం (కిశోర బాలికలకు) పెరగడం జరుగుతుంది |
| 8. | పారిశుధ్యం, ఆరోగ్యం పట్ల కనీస అవగాహన లేకపోవడం. | పారిశుధ్యం, ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండడం |

అందుకే పిల్లలకు పారిశుధ్య సౌకర్యాల కల్పన అంటే కేవలం వారి వారి ఇండ్లలోనే కాదు, వారు విద్యనభ్యసించే బడిలో కూడా వారికి క్రింది వసతులు అందుబాటులోనికి తేవాలి.

- నాణ్యమైన తాగు నీటి వసతి
- మల, మూత్ర విసర్జనకు వీలుగా మరుగుదొడ్లు కల్పించడం
- చేతులు శుభ్రపరుచుకొనేందుకు వీలుగా ఫ్లాట్‌ఫాం, సబ్బు అందుబాటులోనికి తేవాలి.

### పాఠశాలలలో మరుగుదొడ్ల పరిస్థితి

2010 సం॥రం నాటికి డిఐఎస్‌ఇ నివేదిక ఆధారంగా 89 శాతం ప్రభుత్వ పాఠశాలలలో మరుగుదొడ్లు అందుబాటులో ఉండగా, అందులో కేవలం 26% మాత్రమే ఉపయోగించడానికి వీలుగా ఉన్నాయి. అదే బాలికల మరుగుదొడ్ల విషయానికి వస్తే 28% ఉపయోగించడానికి వీలైన స్థితిలో ఉన్నాయి.

**ఈ పరిస్థితిని మార్చాలంటే :**

- ఉన్న మరుగుదొడ్లన్నీ వాడకానికి వీలుగా తీసుకురావాలి.
- ప్రభుత్వ పాఠశాలలలో మరుగుదొడ్లు 100 శాతం అందుబాటులో ఉండాలి.

ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాజీవ్ విద్యామిషన్ (సర్వ శిక్షా అభియాన్) తగు చర్యలు చేపట్టాయి. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం.

## పాఠశాలలలో పారిశుధ్య సౌకర్యాల మెరుగుదల దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలు

**1. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలలో పాఠశాల పారిశుద్ధ్యంపై టాస్కు పోర్సుల ఏర్పాటు**

ప్రతి బిడ్డకు ఉచిత విద్య ఎలా ఒక హక్కుగా పరిగణిస్తూ 2009లో చట్టం చేశారో, అలాగే ప్రభుత్వ ఉత్తర్వు 405, తేది: 1.08.2012 మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలలో చదువుకొంటున్న చిన్నారులకు త్రాగునీరు, పారిశుధ్య సౌకర్యాల కల్పన కూడా ఒక హక్కుగా గుర్తించాలి. ఇందుకుగాను అవసరమైన కొత్త నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్వహణ ఓ పద్ధతి ప్రకారం, నిరంతరం జరిగేలా ఓ ఖచ్చితమైన 'చర్యా ప్రణాళిక'లను తయారు చేయడం అవసరం.

రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో నీరు, పారిశుధ్య సౌకర్యాల కల్పనలో రాజీవ్ విద్యామిషన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్, మున్సిపల్ పరిపాలనా శాఖ, గ్రామీణ నీరు మరియు పారిశుధ్య శాఖ, ఇతర సంబంధిత శాఖలు / ఏజెన్సీలు, ప్రత్యక్షంగా పని చేస్తున్నాయి. ఈ పరంగా వివిధ శాఖల మధ్య సమన్వయం, సమ్మిళిత కార్యక్రమాల అవసరం ఉంది.

ఇందుకై రాష్ట్ర, జిల్లా స్థాయిలలో టాస్క్ పోర్స్ కమిటీలను ఏర్పాటు చేశారు.

**రాష్ట్రస్థాయిలో పాఠశాల పారిశుధ్యంపై టాస్క్‌పోర్స్ కమిటీ :**

రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరు, రాజీవ్ విద్యామిషన్ (సర్వశిక్షా అభియాన్) చైర్మన్‌గా, ప్రభుత్వ ఉప కార్యదర్శి (పి.ఇ. అండ్ యస్.యస్.ఎ) ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ డైరెక్టర్, యన్.డబ్ల్యు.యన్.యం. ప్రాజెక్టు డైరెక్టరు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లోని పారిశుధ్యం - ఆరోగ్య రీజినల్ డైరెక్టర్, యస్.యస్.ఎ. లోని రాష్ట్ర కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్, జాతీయ ఉపాధి హామీ పథకం డైరెక్టరు గా ఉంటారు.

**జిల్లా స్థాయిలో పాఠశాల పారిశుధ్యంపై టాస్క్‌పోర్స్ కమిటీ :**

జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డి.ఇ.ఓ. యస్.యస్.ఎ. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, గ్రామ నీరు మరియు పారిశుద్ధ్య శాఖ సూపరింటెండింగ్ ఇంజనీరు, జిల్లా పంచాయితీ అధికారి, మున్సిపాలిటీ ఇంజనీరు, ఆర్.ఎస్.ఎ. ఇంజనీరు, యన్.ఆర్.ఇ.జి.ఎ. డైరెక్టర్లు మెంబర్లుగా, యస్.యస్.ఎ. ప్రాజెక్టు డైరెక్టరు మెంబరు కన్వీనర్‌గా ఉంటారు.

రాష్ట్రస్థాయి / జిల్లా స్థాయి టాస్క్‌పోర్స్ ఏర్పాటుతో పాటు వాటికి విధులు, బాధ్యతలను నిర్ణయించారు.

**రాష్ట్రస్థాయి టాస్క్‌పోర్స్ బాధ్యతలు, విధులు :**

- రాష్ట్ర స్థాయి వార్షిక పని ప్రణాళికను తయారు చేయడం
- వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించడం.
- పాఠశాల పారిశుధ్య ప్రణాళిక అమలుకు నిధులు మంజూరు, వ్యయ అంశాలపై సమీక్షల నిర్వహణ
- జిల్లాల వారీ ప్రత్యేక సమస్యలను, లోటుపాట్ల ను గుర్తించడం, వాటిని పరిష్కరించడానికి కావలసిన ఆదేశాలను జిల్లాలకు పంపించేలా చూడడం.
- సంయుక్త క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించడం ద్వారా పాఠశాలలలోని సౌకర్యాలు వాడుకలోనికి వచ్చేలా సమీక్షలు నిర్వహించడం.
- అన్ని జిల్లాలకు అవసరమగు నిధులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం.
- పాఠశాల పారిశుధ్యం అంశాలపై పిల్లల నుండి వచ్చే హెల్ప్‌లైన్ కాల్స్ ఆధారంగా విధాన నిర్ణయాలు తీసుకోవడం.
- అన్ని జిల్లాలలో పాఠశాలల్లోని పారిశుధ్య సౌకర్యాలు మెరుగయ్యేందుకు అక్కడి ప్రైవేటు, సివిల్ సొసైటీల సహకారం పొందడం.
- జిల్లా అవార్డ్ కమిటీల ద్వారా పాఠశాల పారిశుధ్య అవార్డ్ స్కీము అమలయ్యేలా పర్యవేక్షణ.
- క్షేత్ర స్థాయి సందర్శనలు (ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు) ద్వారా (పాఠశాల పారిశుధ్యంపై) వినూత్న మోడల్స్‌ను చూడడం, నేర్చుకోవడం.

***జిల్లా స్థాయిలో రాష్ట్ర స్థాయి టాస్క్‌పోర్స్‌లు ఎలాంటి విధులు, బాధ్యతలను కలిగిఉంటాయో జిల్లా పరంగా జిల్లా స్థాయి టాస్క్‌పోర్స్‌లు అట్టి విధులనే కలిగి ఉంటాయి.***

**2. మరుగుదొడ్ల మరమ్మత్తులకు తగు ఉత్తర్వుల జారీ :**

ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు ఉండీ, చిన్నపాటి మరమ్మత్తుల కారణంగా వాడకానికి వీలుకాకుండా మరుగుదొడ్లను వాడకానికి అనువుగా మార్చేందుకు వీలుగా రాజీవ్ విద్యామిషన్ (సర్వ శిక్షా అభియాన్) 4. 06.2012 తేదీన మెమోను జారీ చేసింది. ఆ మేరకు జిల్లాలోని ప్రాజెక్టు ఆఫీసర్ మరియు రాజీవ్ విద్యామిషన్ ఇంజనీరు వారి జిల్లా కలెక్టరు మరియు రాజీవ్ విద్యామిషన్ చైర్మన్ వారి పరిపాలనా ఆమోదంతో రూ॥ 10,000/- (పదివేలు) మేరకు పనులను నామినేషన్ ప్రాతిపదికన చేపట్టవచ్చును.

**3. మరుగుదొడ్ల నిర్వహణకు కావలసిన సామగ్రిని సమకూర్చుకోవడం :**

పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణకు అవసరమయ్యే సామగ్రిని

సమకూర్చుకొనే విషయంలో ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీలు, వారి నిర్వహణా నిధుల నుండి క్రింది మెటీరియల్‌ను సమకూర్చుకోవచ్చు.

ప్రాథమిక పాఠశాలలు సమకూర్చుకోవలసిన సామగ్రి


| | | |
|---|---|---|
| • పది లీటర్ల సామర్థ్యం గల ప్లాస్టిక్ బక్కెట్లు | 2 ... | రూ॥ 50-100 |
| • 2 లీటర్ల సామర్థ్యం గల ప్లాస్టిక్ | 2 ... | రూ॥ 20-40 |
| • మగ్గులు | 2 ... | రూ॥ 10-20 |
| • కొబ్బరి ఈనెల చీపురు | 2 ... | రూ॥ 22-44 |
| • సబ్బులు (100 గ్రాములవి) | 4 ... | రూ॥ 18-72 |
| • ఫినాయిల్ | 2 ...లీటర్లు | రూ॥ 15-30 |
| **మొత్తం** | | **రూ॥ 306** |

ప్రాథమికోన్నత పాఠశాలలు సమకూర్చుకోవలసిన సామాగ్రి

| | | | |
|---|---|---|---|
| 10 లీటర్ల ప్లాస్టిక్ బక్కెట్లు | 4×50 | రూ॥ | 200 |
| 2 లీటర్ల ప్లాస్టిక్ బక్కెట్లు | 2×20 | రూ॥ | 40 |
| మగ్గులు | 4×10 | రూ॥ | 40 |
| కొబ్బరి ఈనెల చీపుర్లు | 4×22 | రూ॥ | 88 |
| సబ్బులు (100 గ్రా) | 6×18 | రూ॥ | 108 |
| ఫినాయిల్ | 4(లీటర్లు)×15 | రూ॥ | 60 |
| **మొత్తం** | | **రూ॥** | **536** |

**4. స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసి) ల ఏర్పాటు :**

విద్యార్థుల తల్లిదండ్రులు / సంరక్షకులు పాఠశాల నిర్వహణ కమిటీని ఎన్నుకుంటారు. ప్రతి తరగతిలోని విద్యార్థుల తల్లిదండ్రులు చేయి ఎత్తడం / ఓటు వేయడం / నోటితో చెప్పడం ద్వారా ఆరుగురు తల్లిదండ్రులను ఎన్నుకుంటారు.




**ఎంపిక విధానం**

- జనరల్ కేటగిరీ నుండి ఇద్దరు తల్లిదండ్రులు
- యస్.టి. యస్.సి. బి.సి. లు, మైనారిటీల నుండి ప్రతి కేటగిరీ నుండి ఒకరిని ఎన్నుకోవాలి.

| | |
|---|---|
| ప్రాథమిక పాఠశాల అయితే<br>(ఒక్క తరగతి నుండి 6 గురు తల్లిదండ్రులు చొప్పున) | 30 |
| ప్రాథమికోన్నత పాఠశాల<br>(ఒక్క తరగతి నుండి 6 గురు తల్లిదండ్రులు చొప్పున) | 42 |
| ప్రాథమికోన్నత పాఠశాల, (8వ తరగతి కూడా ఉంటే) (8×6)<br>(ఒక్క తరగతి నుండి 6 గురు తల్లిదండ్రులు చొప్పున) | 48 |
| హైస్కూలు (5×6)<br>(ఒక్క తరగతి నుండి 6 గురు తల్లిదండ్రులు చొప్పున) | 30 |

ఒకవేళ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 30 కన్నా తక్కువ ఉంటే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు స్కూలు మేనేజిమెంట్ కమిటీలో సభ్యులే. స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీకి మెంబరు కన్వీనర్‌గా హెడ్ టీచర్ / ఇన్‌చార్జి హెడ్ టీచర్ వ్యవహరిస్తారు. పాఠశాల ఏ ప్రాంతంలో ఉందో, ఆ ప్రాంతపు వార్డు మెంబరు కూడా స్కూలు మేనేజ్‌మెంట్ కమిటి సభ్యులే. ప్రతి పిల్ల వాని తల్లిదండ్రులకు కమిటీ ఎన్నిక గురించిన సమాచారాన్ని వ్రాత పూర్వకంగా పంపాలి. అలాగే కనీసం 50% తగ్గకుండా తల్లి తండ్రులు హాజరైతేనే ఎన్నికలు నిర్వహించాలి.

పాఠశాల పరిసరాలలో ఉన్న విద్యావంతులు / పాఠశాలకు మంచి మద్దతునిచ్చే చుట్టుపక్కల వారు / యన్.జి.ఓ / లను కూడా కో - ఆప్టెడ్ మెంబర్‌గా నామినేట్ చేయవచ్చు. అంగన్‌వాడీ వర్కర్, ఎ.ఎన్.ఎం., ప్రాంతీయ సంస్థ ప్రతినిధులు, చురుకైన ఇద్దరు విద్యార్థులు (కో - ఎడ్యుకేషన్ స్కూలు అయితే ఒక బాలిక, ఒక బాలుడు) ఈ కమిటీలో ప్రత్యేక, ఆహ్వానితులుగా ఉంటారు.

**5. మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుదలకు సన్నాహాలు :**

పాఠశాలల్లో మరుగుదొడ్లు వాడుకలోనికి రాకపోవడానికి ప్రధాన కారణం వాటిని నిర్వహించేవారు లేకపోవడం. నిర్మల్ భారత్ అభిమాన్‌లో పేర్కొన్నట్లు నిర్వహణ బాధ్యతలను, వాటి కయ్యే నిధులను విద్యాశాఖ సమకూర్చుకొని ముందుకు సాగాలి. అందుకు ప్రతి పాఠశాలకు ఓ వ్యక్తి చొప్పున ఈ బాధ్యతలను కేటాయించాలి.

అప్పుడు పాఠశాల పారిశుధ్యం మాటలకే కాదు చేతలకు కూడా సాధ్యమౌతుంది. మన చిన్నారుల భవిష్యత్‌కు మంచి బాటను వేసిన వారవుతాము. ఫలితంగా దేశం అభివృద్ధిలో ముందుంటుంది.

**- పిన్నింటి మాధురి, ఫాకల్టీ, అపార్డ్**



# ఎండలో తిరగొద్దు



వడదెబ్బ నివారణకు వీలైనంత వరకు ఎండలో తిరగవద్దని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా... గత కొద్ది రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నమోదవుతున్న ఎండ తీవ్రత పరిశీలిస్తే. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట తిరగకుండా ఉండడం మంచిదంటున్నారు. ఉద్యోగులు, కూలీపనులు చేసుకునేవారు తల, ముఖానికి వేడిగాలులు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు మంచినీళ్లు, తెలిగ్గా జీర్ణమయ్యేవి ఆహారంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. శరీర సాధారణ ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్ కాగా వడదెబ్బకు గురైనవారిలో శరీర ఉష్ణోగ్రత 110 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు పెరిగే అవకాశం ఉంది. అధిక వేడికి మనిషి శరీరంలోని ఉష్ణోగ్రత నియంత్రణ కేంద్రం దెబ్బతింటుంది. ఉష్ణోగ్రత నియంత్రణ చేయలేదు. అధికవేడికి శరీరంలోని లవణజలాలు ఆవిరి అయిపోతాయి. దీంతో శరీరం నీరసించి, వడలిపోయి, పాడిబారి పోతుందని వైద్యరంగ నిపుణులు చెబుతున్నారు. కనీసం 250 మి.లీ. (పావు లీటరు) నీళ్లు తాగాలి.

- నీళ్లు తాగుతున్నా దప్పిక తీరకుండా ఉంటే నిమ్మరసం, కొద్దిగా ఉప్పు కలిపి తాగడం మంచిది.
- చెమట ఎక్కువగా పడుతుంటే, నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- నూనె, కొవ్వుతో కూడిన ఆహారపదార్థాలు వీలైనంత వరకు తగ్గించాలి.
- తేలికగా జీర్ణమయ్యే ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి.
- ఎండలో నుండి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు తీసుకోకూడదు.

వేసవికాలం వేడిగాలుల్లో తిరిగే వారి శరీరం నుంచి రోజుకు రెండు లీటర్ల ద్రవాలు ఆవిరి అయిపోతాయి. అవి సకాలంలో భర్తీ కాకపోవడంవల్ల సొమ్మసిల్లి పడిపోతారు. మెదడు, మూత్రపిండాలకు రక్తసరఫరా నిరంతరం జరుగుతుండాలి. ప్రత్యేకించి మెదడుకు 50% గ్లూకోజ్, 20% ఆక్సిజన్ అందుతూ ఉండాలి. ఇందులో ఏ మాత్రం అవరోధం ఏర్పడినా మొత్తం శరీరంపై ప్రభావం చూపుతుంది. మెదడుకు అందాల్సిన ద్రవాలు అందక పోతే చనిపోయే ప్రమాదం ఉంది.

### ఇవీ లక్షణాలు

- త్వరగా నీరసం, చెప్పలేనంత అలసట.
- తలనొప్పి, తలతిరగడం, కడుపులో తిప్పడం, వాంతి లక్షణాలు.
- నీళ్లు తాగుతున్నా... చెమట పట్టకపోవడం.
- మూత్రం పసుపు రంగులో ఉండి, మంటగా రావడం.
- లేచి నిలబడడానికి శక్తి లేకపోవడం. సొమ్మసిల్లి పోవడం.
- ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఆరుబయట ఎక్కువ శారీరకశ్రమతో కూడిన పనులు చేయరాదు.
- మద్యం సేవించడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. వీలైనంత వరకు తీసుకోకుండా ఉంటే మంచిది.

### చికిత్స

- వడదెబ్బ సోకిన వ్యక్తిని చల్లని నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలి.
- దుస్తులు వదులు చేసి, చల్లటి నీటితో తడిగుడ్డతో పలుమార్లు తుడవాలి.
- శరీరంపై చల్లని నీళ్లు చిలకరించి.. ఫ్యానుకిందకు చేర్చాలి. లేదంటే విసనకర్రతో గాలి తగిలేటట్లు విసరాలి.
- ఎక్కువగా ద్రవపదార్థాలు ఇవ్వాలి.
- స్పృహ కోల్పోయిన వారికి నోటి ద్వారా పానీయాలు ఇవ్వకూడదు.
- వీలైనంత త్వరగా ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలి.
- అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు ఐ.వి.డ్రిప్ వెంటనే పెట్టాలి.
- 24 గంటలకు ఒకసారి కూడా మూత్రం రాకపోతే, వైద్యుడిని సంప్రదించాలి.
- ఎండలో ఎక్కువగా తిరగరాదు.
- నీరు, ద్రవపదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. దీనివల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడుకోవచ్చు.
- వేసవికాలంలో నలుపురంగు. మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. వదులుగా ఉండే నూలు దుస్తులు వేసుకోవాలి.
- తలకు టోపీ, రుమాలు చుట్టుకోవాలి. ద్విచ క్రవాహనాలపై ప్రయాణించేవారు ముఖానికి గుడ్డ కట్టుకోవడం మంచిది.
- ఎండలో తిరిగేవారు ప్రతి గంటకు ఒకసారి.

ఎండల్లో తిరిగే వారు నీరు ఎక్కువగా తాగడం వల్ల వడదెబ్బకు గురికాకుండా నివారించడానికి వీలవుతుందని ప్రజారోగ్య కుటుంబసంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ అరుణకుమారి చెప్పారు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీర ఉష్ణోగ్రత 110 డిగ్రీల ఫారెన్‌హీట్‌కు పెరిగే అవకాశం ఉంటుందని, ఇది ప్రాణాంతకమని తెలిపారు. వడదెబ్బ నివారణకు మధ్యాహ్నం ఎండల్లో వీలైనంతవరకు తిరగకుండా ఉండాలని సూచించారు.

**ఆదారం: వార్తా పత్రికలు**

# గోరుచిక్కుడుతో ఎన్నో ఉపయోగాలు

**గోరు చిక్కుడు - దీనినే వివిధ ప్రాంతాలలో వేరు వేరు పేర్లతో పిలుస్తారు. తెలంగాణాలో గోకరకాయని, రాయలసీమ ప్రాంతాల్లో మటిక్కాయని, కోస్తాలో గోరుచిక్కుడుగా పిలుస్తూ వుంటారు. దీనిని ఆంగ్లంలో 'క్లస్టర్ బీన్' అని, హిందీలో 'గౌర్' అని పిలుస్తూ వుంటారు.**

పేదవారి ఆహారంగా పిలువబడే ఈ గోరుచిక్కుడు అత్యంత బలవర్ధకమైన ఆహారంగా పరిగణించవచ్చు. ముఖ్యంగా ఇది మనిషికి కావలసిన నాణ్యమైన మాంసకృత్తులే కాకుండా, ఇనుము, విటమిన్లు, కాల్షియం అందచేస్తుంది. ఏ ఇతర కూరగాయలతోను చేయలేనన్ని రకాల కూరలు దీనితో తయారు చేసుకోవచ్చును. కూరగాను, వేపుడుగాను, ఒరుగులుగాను, మాంసంతో కలిపి, ఇతర కూరగాయలతో కలిపి, ఆకు కూరలతో కలిపి రక రకాల వంటకాలు తయారు చేసుకోవడానికి అనువైన కూరగాయ. వీటి గింజలు నూరి తయారు చేసే జిగురును బట్టలు, పేపర్, నూనె, సౌందర్య సాధన పరిశ్రమలలో వాడ్తారు.



గుబురుగా పెరిగే కొన్ని రకాలు పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసుకోవడానికి కాయ కోసిన తరువాత మోళ్ళను పశువుల మేతగా కూడా ఉపయోగించవచ్చు.

ఇన్ని రకాల ఉపయోగాలున్నప్పటికీ, ఈ పంటల ఉత్పత్తుల సామర్థ్యాన్ని మనదేశంలో పూర్తిగా వినియోగించుకోవడం లేదు. కాని గత కొన్ని సంవత్సరాలుగా 'గౌర్ గమ్' అంటే నాణ్యమైన జిగురును ఉత్పత్తి చేసే గోరుచిక్కుడు రకాలను గుర్తించడం జరిగింది. ఈ రకాల నుంచి ఉత్పత్తయిన జిగురులు పెట్రోలియం, మైనింగ్, విస్ఫోటకాలు, పొటాష్ శుద్ధి చేయడంలోను, ఫొటోగ్రఫీ, పొగాకు ఉత్పత్తులలోను మరియు ఆహార పదార్థాల తయారీలో విరివిగా ఉపయోగించడానికి అనువైనవి.

ఆహార పదార్థాల పరిశ్రమలైన బేకరీ ఉత్పత్తులు అంటే ఐస్క్రీమ్‌లు, లాలీపాప్, జెల్లీస్, పాశ్చాత్య దేశాలతో విరివిగా వాడే మాంసాహార ఉత్పత్తులు, చీస్ లాంటి వాటిల్లో కూడా ఉపయోగపడుతుంది.



అమెరికా, జపాన్, దక్షిణ ఆఫ్రికా, చైనా మరియు ఐరోపా దేశాలకు ఎగుమతి చేయటానికి మంచి అవకాశం వున్నందున నాణ్యమైన ఎగుమతికి అనువైన జిగురు ఉత్పత్తి కోసం ఈ పంటసాగు చేసేటప్పుడు కొన్ని మెళకువలు పాటించాలి.

## గౌర్ గమ్ సాగు మెళకువలు

*వాతావరణం :* మన రాష్ట్రంలోని వివిధ శీతోష్ణ పరిస్థితులలో ఈ పంటను సాగు చేసుకోవచ్చు. శీతాకాలంలో ఉష్ణోగ్రత 150సె. కన్నా తక్కువున్న ప్రాంతాలలో పెరుగుదల సరిగా వుండదు. ఈ పంటను వర్షాధారంగా సాగు చేసినప్పుడే మంచి నాణ్యమైన పంట తీసుకోవచ్చును. పంట కాలంలో 400-500 మి.మీ. వర్షపాతం ఉన్నప్పుడు మంచి దిగుబడి పొందవచ్చును. ఎక్కువ వర్షాలు పడినప్పుడు మొక్క ఎక్కువగా పెరగడమే కాకుండా దిగుబడి మరియు నాణ్యత తగ్గిపోతుంది. కోత సమయంలో వర్షాలు పడితే గింజ నల్లబడి నాణ్యత తగ్గిపోతుంది.

*నేలలు :* మురుగు నీరు పోయే వసతి వున్న అన్ని రకాలైన నేలల్లోను, ముఖ్యంగా ఇసుకతో కూడిన గరప నేలలు అనుకూలం. పిహెచ్ 6-7 వుండాలి. నీరు నిలిచే బంక నేలలు మరియు చౌడు భూములు ఈ పంట సాగుకు పనికిరావు.

*రకాలు :* జిగురు కోసం పండించే గోరుచిక్కుడులో చాలా రకాలు ఉన్నప్పటికీ, రాజస్థాన్‌లో రూపొందించబడిన ఆర్.జి.సి. 936, ఆర్‌జిసి 1066, హర్యానాలో రూపొందించిన హెచ్‌జి 365 రకాలు మన రాష్ట్రంలో పండించడానికి అనువైనవి.

*నేల తయారీ :* భూమిని 3-4 సార్లు బాగా దున్ని చదును చేయడం వలన నీరు భూమిలో ఇంకి మంచి దిగుబడి వస్తుంది. మంచి పదును అయిన తరువాతనే విత్తుకోవాలి.

*విత్తు సమయం :* తక్కువ కాలపరిమితి రకాలను జూన్ రెండవ పక్షం, మధ్య కాలపరిమితి రకాలను జూలై మొదటి పక్షంలో విత్తుకోవాలి. ఆలస్యంగా విత్తినపుడు దిగుబడులు తగ్గుతాయి.

*విత్తడం :* తక్కువ కొమ్మలున్న తక్కువ కాల పరిమితి రకాలలో విత్తుకొనేటప్పుడు వరుసకు వరుసకు మధ్య 30 సెం.మీ. మొక్కకు మొక్కకు మధ్య 15 సెం.మీ., అలాగే అధిక కొమ్మలు వచ్చే మధ్యకాలిక రకాలలో వరుసకు వరుసకు మధ్య 45 సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య 15-20 సెం.మీ. ఉండేటట్లు నాటు కోవాలి.

*విత్తన మోతాదు :* విత్తే రకం, గింజ పరిమాణం, విత్తే సమయం, నేల స్వభావాన్ని బట్టి ఎకరానికి 6-8 కి విత్తనాన్ని విత్తుకోవాలి.

# రైతు బజార్లకు మరింత బలం చేకూర్చాలి



**రైతు బజార్లను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్ది రైతులకు లాభకరమైన రీతిలో తీర్చిదిద్దవలసిన అవసరం ఉందని అపార్డ్ అప్పటి కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్. అన్నారు.ఆయన 29.4.2013న రెండు రోజుల వర్క్‌షాప్‌ను రైతు బజార్ల సామర్థ్యం పెంపు నూతన గుర్తింపు అనే అంశంపై శిక్షణను ప్రారంభించారు.**

నేటి పరిస్థితులలో రైతులు ఎన్నో క్లిష్టమైన సమస్యలను ఎదుర్కొని పండిస్తున్న పంటకు తగిన ధరలు లభించేట్లు చూడవలసిన అవసరం ఉందని అన్నారు. రైతుకు బ్రహ్మాండమైన బాసటగా నిలబడుతున్న రైతుబజార్లను ప్రోత్సహించాలన్నారు. రైతుబజార్లకు ప్రజల్లో ఎంతో ప్రాచుర్యం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో రైతు బజార్ల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎమ్.కె. సింగ్, సి.డి.పి.ఎ., సెంటర్ హెడ్ ప్రొ॥ సూర్యనారాయణరెడ్డి మరియు ఆయా రైతు బజార్ల నిర్వాహకులు పాల్గొన్నారు. ◆

*విత్తనశుద్ధి :* ఈ పంట పప్పుదినుసు కోవకు చెందినది. కాబట్టి గాలిలోని నత్రజనిని భూమిలో స్థిరీకరించే వేరుబుడిపెల సంఖ్యను పెంచడానికి రైజోబియం కల్చర్‌తో విత్తనశుద్ధి చేయాలి. ఎకరాకు 200 గ్రా. కల్చర్ సరిపోతుంది.



*ఎరువులు :* గమ్ గౌర్ పంటను వర్షాధారంగా పండించేటపుడు ఎకరానికి 8-10 టన్నుల పశువుల ఎరువు మరియు 6-8 కిలోల నత్రజని, 12-16 కిలోల భాస్వరం, 8 కిలోల సల్ఫరు, 10 కిలోల జింకు సల్ఫేట్ వేసుకోవాలి. జింకు సల్ఫేట్ దుక్కిలో వేయలేని పక్షంలో మొక్క 4-6 వారాల వయసున్నపుడు లీటరు నీటికి 5 గ్రా. జింకు సల్ఫేట్ కలిపి పిచికారి చేసుకోవాలి.

*కలుపు నివారణ :* కలుపు మొక్కలు భూమిలోని తేమ మరియు పోషకాలకు పోటీ పడడం వలన పంట దిగుబడుల పై గణనీయమైన ప్రభావం చూపుతుంది. కాబట్టి విత్తడానికి ముందే బాసలిన్ అనే కలుపు మందును తేలిక భూముల్లో అయితే ఎకరానికి 400 గ్రా. అదే బరువు నేలల్లో అయితే 600 గ్రా., 200 లీటర్ల నీటితో కలిపి భూమిపై పిచికారి చేసి, కలియదున్నిన తరువాత విత్తుకోవాలి. పైపాటుగా వచ్చే కలుపు నివారణకు 25-30 రోజులకు ఒకసారి 40-45 రోజులపుడు అంతర కృషి చేయాలి.

*నీటి తడులు :* లోతైన వేరు వ్యవస్థ వున్న కారణంగా తక్కువ వర్షపాత ప్రాంతాలలో ఈ పంట బాగా వస్తుంది. పూత గింజ దశలో బెట్ట లేకుండ జాగ్రత్త పడాలి. గింజ ఏర్పడే దశలో అవసరమైతే ఒక తడి పెట్టుకోవచ్చును. కాని పంట ఎదుగుదల దశలో ఎటువంటి నీటి తడులు ఇవ్వరాదు.

*పంట కోత :* తక్కువ కాల పరిమితి రకాలు 85-90 రోజులలోను, మధ్యకాలిక రకాలు 110-120 రోజులకు కోతకొస్తాయి. తేలిక భూముల్లో త్వరగా కోత కొస్తాయి. కోత ఆలస్యం చేసినట్లైతే కాయలు పగిలి గింజలు రాలి పోతాయి. కాయలను ఆరబెట్టి కర్రలతో కొట్టి కాని, నూర్పిడి యంత్రంలో వేసి కాని విత్తనాన్ని వేరు చేయాలి.

మన రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లాలో పూర్తి వర్షాధారంగా పండించినపుడు ఎకరానికి (2.5-3) క్వింటాళ్ల దిగుబడి వస్తున్నది. ప్రస్తుతం దీని ధర క్వింటాలు రూ. 8000-9000 ఉన్నది. ధరలో వ్యత్యాసాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. సాగు ఖర్చు చాలా తక్కువగా వుంటుంది. కనుక మంచి ధర లభించినపుడు అధిక నికరాదాయం పొందడానికవకాశం వుంటుంది.

గమ్ గౌర్ విత్తనం కోసం పంట పండించే ముందుగానే మార్కెటింగ్ సౌకర్యాన్ని చూసుకొని, కొనుగోలు దారులతో ఒప్పందం చేసుకుంటే మంచిది.

*- ఆర్. సుధాకర్ రెడ్డి*
*- డా॥ వి. అనిత*
*ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్,*
*ఎ.ఆర్.ఐ, రాజేంద్రనగర్*



# పేదల జీవనోపాధి పెంపుదలకు సమగ్ర వాటర్‌షెడ్ యాజమాన్య కార్యక్రమం

### కార్యక్రమ లక్ష్యం

భూమి లేని, లేదా భూమి ఉన్నా వనరులు లేని పేద ప్రజల జీవనోపాధులను పెంపొందించటం.

సామర్థ్యం మేరకు దిగుబడి ఇవ్వని భూముల ఉత్పాదకతను, భూసార సంరక్షణ, నీటి సంరక్షణ, పచ్చదనం అభివృద్ధి వంటి సమగ్ర చర్యలను వాటర్‌షెడ్ కార్యక్రమంలో చేపడతారు.

### వాటర్ షెడ్

వాటర్ షెడ్ అంటే నీటి పరివాహక ప్రాంతం. ఎత్తైన ప్రదేశంలో పడిన వర్షపు నీరు చిన్న చిన్నవాగులు, వంకల ద్వారా పల్లానికి ప్రవహిస్తూ ఒకే మార్గం ద్వారా బయటకు వెళ్ళే ప్రాంతాలన్నింటినీ కలిపి వాటర్‌షెడ్ అంటారు.

### వాటర్‌షెడ్ ఆవశ్యకత

పేదరికం, నీటికొరత, భూగర్భ జలమట్టాలు వేగంగా అంతరించిపోవడం, గాలి, నీరు ద్వారా నేలకోత జరుగుతూ భూమి క్షీణతకు గురికావడం, వర్షపాతాన్ని చాలా తక్కువ సామర్థ్యంలో వినియోగించడం, పశుగ్రాస కొరత తీవ్రంగా ఉండడం, పశుజీవాల ఉత్పాదకత చాలా తక్కువగా ఉండడం, మౌలిక సదుపాయాలు తగినంతగా లేకపోవడం వంటి సమస్యలను అధికమించడానికి, ప్రజల ఆర్థిక సామాజిక స్థితిగతులను మెరుగుపరచడానికి వాటర్‌షెడ్‌లు ఉపయోగపడతాయి.



### వాటర్ షెడ్ పథకాలను ఎంపిక చేయటానికి ప్రామాణికాలు

- తీవ్ర త్రాగునీటి కొరత
- భూగర్భ జల వనరులను అధికంగా ఉపయోగించడం
- బంజరు భూములు / క్షీణతకు గురయిన భూములు ఎక్కువగా ఉండటం.
- పథకం క్రింద ఉన్న ప్రాంతం ఆధారపడదగిన సాగునీటి వనరుల క్రింద ఉండకూడదు.
- భూమి ఉత్పాదక శక్తి
- షెడ్యూలు కులాలు / తెగల నిష్పత్తి
- ప్రజల భాగస్వామ్యం
- పేదల నిష్పత్తి

### వాటర్ షెడ్ ఉద్దేశ్యాలు

- నేల, నీరు, వృక్షసంపదలను సక్రమంగా వినియోగించటం.
- పేదల వ్యక్తిగత భూములు, పశువులు, పండ్లతోటలు, చేపల పెంపకం వంటి వాటిలో ఉత్పాదకత పెంపొందించడం.
- పేదల ప్రస్తుత జీవనోపాధులను మెరుగుపర్చుకోవడం, కొత్త జీవనోపాధి అవకాశాలను సృష్టించి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల ను మెరుగుపరచటం.
- స్థానిక, సంప్రదాయ విజ్ఞానానికి ప్రోత్సాహం.

### సమగ్ర వాటర్‌షెడ్ యాజమాన్య కార్యక్రమం (ఐడబ్ల్యుఎమ్‌పి) నందలి కీలక అంశాలు

- సగటున 1000 -5000 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన కొన్ని గ్రామాల సముదాయాన్ని ఒక యూనిట్‌గా చేపడతారు.
- పథకం అమలు, పర్యవేక్షణ అధికారాలు రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీకి ఉంటాయి.

* రాష్ట్ర, జిల్లా స్థాయిలలో పలురంగాల సాంకేతిక నిపుణులతో కూడిన ప్రత్యేక సంస్థల ఏర్పాటు.
* ప్రాజెక్టు కాలవ్యవధి 4 నుండి 7 సంవత్సరాల వరకు
* వ్యవసాయ ఆధారిత జీవనోపాధుల దృక్పధం
* శాస్త్రీయ పద్ధతిలో ప్రణాళికల తయారీ
* పథకం అమలుతో సంబంధం ఉన్న లబ్ధిదారులు, సిబ్బందికి శిక్షణా సామర్థ్యం పెంపుదల చేపట్టడం.

## సంస్థాగత ఏర్పాట్లు

కేంద్రస్థాయి నోడల్ సంస్థ (కేంద్ర వనరుల శాఖ)
↓
రాష్ట్రస్థాయి నోడల్ సంస్థ (రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ)
↓
జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డిడబ్ల్యుఎమ్ఏ) — జిల్లా జీవనోపాదుల వనరుల కేంద్రం (డిఎల్ఆర్సి)
↓
ప్రాజెక్టు అమలు సంస్థ (డబ్ల్యుసిసి) — క్లస్టర్ జీవనోపాధుల వనరుల కేంద్రం (సిఎల్ఆర్సి)
↓
వాటర్‌షెడ్ కమిటీ → వినియోగదారుల బృందాలు
గ్రామసమాఖ్య → స్వయం సహాయక సంఘాలు

## వాటర్‌షెడ్ అమలు దశలు

*తయారీ దశ (1-2 సంవత్సరాల మధ్య)*

* వాటర్‌షెడ్‌పై అవగాహన కార్యక్రమాలైన కళాజాతాలు, గ్రామసభలు, సంఘ సమావేశాల ద్వారా అవగాహన కల్పించటం.
* లబ్ధిదారులను గుర్తించటం
* వినియోగదారుల బృందాలు, స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయటం
* వాటర్‌షెడ్ కమిటీని ఏర్పాటు చేయడం
* వాటర్‌షెడ్ సిబ్బంది నియామకం
* వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను తయారు చేయటం

*పనులదశ (2-3 సంవత్సరాల మధ్య)*

* ఎత్తు నుండి పల్లపు ప్రాంతాలకు పనులను చేపట్టడం
* భూసార సంరక్షణ పనులను చేపట్టడం
* నీటి సంరక్షణ పనులను చేపట్టడం
* వ్యవసాయ, పశుపోషణ సంబంధిత ఉత్పాదకత పెంపుదల కార్యక్రమాలు చేపట్టడం
* పశుగ్రాసం, పండ్లతోటలు, పచ్చదనం తదితర కార్యక్రమాలు చేపట్టడం
* భూమిలేని నిరుపేదలకు జీవనోపాధులు కల్పించటం



*క్రోడీకరణ దశ (1-2 సంవత్సరాల మధ్య)*

* పూర్తి చేసిన పనులను క్రోడీకరించటం
* ప్రాజెక్టు అనంతరం ఆస్తుల నిర్వహణపై వినియోగదారుల బృందాలు, స్వయం సహాయక బృందాలు, వాటర్‌షెడ్ కమిటీ మొదలైన సంస్థల సామర్థ్యం పెంపుదల కార్యక్రమాలు చేపట్టడం
* విజయవంతమైన వాటర్‌షెడ్ కార్యక్రమాలను కొనసాగించటం.

### నిధుల కేటాయింపు

| క్ర.సం. | అంశం | శాతం |
|---|---|---|
| 1. | పరిపాలన | 10 |
| 2. | పర్యవేక్షణ | 1 |
| 3. | మూల్యాంకనం | 1 |
| 4. | ఎంట్రీ పాయింట్ కార్యక్రమాలు | 4 |
| 5. | సంస్థాగత నిర్మాణం, సామర్థ్యం పెంపుదల | 5 |
| 6. | వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డి.పి.ఆర్) | 1 |
| 7. | వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు (ఎన్.ఆర్.ఎం) | 56 |
| 8. | ఆస్తులు లేని వ్యక్తులకు జీవనోపాధులు | 9 |
| 9. | ఉత్పాదకత పెంపుదల | 10 |
| 10. | కన్సాలిడేషన్ (క్రోడీకరణ) | 3 |
| | **మొత్తం** | **100** |

## వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)

వాటర్‌షెడ్ లక్ష్యాలు, అంతిమ ఫలితాలను సాధించాలంటే వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) తయారీ చాలా కీలక ప్రక్రియ. ఈ నివేదిక వాటర్‌షెడ్ మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ప్రజల భాగస్వామ్యంతో తయారు చేయబడుతుంది. దీనిలో ప్రాజెక్టు వివరాలు, బేస్‌లైన్ సమాచారం, చేపట్టే వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలు (పూర్తి ప్రాజెక్టు కాలపరిమితికి), మ్యాపులు, సంస్థల వివరాలు, ఆశించిన ఫలితాలు పొందు పరచబడతాయి. ఈ నివేదిక వాటర్‌షెడ్ల సక్రమ అమలుకు, డాక్యుమెంటేషన్, పర్యవేక్షణకు దోహదపడుతుంది. ఇందుకుగాను ప్రాజెక్టులో ఒక శాతం నిధులు కేటాయించబడ్డాయి.

## నివేదిక తయారీ విధానం

* లబ్ధిదారుల నుండి వాటర్‌షెడ్ ప్రాథమిక సమాచారం సేకరణ, సంబంధిత శాఖల నుండి ద్వితీయ సమాచార సేకరణ.

* గ్రామస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో వనరులు, గ్రామ స్థితిగతులను గుర్తించి సమాచారం సేకరించడం.
* వినియోగదారులు / స్వయం సహాయక బృందాలు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రాజెక్టు గురించి భాగస్వామ్యంతో సహజవనరుల ఉత్పాదక పెంపుదల, జీవనోపాధి ప్రణాళికలను తయారు చేయడం.
* కుటుంబం వారీగా సామాజిక, ఆర్థిక వివరాలను సర్వే ద్వారా సేకరించి క్రోడీకరించడం.
* రైతువారీగా వారి భూములలో వ్యక్తిగత పనులలో నెట్‌ప్లానింగ్ ద్వారా గుర్తించడం, ఉమ్మడి వనరులలో ప్రజల భాగస్వామ్యంతో పనులను గుర్తించడం.
* ఈ క్రోడీకరించిన ప్రణాళికలను గ్రామసభలో ఆమోదించి జిల్లా కలెక్టర్ వారి ఆమోదం పొందడం.
* ఆమోదం పొందిన నివేదికలను ఐడబ్ల్యుఎమ్‌పి వెబ్‌సైట్ నందు పొందుపరచడం.



## ఎంట్రీ పాయింట్ కార్యక్రమాలు

* ప్రజలకు పథకంపై నమ్మకం కల్గించడానికి ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచడానికి, వాటర్‌షెడ్‌పై అవగాహన కల్పించడానికి వాటర్‌షెడ్ గ్రామంనందు అందరికీ ఉపయోగపడేలా చేపట్టే కార్యక్రమాన్ని ఎంట్రీపాయింట్ కార్యక్రమం అంటారు. దీని కొరకు వాటర్‌షెడ్ నిధులలో 4 శాతం కేటాయించడం.

| చేయదగిన పనులు | | రాజీలేని అంశాలు |
|---|---|---|
| ★ పశు ఆరోగ్యశిబిరాలు | X | ★ తయారీదశలో మాత్రమే ఈ కార్యక్రమం చేపట్టాలి |
| ★ వెనుకబడిన గ్రామంలో సోలార్ వీధి దీపాలు | X | ★ సిమెంట్ సంబంధిత పనులు చేయరాదు. |
| ★ పశువులు, గొర్రెల నీటితొట్టెలు | X | ★ వ్యక్తిగత లబ్ధికూర్చే పనులు చేయరాదు. |
| ★ ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలలో మంచినీటి శుద్ధి ప్లాంటు | X | ★ ఇతర శాఖల ద్వారా చేసే పనులను దీనితో అమలు చేయరాదు. |
| | | ★ గ్రామంలోని ప్రజలందరికీ ఉపయోగపడే పనులను మాత్రమే చేపట్టాలి. |

## సహజవనరుల యాజమాన్యం (ఎన్ఆర్ఎమ్)

క్షీణిస్తున్న సహజవనరులైన భూమి, నీరు, వృక్షసంపదల సంరక్షణ, అభివృద్ధి కొరకు; భూసార సంరక్షణ, భూగర్భజల పెంపుదల, పచ్చదనం, పండ్లతోటల పెరుగుదల కోసం ఇతర సంస్థల సమన్వయంతో ఎత్తైన ప్రాంతం నుండి పల్లపు ప్రాంతానికి వివిధ పనులు చేపట్టబడతాయి. దీని నిమిత్తం 56% నిధులు కేటాయింపబడతాయి.

1. **భూసార సంరక్షణ పనులు**

* విడిరాళ్లకట్టలు X రాక్ ఫిల్‌డ్యామ్‌లు X సంకెన్ పిట్స్
* ఖండిత కందకాలు X ట్రెంచ్ కం బండ్ ప్లాంటేషన్ X రాళ్ళకట్టలు

2. **నీటి సంరక్షణ పనులు**

* ఫారం పాండ్స్ X చిన్న ఊట కుంటలు X ఊటకుంటలు
* చెక్‌వాల్ X చెక్‌డ్యామ్ X భూగర్భ డ్యాం

3. **వన సంరక్షణ / సామాజిక అడవులు, పండ్లతోటల పెంపకం**

* బ్లాక్ ప్లాంటేషన్ X బీడీగుట్టలపై చెట్లు నాటడం
* నర్సరీల పెంపకం X రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటడం
* అగ్ని నిరోధక లైనులుX మట్టికట్టలపై చెట్లు పెంపకం
* పశునిరోధక కందకాలు X మెట్టభూములలో పండ్లతోటల పెంపకం
* చెరువు శిఖంలో చెట్లు నాటడం

4. **పశుగ్రాసం అభివృద్ధి పనులు**

* బహువార్షిక పశుగ్రాస ఉత్పత్తి
* పాతరగడ్డి తయారు చేయుటం
* మేలుజాతి పశుగ్రాస జొన్న, మొక్కజొన్న పెంపకం
* సిల్విపాశ్చర్ (పశుగ్రాస చెట్లు, గడ్డి కలిపి పెంచటం)

## వాటర్‌షెడ్ అభివృద్ధి నిధి

పథకం అమలు క్రమంలో రైతుల వద్ద నుండి 10 నుండి 40% విరాళాలు సేకరించి వాటర్‌షెడ్ అమలు అనంతరం సహజవనరుల ను కాపాడుకోవడానికి వినియోగించాలి.

## ఉత్పాదకత పెంపుదల

వ్యవసాయం మీద ఆధారపడే పేదరైతు కుటుంబాలు తమ బతుకుదెరువులకు జీవనోపాధిగా పశువుల పెంపకానికి కూడా వాటర్‌షెడ్ కార్యక్రమంలో అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. దీనికి గాను వ్యవసాయంతో కలిపి 10 శాతం నిధులు కేటాయించడం జరిగింది.

## చేపట్టే కార్యక్రమాలు

* జీవన ఎరువులు
* నాడెప్ కంపోస్టు పిట
* మేలైన విత్తనాలు
* సాంప్రదాయ ఎరువుల వాడకం
* వేపపిండి
* జిప్సం, జింక్‌సల్ఫేటు
* సమగ్ర సస్యరక్షణ పద్ధతులు
* భూసార పరీక్షలు
* పెరటి తోటలు
* మౌలిక వసతులు (పవర్ స్ప్రేయర్‌లు, గడ్డికోత యంత్రాలు)
* పశు, గొర్రెల పెంపకం, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, మందుల పంపిణీ

★ పాడి పశువులకు 50 % సబ్సిడీపై లవణ మిశ్రమ పంపిణీ

★ కృత్రిమ గర్భధారణ ద్వారా చూలు కట్టించిన గేదెలకు / ఆవులకు చివరి 100 రోజుల సమయంలో 50% సబ్సిడీపై దాణా సరఫరా

★ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన ఆడదూడలకు 50% సబ్సిడీ ద్వారా దాణా సరఫరా

★ పశుబీమల సరఫరా

★ పాలశాతం తెలిపే మీటర్లు

★ కోళ్ళపెంపకం

★ మేలు జాతి కోళ్ళసరఫరా

★ పశుగ్రాసం పెంపకం

★ గొర్రెలకు, మేకలకు లవణ ఇటులకు 50% సబ్సిడీపై సరఫరా



### జీవనోపాధులు

బ్రతకడానికి కావలసిన సామర్థ్యాలు, ఆస్తులు (వనరులు, అనుకూలతలు, అవకాశాలు మొదలైనవి), చేయగలిగిన పనులు, సుస్థిర జీవనోపాధి అనగా ప్రతికూలతలను అధిగమించి విపత్కర పరిస్థితులను తట్టుకొని జీవించే అవకాశాలను మెరుగుపరచడానికి వాటర్‌షెడ్ ప్రాజెక్టులో ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. గ్రామంలోని భూమిలేని నిరుపేదలకు సుస్థిరమైన జీవనోపాధిని సంఘాల ద్వారా కల్పించడానికి 9 శాతం నిధులను కేటాయించడం జరిగింది.

### రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టుల వివరాలు

| సంవత్సరం | ప్రాజెక్టుల సంఖ్య | విస్తీర్ణం (లక్షల హెక్టార్లలో) | బడ్జెట్ (కోట్ల రూ.లలో) |
|---|---|---|---|
| 2009-10 | 110 | 4.74 | 568.13 |
| 2010-11 | 171 | 7.40 | 893.04 |
| 2011-12 | 173 | 7.47 | 896.54 |
| 2012-13 | 98 | 4.05 | 521.75 |
| **మొత్తం** | **552** | **23.66** | **2879.46** |

### చేపట్టే పనులు

**వ్యవసాయ ఆధారిత జీవనోపాధులు**

★ పాడి పశువులు

★ కూరగాయల సాగు

★ వానపాముల ఎరువు

★ గొర్రెల పెంపకం

★ పూలతోటల పెంపకం

★ ఉద్యాన పంటలు

★ పెరటి తోటలు

### వ్యవసాయేతర జీవనోపాధులు

★ బడ్డీకొట్టు

★ పచ్చళ్ళు

★ బుట్టల అల్లకం

★ హోటల్

★ టైలరింగ్

★ విస్తరాకుల తయారీ

★ వడ్రంగి పని

### ఆశించిన అంతిమ ఫలితాలు


★ భూగర్భ జలమట్టం పెరగాలి.

★ త్రాగునీరు లభ్యత, నాణ్యతలో మార్పు కలగాలి.

★ భూమి వినియోగం / పంటల పరిస్థితులలో మార్పు చేస్తూ ఉత్పాదకతను పెంచాలి.

★ నికరంగా పంట విస్తీర్ణం పెరగాలి.

★ పండ్లతోటల విస్తీర్ణం పెరగాలి.




★ పాల దిగుబడి పెరగాలి.

★ జీవనోపాధుల సంఖ్య పెరగాలి.

★ లబ్దిదారుల ఆదాయం పెరగాలి.

★ వలసల నివారణ నూరు శాతం జరగాలి.

★ పచ్చదనం, పశుగ్రాసం విస్తీర్ణం పెంచాలి.

★ సుస్థిరమైన గ్రామస్థాయి సంఘాలు, సమాఖ్యలు ఏర్పడాలి.

సమగ్ర వాటర్‌షెడ్ యాజమాన్య కార్యక్రమం ద్వారా గ్రామంలోని నిరుపేదలు, చిన్న-సన్నకారు రైతులు సుస్థిరమైన జీవనోపాధిని పొంది, విపత్కర పరిస్థితులను ఎదుర్కొని జీవించే అవకాశాలు మెరుగుపడతాయని ఆశిద్దాం.

*- బి.లావణ్య*

*ఇంజనీరింగ్ కన్సల్టెంట్, సిఎస్ఆర్ఎమ్., అపార్డ్*



# ఏరువాక పౌర్ణమి

**అన్నదాతలు అత్యంత వైభవంగా జరుపుకునే పండుగను 'ఏరువాక పౌర్ణమి' అంటారు. ఈ పండుగను ప్రతి సంవత్సరం జ్యేష్ఠ పూర్ణిమ నాడు జరుపుకుంటారు. ఏరు అంటే ఎద్దులను కట్టి దున్నడానికి ప్రారంభమని చెపుతుంటారు. వర్ష రుతువు ప్రారంభం కాగానే జ్యేష్ఠ పూర్ణిమ నాడు రైతులు ఉదయమే ఎడ్లను కడిగి కొమ్ములకు రంగులు పూసి, గజ్జెలు, గంటలతో అలంకరించి, ఎడ్లను కట్టి కాడిని ధూపదీప నైవేద్యాలతో పూజిస్తారు.**

ఈ పండుగ రైతుల పండుగ. తమ కష్టాలు తీరాలని, పంటలు బాగా పండాలని భూతల్లికి పూజలు చేసుకొనే పండుగ ఇది. తొలకరి వానలు కురిసిన తరుణంలో రైతులు ఈ పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా వ్యవసాయ పనిముట్లకు పూజలు నిర్వహిస్తారు. పశువులకు



స్నానాలు చేయించి కొమ్ములకు రంగులు వేసి అలంకరిస్తారు. రంగు రంగుల తాళ్ళు, గజ్జెలు, గంటలు తదితర అలంకరణలతో ఎద్దులను ముస్తాబు చేస్తారు. వీధులలో ఎడ్ల బండ్లతో ఊరేగింపు నిర్వహిస్తారు. పోటాపోటీగా ఎద్దులతో ఏరువాక తాడును తెంచి ఉత్సవాలు జరుపుకుంటారు.

ఈ సందర్భంగా రైతులు ఉదయం గ్రామ సమీపంలో ఉన్న చెరువులు, కుంటల్లో ఎడ్లకు స్నానాలు చేయించి, ఎద్దులకు వివిధ రకాలైన వస్తువులు తినిపిస్తారు. కొందరు కోడిగుడ్లను తాగిస్తారు. ఏరువాక పౌర్ణమి నుంచి వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి. దీంతో పని ఒత్తిడికి గురయ్యే ఎద్దులకు బలం కోసం కోడిగుడ్లు మంచివని వారి అభిప్రాయం. కొన్ని చోట్ల వారికి పసుపు, ఉల్లిపాయ, వాము, కోడిగుడ్లు తినిపించి, సారాయి తాగిస్తారు. ఇలా చేయటం వలన వర్షాకాలంలో ఎడ్లకు ఎలాంటి రోగాలు రావని వారి నమ్మకం.

కాడెద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎద్దులకు భక్ష్యాలు తినిపిస్తారు. పొలాలకు వెళ్ళి భూతల్లికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఎద్దులను రంగులు, రకరకాల బట్టలతో అలంకరించి డప్పులు, మేళతాళాలతో ఊరేగిస్తారు. ఎడ్లు అంటు రోగాల బారిన పడకుండా వాటికి ఆయుర్వేద మందులను, నూనెలను తాగిస్తారు.

గ్రామాలలో జాతర వాతావరణం నెలకొంటుంది. ఆడపడుచులు, పుట్టింటికి రావడంతో రకరకాల పిండి వంటలు చేస్తారు. ముఖ్యంగా ఎడ్ల పందాల హోరు కనిపిస్తుంది. ఎద్దులను అలంకరించి, వాటిని పందెం పరుగు వేయించి, వెనకాల ఊరి కుర్రకారు పరుగులు తీస్తారు. గెలిచిన వారికి బహుమానాలు ఇస్తారు.



# ల్యాబ్-టు-ల్యాండ్ కార్యక్రమంపై అపార్డులో ఉన్నతస్థాయి సమావేశం

**ల్యాబ్-టు-ల్యాండ్ కార్యక్రమం తీరుతెన్నులపై వివిధ రాష్ట్రాల ఎస్.ఐ.ఆర్.డి. ప్రతినిధులతో ఒక ఉన్నతస్థాయి సమావేశం ఎ.ఎం.ఆర్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీలో జరిగింది.**

ఈ సమావేశానికి కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి అదనపు కార్యదర్శి శ్రీ ఎస్.ఎమ్. విజయానంద్, ఐ.ఎ.ఎస్. ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రాష్ట్రాల నుండి సమావేశానికి హాజరైన ఎస్.ఐ.ఆర్.డి. ప్రతినిధులను ఆయా రాష్ట్రాలలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల వ్యవస్థ గూర్చి అడిగి తెల్సుకున్నారు.

ఏ ఏ రాష్ట్రాలలో బి.ఎన్.వి.ల వ్యవస్థ ఏ విధంగా అమలు జరుగుతుంది. వారు ఏ ఏ అంశాలపై పనిచేస్తున్నారు, ఏ ఏ రాష్ట్రాలలో ఏ ఏ పద్ధతుల్లో బి.ఎన్.వి.లకు శిక్షణ అందజేస్తున్నారు. బి.ఎన్.వి.లలో స్త్రీ, పురుష ప్రాతినిధ్యం ఏ విధంగా వుంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యం ఎంత వరకూ ఉంది, మొదలైన అంశాలు గూర్చి ఈ సమావేశంలో పాల్గొన్న ఎస్.ఐ.ఆర్.డి ప్రతి నిధులను అడిగి తెల్సుకున్నారు. తదుపరి అపార్డ్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ల్యాబ్-టు-ల్యాండ్, కీ-క్యాప్ కార్యక్రమం గూర్చి అపార్డ్ విశ్రాంత కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐఎఎస్ వివరించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదల కోసం అపార్డ్ కృషి చేస్తుందని వివరించారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా చేరిన ప్రతి ఒక్క బి.ఎన్.వి.కీ వినూత్న పద్ధతుల్లో మంచి శిక్షణను అపార్డ్ అందజేస్తుందని వివరించారు. ఇప్పటివరకు అపార్డ్ 38,500 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లను తయారుజేసిందని తెలిపారు. పారిశుధ్యం, త్రాగునీరు, లింగ సమానత్వం, ఆరోగ్యం, విద్య, పర్యావరణం, పరిశుభ్రత మొదలైన అంశాలపై బి.ఎన్.విలకు అపార్డ్ శిక్షణ అందజేయడం జరగుతుందని వివరించారు.

గ్రామీణాభివృద్ధి పథకాల సమాచారాన్ని ప్రజలకు చేర్చడంలోనూ, గ్రామీణ ప్రాంతాలలో సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్క రించటం లో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రధాన భూమిక పోషిస్తున్నారని వివరించారు.

ఈ సమావేశంలో గుజరాత్ ఎస్.ఐ.ఆర్.డి. డైరెక్టర్ శ్రీ పి.ఎ. షాన్, ఐ.ఎ.ఎస్., ఉత్తరప్రదేశ్ ఎస్.ఐ.ఆర్.డి. జాయింట్ డైరెక్టర్ డా॥ ఓ.పి. పాండే, తమిళనాడు ఎస్.ఐ.ఆర్.డి. అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ కె. రవికుమార్, ఎమ్.ఓ.ఆర్.డి. నుండి శ్రీ ఇ. జోష్, సి.ఆర్.కె. నాయర్ మరియు అపార్డ్ సెంటర్‌హెడ్‌లు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

సాయంకాలం గ్రామంలోని రైతులంతా మంగళవాద్యాలతో ఊరేగింపుగా పొలాలకు వెళ్ళి దుక్కి ప్రారంభిస్తారు. ఊరి వాకిట గోగునారతో చేసిన తోరణం కడతారు. దాన్ని చెర్నాకోలతో కొట్టి ఎవరికి దొరికిన పీచును వారు తీసుకుపోతారు. ఇది పశువులకు మేలు చేస్తుందని నమ్మకం. ఐరోపా దేశాల్లోని మేపోల్ ఇటువంటి పండుగే.

ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఎద్దులను అలంకరించేందుకు వినియోగించే సామగ్రి కొనుగోలు కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో ముందు రోజున కొనుగోళ్ళు జరుపుతారు. ఎద్దులను అలంకరించేందుకు వినియోగించే వివిధ రకాల తాళ్ళు, గంటలు, గజ్జెలు, తదితరాలను రైతులు కొనుగోలు చేస్తారు.

*మంత్ర యజ్ఞపరా విప్రా సీయజ్ఞాశ్చ కర్షకా:*
*గిరి యజ్ఞస్థథాగోపా: ఇజ్యాస్మాభిర్గిరిర్వనే ॥*

అని శ్రీకృష్ణ పరమాత్మ గోపాలురకు గిరి యజ్ఞం, కర్షకులకు ఏరువాక యజ్ఞంగా, బ్రాహ్మణులు మంత్రజపము యజ్ఞమని చేస్తారని తెలుపగా, విష్ణుపురాణం దీనిని ఏరువాక సీతాయజ్ఞమని పేర్కొంటుంది.

ఈ ఏరువాక పండుగ అతి ప్రాచీనమైనది. పూర్వం శ్రీకృష్ణదేవరాయ సార్వభౌముడు రైతన్నల కృషిని అభినందించి తగిన రీతిలో రైతు సోదరులను ప్రోత్సహించినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. అలాగే శుద్ధోదన మహారాజు ఆనాడు కపిల వస్తులో లాంఛనంగా ఈ ఏరువాకను ప్రారంభిస్తూ, ఒక బంగారు రంగు నాగలిని కర్షకులకు అందించినట్లు గాథలున్నాయి.

ఒకప్పుడు ప్రతి సంవత్సరం కనిపించే ఈ సంప్రదాయ పండుగ ఇప్పుడు మెల్లగా కనుమరుగవుతోంది. ఈ పండుగను పెద్దఎత్తున నిర్వహించటానికి రైతులలో చైతన్యం తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది.

*- ఎమ్. మొగలయ్య*
*ఫ్యాకల్టీ మెంబర్, సిఎన్ఆర్ఎమ్, అపార్డ్*

Printed & Published by: Shasibhushankumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : **Shasibhushankumar**